RNI No.TELTEL/2005/16755

# ప్రజాబలం

PRAJABALAM Telugu Daily తెలుగు దినపత్రిక

Website: prajabalam.in

Cell: 9292104449 / 9848384973
SRAVANTHI Enterprises
OFFSET PRINTERS

We undertake Printing of Daily News Papers

హైదరాబాద్ 29 అక్టోబర్ 2026 గురువారం | పేజీలు:12 | వెల రూ.2.00 | సంపుటి:22 | సంచిక:129

## ప్రభుత్వ ఉద్యోగులు ఏఐ పై అవగాహన పెంపొందించుకోవాలి

**ప్రభుత్వ ఉద్యోగులు ఆధునిక సాంకేతికతలో అప్‌డేట్ కావాలి**
**ఏఐతో ప్రజలకు వేగవంతమైన, మెరుగైన సేవలు అందించాలి**
**కార్యాలయాల్లో ఆదా అయ్యే సమయం ప్రజలకు తిరిగి అందాలి**
**'ఏఐ సాక్షమ్' ప్రారంభోత్సవంలో**
**ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క**



మారుతున్న సాంకేతిక పరిజ్ఞానానికి అనుగుణంగా రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులందరూ కృత్రిమ మేధస్సు (ఏఐ)పై అవగాహన పెంపొందించుకుని, తమ రోజువారీ విధుల్లో సమర్థవంతంగా వినియోగించుకోవాలని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క పిలుపునిచ్చారు. ప్రణాళికా శాఖ, టీజీ మ్యాథ్ ఆధ్వర్యంలో ప్రభుత్వ ఉద్యోగులకు అందిస్తున్న ఏఐ శిక్షణను సద్వినియోగం చేసుకుని, ఆధునిక సాంకేతిక నైపుణ్యాలను పెంపొందించుకోవాలని సూచించారు. ఏఐ వినియోగం వల్ల ప్రభుత్వ కార్యాలయాల్లో పనులు వేగవంతం కావడంతోపాటు, సామాన్య ప్రజల సమస్యలు సకాలంలో పరిష్కారం కావాలి. కార్యాలయాల్లో ఆదా అయ్యే సమయం ప్రజలకు మెరుగైన సేవల రూపంలో తిరిగి అందాలి. ప్రజల జీవితాల్లో కనిపించే సానుకూల మార్పే ఏఐ వినియోగానికి అసలైన గీటురాయి అని స్పష్టం చేశారు.

మిగతా 2 లో

## లక్షలాది నిరుద్యోగులకు మంత్రి పొంగులేటి జన్మదిన కానుక

**పీఎస్ఆర్ యువ నేస్తం పేరిట ఉచిత ఆన్‌లైన్ శిక్షణ ప్రారంభం**
**ఇప్పటివరకు లక్ష మందికి పైగా పేర్ల నమోదు- ఎంతమందికైనా శిక్షణ ఇస్తాం**
**ఆర్‌సీ ఎగ్జామ్స్ సంస్థ ఆధ్వర్యంలో యువతకు అండగా పీఎస్ఆర్ యువ నేస్తం**
**ఏడాది పాటు ఉచిత శిక్షణ.. అవసరమైతే గడువు పొడిగింపు**
**గతంలో 2,300 మందికి శిక్షణ.. 462 మందికి ప్రభుత్వ ఉద్యోగాలు**
**మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి**

హైదరాబాద్: రాష్ట్రంలోని నిరుద్యోగ యువతీ యువకులకు పోటీ పరీక్షల్లో విజయం సాధించేందుకు పీఎస్ఆర్ ఛారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో పీఎస్ఆర్ యువ నేస్తం పేరిట ఆన్‌లైన్‌లో ఎన్ని లక్షల మందికైనా ఉచిత శిక్షణ అందించనున్నట్లు రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్ , సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ప్రకటించారు. . ప్రతిష్ఠాత్మక ఆర్‌సీ ఎగ్జామ్స్ సంస్థ సహకారంతో రాష్ట్రవ్యాప్తంగా వివిధ ప్రభుత్వ ఉద్యోగాల పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్న అభ్యర్థులకు ఈరోజు నుంచి ఏడాది పాటు ఈ ఉచిత శిక్షణ ఉంటుందని అవసరమైతే ఈ శిక్షణా కాలాన్ని పొడిగిస్తామని తెలిపారు.

మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తన పుట్టినరోజు సందర్భంగా బుధవారం సచివాలయంలోని తన ఛాంబర్‌లో ఈ కార్యక్రమాన్ని లాంఛనంగా ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మంత్రి వాకిటి శ్రీహరి, ఎంపీ రామసహాయం రఘురామిరెడ్డి, ఎమ్మెల్యేలు వేముల వీరేశం, లక్ష్మారెడ్డి పాల్గొన్నారు.



మిగతా 2 లో

## అర్నబ్ తుఫాన్ ప్రభావంపై అప్రమత్తంగా ఉండాలి

**ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల కలెక్టర్లకు మంత్రి పొంగులేటి ఆదేశాలు**
**భారీ వర్షాలు, ఈదురుగాలుల నేపథ్యంలో ముందస్తు జాగ్రత్త చర్యలు చేపట్టండి**
**పరిస్థితిని నిరంతరం పర్యవేక్షించాలని సూచనలు**

**ఖమ్మం జిల్లా బ్యూరో ప్రజాబలం అక్టోబర్ 28:** బంగాళాఖాతంలో కొనసాగుతున్న తీవ్ర తుఫాన్ అర్నబ్ ప్రభావంతో ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల్లో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున ప్రజలు అప్రమత్తంగా ఉండాలని రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణం, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి సూచించారు. తుఫాన్ ప్రభావంతో ఈదురుగాలుల నేపథ్యంలో ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు, నష్టం కలగకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు.

ఈ మేరకు బుధవారం ఖమ్మం జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్., భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కలెక్టర్ అంకిత్‌తో ఫోన్‌లో మాట్లాడిన మంత్రి.. వాతావరణ పరిస్థితులపై ఆరా తీశారు. రెండు జిల్లాల్లోనూ అప్రమత్తంగా ఉండి, అవసరమైన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. తుఫాన్ పరిస్థితులను ఎప్పటికప్పుడు సమీక్షించాలని, సంబంధిత శాఖల అధికారులు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. ముందస్తు ఏర్పాట్లు చేయాలని, పరిస్థితులకు అనుగుణంగా తక్షణ చర్యలు చేపట్టాలని కలెక్టర్లకు సూచించారు.



## రాష్ట్రంలో ఎమర్జెన్సీ పాలన నడుస్తోంది: కాంగ్రెస్ సర్కార్‌పై హరీశ్ రావు ధ్వజం

**మూసీ ప్రాజెక్టుపై ప్రజాభిప్రాయ సేకరణకు వెళ్లకుండా బీఆర్ఎస్ నేతలను దిగ్బంధించారన్న హరీశ్**
**కరవుతో అల్లాడుతున్న రైతులను ఆదుకోవడం చేతకాని ప్రభుత్వమని విమర్శ**
**ప్రతిపక్షాల గొంతును ఎంతకాలం అణచివేస్తారని ప్రశ్న**

మూసీ నది ప్రాజెక్టుపై ప్రజాభిప్రాయ సేకరణకు హాజరుకాకుండా బీఆర్ఎస్ నేతలను గృహనిర్బంధం చేశారని ఆ పార్టీ నేత, మాజీ మంత్రి హరీశ్ రావు మండిపడ్డారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఎమర్జెన్సీ తరహా పాలన సాగిస్తూ, ప్రతిపక్షాల గొంతు నొక్కుతోందని ఆయన తీవ్రస్థాయిలో విమర్శించారు.



మిగతా 4 లో

## టాటా గ్రూప్‌ను నాశనం చేస్తున్నారు: మోదీ, అమిత్ షాలపై రాహుల్ గాంధీ ఫైర్

**టాటా గ్రూప్‌ను నేరపూరితంగా నాశనం చేస్తున్నారన్న రాహుల్ గాంధీ**
**మోదీ, అమిత్ షాలపై తీవ్ర విమర్శలు**
**భయంతోనే వ్యాపారవేత్తలు మౌనంగా ఉన్నారని ఆరోపణ**

లోక్‌సభ ప్రతిపక్ష నేత, కాంగ్రెస్ ఎంపీ రాహుల్ గాంధీ టాటా గ్రూప్‌పై సంచలన ఆరోపణలు చేశారు. టాటా సంస్థను 'నేరపూరితంగా నాశనం' చేస్తున్నారని, అయినా దేశంలోని వ్యాపారవేత్తలు భయంతో నోరు మెదపడం లేదని ఆయన తీవ్రస్థాయిలో విమర్శించారు. ఈ మేరకు 'ఎక్స్' వేదికగా ఆయన ఒక పోస్ట్ చేశారు.

మిగతా 4 లో



## కరువును ఎదుర్కొనేందుకు అఖిలపక్ష సూచనల మేరకు చర్యలు

**ప్రకృతి విపత్తును అధిగమించేందుకు సానుకూల, నిర్మాణాత్మక వైఖరి**
**తెలంగాణ రాష్ట్రం, రైతుల ప్రయోజనాల పరిరక్షణకు ప్రభుత్వం కట్టుబడి ఉంది**
**మంత్రి కెప్టెన్ ఎన్.ఉత్తమ్ కుమార్ రెడ్డి స్పష్టీకరణ**

హైదరాబాద్: కరువు పరిస్థితులను అధిగమించేందుకు తెలంగాణ ప్రభుత్వం సానుకూల, నిర్మాణాత్మక దృక్పథంతో ముందుకు సాగుతుందని రాష్ట్ర నీటిపారుదల, పౌరసరఫరాల శాఖల మంత్రి కెప్టెన్ ఎన్. ఉత్తమ్‌కుమార్‌రెడ్డి భరోసా ఇచ్చారు.

అంతర్రాష్ట్ర నదీజలాల అంశాల్లో తెలంగాణ రాష్ట్ర ప్రయోజనాలను, రాష్ట్ర రైతుల ప్రయోజనాలను పరిరక్షించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని స్పష్టం చేశారు.

మిగతా 3 లో



## రైల్ నిలయం వద్ద కాంగ్రెస్ ధర్నా.. మహేశ్‌గౌడ్, పొన్నం సహా పలువురు అరెస్ట్



హైదరాబాద్: నవంబర్ 1న ఢిల్లీలో తలపెట్టిన నిరసన కార్యక్రమానికి ప్రత్యేక రైళ్లను ఏర్పాటు చేసేందుకు రైల్వేశాఖ నిరాకరించిందని ఆరోపిస్తూ కాంగ్రెస్ నేతలు రైల్ నిలయం వద్ద ఆందోళనకు దిగారు. టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్‌ఆధ్వర్యంలో మంత్రి పొన్నం ప్రభాకర్, ఎమ్మెల్యేలు శ్రీగణేష్, నవీన్ యాదవ్, ఎంపీ అనిల్ కుమార్ యాదవ్, దానం నాగేందర్ తదితరులు ధర్నాకు దిగారు. కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు ఒక్కసారిగా రైల్ నిలయంలోకి దూసుకొచ్చేందుకు ప్రయత్నించడంతో పోలీసులు వారిని అడ్డుకున్నారు. దీంతో రైల్ నిలయం వద్ద కాసేపు ఉద్రిక్త పరిస్థితి నెలకొంది. ధర్నా చేస్తున్న నాయకులను అరెస్టు చేసి మోండా మార్కెట్ పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్ గౌడ్ మాట్లాడుతూ.. 6 రోజుల క్రితమే ఎంపీ అనిల్ యాదవ్ రైల్వే జీఎంను కలిసి తమ నిరసన కార్యక్రమానికి రెండు ప్రత్యేక రైళ్లు కేటాయించాలని కోరినట్లు తెలిపారు. నిన్నటి వరకు కాలయాపన చేసిన రైల్వే అధికారులు సానుకూలంగా ఉన్నట్లు నమ్మించి.. చివరికి అనుమతి నిరాకరిస్తున్నట్లు నిన్న రాత్రి సమాచారం ఇచ్చారని పేర్కొన్నారు. ప్రత్యేక రైళ్ల కేటాయింపునకు దక్షిణ మధ్య రైల్వే నిరాకరించడంతో కాంగ్రెస్ నాయకులు ఆగ్రహానికి గురై రైల్ నిలయం వద్ద ఆందోళనకు దిగినట్లు ఆయన తెలిపారు. కేంద్ర ప్రభుత్వం ఎన్ని అడ్డంకులు సృష్టించినా ఢిల్లీలో నిరసన కార్యక్రమానికి హాజరవుతామని, సీఈసీ జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేసేంతవరకు వదిలిపెట్టేది లేదని హెచ్చరించారు.

## రేవంత్ రెడ్డి ని కలిసిన శ్రీ కృష్ణ సదర్ సమ్మేళనం ఉత్సవ కమిటీ ప్రతినిధులు.



వచ్చే నెల 4న ఎన్టీఆర్ స్టేడియంలో జరిగే సదర్ ఉత్సవాలకు ఆహ్వానం.

సదర్ ఉత్సవాలను రాష్ట్ర పండుగగా ప్రకటించినందుకు ధన్యవాదాలు తెలిపిన కమిటీ ప్రతినిధులు.

కార్యక్రమంలో పాల్గొన్న కృష్ణ సదర్ సమ్మేళనం ఉత్సవ కమిటీ ఛైర్మన్, మాజీ ఎంపీ అంజన్ కుమార్ యాదవ్, రాజ్యసభ సభ్యుడు అనిల్ కుమార్ యాదవ్, జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే నవీన్ యాదవ్, యాదాద్రి బోర్డు సభ్యురాలు ఈశ్వరమ్మ యాదవ్, మేడ్చల్ డీసీసీ అధ్యక్షుడు వజ్రేష్ యాదవ్, ఇతర నాయకులు.

ప్రజాబలం

29 అక్టోబర్ 2026 గురువారం

# 21 లక్షల మంది ఫాలోవర్లు.. 33 ఓట్లు!

మెరిసేదంతా బంగారం కాదు..అన్నమాట.. తాజాగా ఎన్నికల్లో చూస్తే తెలిసొస్తుంది. సోషల్ మీడియాలో 21 లక్షల మంది మనల్ని ఫాలో అవుతుంటే.. మనం ఒక గ్రామానికి సర్పంచ్ కావడం పెద్ద కష్టమేమీ కాదని అనిపించొచ్చు. కానీ రాజస్థాన్‌కు చెందిన ఓంప్రకాశ్ బిష్ణోయ్‌కు ఓటర్లు ఒక చిన్న సందేశం ఇచ్చారు. .ఇన్‌స్టాగ్రామ్, ఫేస్‌బుక్, యూట్యూబ్‌లలో కలిపి 21 లక్షలకు పైగా ఫాలోవర్లు ఉన్న ఈ జ్యోతిష్యుడికి సర్పంచ్ ఎన్నికల్లో దక్కినవి కేవలం 33 ఓట్లు.

.ఓంప్రకాశ్‌కు ఇన్‌స్టాగ్రామ్‌లో 14 లక్షలకు పైగా ఫాలోవర్లు, ఫేస్‌బుక్‌లో 2 లక్షలకు పైగా అనుచరులు, యూట్యూబ్‌లో సుమారు 5.5 లక్షల మంది సబ్‌స్క్రైబర్లు ఉన్నారు. ఈ సంఖ్యలన్నీ కలిపి చూస్తే, ఆయన ఎన్నికల ప్రచారానికి బయలుదేరినప్పుడు ఊరంతా కాదు, ఊళ్లన్నీ కదిలివస్తాయని ఎవరైనా అనుకోవచ్చు. కానీ ఆయన పోటీ చేసింది రాజస్థాన్‌లోని జోధ్‌పూర్ జిల్లా ఓసియాన్ తహసీల్ పరిధిలో ఉన్న ఇండోన్ కీ ధానీ-ఎఎ గ్రామ పంచాయతీలో. ఓటర్లు సుమారు 1,600 మంది. వచ్చిన ఓట్లు 33.మరో అభ్యర్థి అయిన ఉపాధ్యాయుడికి 527 ఓట్లు వచ్చాయి. చివరకు కార్ల వ్యాపారం చేసే అభ్యర్థి సర్పంచ్‌గా గెలిచారు. ఈ ఫలితాన్ని చూస్తే ఒక విషయం అర్థమవుతుంది. ఇంటర్నెట్‌లో జనాన్ని సంపాదించడం ఒక కళ కావచ్చు. కానీ ఎన్నికల్లో జనాన్ని సంపాదించడం మరో కళ. మొదటి కళకు మంచి కెమెరా, ఆకర్షణీయమైన వీడియో, సరైన అల్గారిథమ్ సరిపోవచ్చు. రెండో కళకు మాత్రం ప్రజలు మిమ్మల్ని నమ్మాలి. ఆ నమ్మకాన్ని డబ్బు పెట్టి కొనలేరు, ఫాలోవర్ల సంఖ్య చూపించి అప్పుగా తీసుకోలేరు.ఓంప్రకాశ్ జ్యోతిష్యుడు.

ఓంప్రకాశ్ సుమారు 1,500 ఆవులున్న గోశాలను నిర్వహిస్తున్నానని, దాని కోసం 30 బిగాల భూమిని దానం చేశానని తెలిపారు. సర్పంచ్‌గా గెలిస్తే ప్రతి చిన్నారికి విద్య అందించడం, అనాథ జంతువులను ఆదుకోవడం, ప్రభుత్వ పథకాలు ప్రజలకు చేరేలా చూడటం తన లక్ష్యాలని చెప్పారు. గ్రామస్థులే తనను ఎన్నికల్లో పోటీ చేయమని ప్రోత్సహించారని కూడా వెల్లడించారు.ఇవన్నీ మంచి పనులే కావచ్చు. కానీ మంచి పని చేశామని చెప్పడం, ఆ పనుల ఆధారంగా ఓట్లు సంపాదించడం రెండూ వేర్వేరు విషయాలు. గోశాలలోని ఆవులు మనం చేసిన సేవకు సాక్షులుగా నిలబడవచ్చు. కానీ అవి పోలింగ్ బూత్‌కు వెళ్లి ఓటు వేయలేవు. సోషల్ మీడియాలోని ఫాలోవర్లు కూడా అదే పని చేశారు. తెర మీద కనిపించారు. ఓట్ల లెక్కలో మాత్రం కనిపించలేదు.గ్రామస్థులు పోటీ చేయమని ప్రోత్సహించారట. ప్రోత్సహించడం ఉచితం కాబట్టి చాలామంది చేసి ఉండొచ్చు అక్కడ మాట ఇచ్చినవాడే ఓటు వేస్తాడని హామీ లేదు. ఓటమి తర్వాత ఓంప్రకాశ్ వెల్లడించిన వివరాల ప్రకారం, తనకు వచ్చిన 33 ఓట్లలో 11 ఓట్లు కుటుంబ సభ్యులవే. మిగిలినవి సన్నిహితులు, తనతో కలిసి చదువుకున్నవారు వేశారని తెలిపారు.అంటే 21 లక్షల మంది ఫాలోవర్లున్న వ్యక్తికి ఎన్నికల సమయంలో కుటుంబ సభ్యులు, స్నేహితుల మద్దతే ప్రధానంగా కనిపించింది. ఈ లెక్క చూసి సోషల్ మీడియా కంపెనీలు బాధపడాల్సిన అవసరం లేదు. అవి తమ పని సరిగ్గానే చేశాయి. ఫాలోవర్లను చూపించాయి, వ్యూస్‌ను లెక్కించాయి, లైక్‌లను భద్రపరిచాయి. ఓట్లను మాత్రం హామీ ఇవ్వలేదు.

ఓంప్రకాశ్ ఓటమితో వెనక్కి తగ్గబోనని, గ్రామ ప్రజల కోసం పనిచేస్తూనే ఉంటానని చెప్పారు. అది స్వాగతించదగిన నిర్ణయమే. ఎన్నికల్లో గెలవకపోయినా ప్రజాసేవ చేయవచ్చు. గ్రామస్థుల నమ్మకాన్ని సంపాదించవచ్చు. తాను చెప్పిన లక్ష్యాలను ఆచరణలో చూపించవచ్చు. భవిష్యత్తులో ప్రజలు ఆయన పనిని చూసి నిర్ణయం తీసుకునే అవకాశం ఉంటుంది.కానీ ఈ ఎన్నిక ఒక చిన్న హెచ్చరికను మాత్రం ఇచ్చింది. ప్రజాస్వామ్యంలో ఒక చిన్న కుర్చీ సంపాదించాలన్నా ప్రజల విశ్వాసం కావాలి. ఫాలోవర్లు మీ పోస్టును పైకి తీసుకెళ్తారు. ఓటర్లు మాత్రమే మిమ్మల్ని పదవిలోకి తీసుకెళ్తారు. ఆ రెండింటి మధ్య తేడా తెలియకపోతే, లక్షల మందిని వెనకేసుకొచ్చిన నాయకుడికి కూడా చివరికి తన కుటుంబ సభ్యుల ఓట్లనే లెక్కపెట్టుకోవాల్సి వస్తుంది.

# ప్రభుత్వ ఉద్యోగులు ఏఐ పై అవగాహన పెంపొందించుకోవాలి



మొదటి పేజీ తరువాయి

హైదరాబాద్‌లోని ఎంసీఆర్ హెచ్‌ఆర్‌డీలో ప్రణాళికా శాఖ సహకారంతో టీజీ మ్యాథ్ చేపట్టిన 'ఏఐ సాక్షమ్' కార్యక్రమాన్ని ఉప ముఖ్యమంత్రి ప్రారంభించి ప్రసంగించారు. ప్రభుత్వ ఉద్యోగుల సామర్థ్యాలను పెంపొందించి, పరిపాలనా వ్యవస్థను మరింత సమర్థవంతంగా తీర్చిదిద్దడమే ఈ కార్యక్రమ ఉద్దేశమని తెలిపారు.

సాంకేతికతలో వస్తున్న మార్పులను ఉద్యోగులు ఎప్పటికప్పుడు అందిపుచ్చుకోవాలని, శిక్షణ ద్వారా నేర్చుకున్న నైపుణ్యాలను ప్రజలకు మెరుగైన సేవలందించేందుకు ఉపయోగించాలని సూచించారు.

ప్రభుత్వ కార్యాలయాల్లో రోజువారీగా నిర్వహించే పనులను మరింత వేగంగా, సమర్థంగా పూర్తి చేసేందుకు ఏఐ సాధనాలు ఉపయోగపడతాయని తెలిపారు. ప్రభుత్వ ఉత్తర్వులను గుర్తించడం, నివేదికలను రూపొందించడం, సమాచారాన్ని విశ్లేషించడం, ప్రజలకు సులభంగా అర్థమయ్యే రీతిలో వివరాలు అందించడం వంటి పనుల్లో ఏఐ ద్వారా సమయం ఆదా చేయవచ్చన్నారు. శిక్షణలో ఉద్యోగులు చురుగ్గా పాల్గొని, తమ విధులకు అనుగుణంగా ఏఐ సాధనాలను ఉపయోగించే పద్ధతులను నేర్చుకోవాలని కోరారు.

ఒక రైతు దరఖాస్తు త్వరగా పరిష్కారం కావడం, పింఛనుదారుడికి తనకు అందాల్సిన ప్రయోజనాలపై స్పష్టమైన సమాచారం లభించడం, ఒక పౌరుడు తన పని కోసం పదేపదే ప్రభుత్వ కార్యాలయానికి వెళ్లాల్సిన అవసరం తగ్గడం వంటి మార్పులు సాంకేతికత వినియోగం ద్వారా సాధ్యపడాలని పేర్కొన్నారు. ఉద్యోగులు ఆదా చేసిన సమయాన్ని ప్రజల సమస్యలను మరింత శ్రద్ధగా పరిశీలించేందుకు, సేవల నాణ్యతను పెంచేందుకు వినియోగించాలని సూచించారు.

ఆర్థిక, ప్రణాళికా రంగాల్లో మెరుగైన ఫలితాలు ప్రజాధనం వినియోగాన్ని విశ్లేషించడం, ప్రాజెక్టుల వ్యయాలను పోల్చడం, పనుల అమలులో జాప్యాలకు కారణాలను గుర్తించడం వంటి అంశాల్లో ఏఐ ఆధారిత సాధనాలు అధికారులకు సహాయపడగలవని ఉప ముఖ్యమంత్రి తెలిపారు. ప్రభుత్వ వనరులను సమర్థంగా వినియోగించుకోవడానికి, అభివృద్ధి కార్యక్రమాల అమలును మెరుగ్గా పర్యవేక్షించడానికి ఈ సాంకేతికతను ఉపయోగించుకోవచ్చన్నారు. ప్రణాళికా రంగంలో వివిధ ప్రాంతాల్లో ప్రభుత్వ సేవలు ఎలా అందుతున్నాయో విశ్లేషించడం, సంక్షేమ పథకాల ప్రయోజనాలు అర్హులైన వారందరికీ చేరుతున్నాయా అనే అంశాలను పరిశీలించడం ద్వారా మెరుగైన ప్రణాళికలు రూపొందించవచ్చని తెలిపారు. గణాంకాలతోపాటు క్షేత్రస్థాయి పరిస్థితులు, ప్రజల అనుభవాలను కూడా పరిగణనలోకి తీసుకోవాలని సూచించారు.

విద్యుత్ రంగంలోనూ ఏఐతో ప్రయోజనాలు విద్యుత్ డిమాండ్‌ను ముందుగానే అంచనా వేయడం, పరికరాల్లో తలెత్తే లోపాలను గుర్తించడం, నిర్వహణ చర్యలను మెరుగుపరచడం వంటి అంశాల్లో ఏఐ ఉపయోగపడుతుందని భట్టి విక్రమార్క పేర్కొన్నారు. సాంకేతిక పరిజ్ఞానాన్ని సమర్థంగా వినియోగించడం ద్వారా విద్యుత్ నిర్వహణను మెరుగుపరిచి, రైతులు, పరిశ్రమలు, ఆసుపత్రులకు నాణ్యమైన సేవలు అందించేందుకు అవకాశాలు పెరుగుతాయని తెలిపారు.

?ఏఐ సాధనాలను ఉపయోగించే సమయంలో సమాచార భద్రత, కచ్చితత్వం, బాధ్యతకు ప్రాధాన్యమివ్వాలని ఉప ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. అనుమతి లేని సాధనాల్లో అధికారిక లేదా వ్యక్తిగత సమాచారాన్ని నమోదు చేయరాదన్నారు. ఏఐ రూపొందించిన సమాచారాన్ని అధికారిక రికార్డుల్లో చేర్చే ముందు, నిర్ణయాలకు ఆధారంగా ఉపయోగించే ముందు అధికారులు ధ్రువీకరించాలని సూచించారు. సాంకేతికత సహాయంతో పనులు నిర్వహించినప్పటికీ తుది నిర్ణయాలు, వాటికి సంబంధించిన బాధ్యత అధికారులదేనని పేర్కొన్నారు.ప్రతి శాఖలో ఏఐ వినియోగానికి అనువైన పనులను గుర్తించి, ముందుగా ప్రయోగాత్మకంగా అమలు చేయాలని సూచించారు. ఫలితాలను పరిశీలించి, ప్రజలకు కలిగే ప్రయోజనం, పనితీరు, కచ్చితత్వం ఆధారంగా విస్తరణ చేపట్టాలని తెలిపారు.ప్రణాళికా శాఖ, టీజీ మ్యాథ్ ఆధ్వర్యంలో అందిస్తున్న ఈ శిక్షణను ప్రభుత్వ ఉద్యోగులందరూ ఒక అవకాశంగా భావించి సద్వినియోగం చేసుకోవాలని భట్టి విక్రమార్క పిలుపునిచ్చారు. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంపై నిరంతరం అవగాహన పెంపొందించుకుంటూ, నేర్చుకున్న నైపుణ్యాలను విధుల్లో ఆచరణాత్మకంగా వినియోగించాలని కోరారు. మరింత సమర్థులైన ఉద్యోగులు, వేగవంతమైన ప్రభుత్వ సేవలు, ప్రజలకు మెరుగైన ఫలితాలు---ఇదే 'ఏఐ సాక్షమ్' కార్యక్రమ లక్ష్యమని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ప్లానింగ్ సెక్రటరీ గౌరవ్ ఉప్పల్, డిప్యూటీ సీఎం సెక్రటరీ, ట్రాన్స్కో సీఎం డి కృష్ణ భాస్కర్, టీజీ మ్యాథ్ ఎండి పూజ, ఎం సి ఆర్ హెచ్ ఆర్ డి డైరెక్టర్ జనరల్ శాంతి కుమారి తదితరులు పాల్గొన్నారు.

# లక్షలాది నిరుద్యోగులకు మంత్రి పొంగులేటి జన్మదిన కానుక

నిరుద్యోగ యువతకు అండగా నిలవడమే లక్ష్యం

ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ.. నిరుద్యోగ యువతీ యువకులకు నాణ్యమైన శిక్షణ అందించి, ప్రభుత్వ ఉద్యోగాలు సాధించేం దుకు అవసరమైన అవకాశాలను కల్పించాలనే ఉద్దేశంతో ఈకార్యక్రమాన్ని ప్రారంభిం చామన్నారు.

గత 30 ఏళ్లుగా ఆర్‌సీ ఎగ్జామ్స్ సంస్థ ఎంతోమంది ప్రతిభావంతులను తీర్చిదిద్దిందని, ఐఏఎస్ వంటి ఉన్నతస్థాయి ఉద్యోగాలు సాధించేందుకు కూడా అభ్యర్థులకు మార్గనిర్దేశం చేసిందని తెలిపారు. ఈ సంస్థలో కరీం, కృష్ణారెడ్డి, మేముల సైదులు వంటి అనుభవజ్ఞులైన అధ్యాపకులు, ఫ్యాకల్టీ సభ్యులు ఈ శిక్షణ కార్యక్రమంలో భాగస్వాములుగా ఉండటం అభ్యర్థులకు ఎంతో ఉపయోగకరమని అన్నారు.

గత అనుభవమే 'యువ నేస్తం'కు స్ఫూర్తి

2013లో రాజకీయాల్లోకి ప్రవేశించి, 2014లో ఎంపీగా ఎన్నికైన అనంతరం 2016లో ఖమ్మం ప్రాంతంలో నిరుద్యోగ యువత కోసం ప్రత్యేక శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించినట్లు మంత్రిగారు గుర్తుచేశారు. అప్పట్లో సుమారు 2,300 మంది నిరుద్యోగులకు ఆఫ్‌లైన్‌లో శిక్షణ అందించడంతో పాటు అవసరమైన అన్ని సౌకర్యాలను కల్పించినట్లు చెప్పారు. ఆ శిక్షణ పొందిన వారిలో 462 మంది వివిధ ప్రభుత్వ శాఖల్లో ఉద్యోగాలు సాధించారని వెల్లడించారు. ఉద్యోగాలు సాధించిన అభ్యర్థులు తమ కృతజ్ఞతాభావాన్ని వ్యక్తం చేసిన సందర్భాలు తనను ఎంతగానో కదిలించాయని, వారి ఆనందాన్ని చూసి తన కళ్లలో నీళ్లు తిరిగాయని మంత్రి భావోద్వేగంగా పేర్కొన్నారు. ఆ అనుభవమే మరింతమంది నిరుద్యోగ యువతకు శిక్షణ అందించాలనే సంకల్పానికి ప్రేరణగా నిలిచిందన్నారు. గతంలో ఒక ప్రాంతానికి పరిమితమైన శిక్షణను ఇప్పుడు ఆన్‌లైన్ విధానం ద్వారా రాష్ట్రవ్యాప్తంగా అందుబాటులోకి తీసుకొస్తున్నట్లు తెలిపారు.

ఇంటి వద్ద నుంచే నాణ్యమైన శిక్షణ

ప్రస్తుత ఆన్‌లైన్ శిక్షణ విధానం వల్ల అభ్యర్థులు హైదరాబాద్ కు రాకుండానే తమ ఇళ్ల వద్ద నుంచే శిక్షణ పొందవచ్చని మంత్రి తెలిపారు. దూర ప్రాంతాల్లో నివసించే యువతకు ప్రయాణ ఖర్చులు, వసతి తదితర ఇబ్బందులు లేకుండా ఈ విధానం ఉపయోగపడుతుందని చెప్పారు. నాణ్యమైన శిక్షణ అందరికీ అందుబాటులో ఉండాలనే ఉద్దేశంతోనే ఈ నిర్ణయం తీసుకున్నట్లు వివరించారు. ఒక్కో అభ్యర్థికి ఇలాంటి శిక్షణ అందించేందుకు సాధారణంగా కనీసం రూ.లక్ష వరకు ఖర్చవుతుందని, పుస్తకాలు, ఇతర శిక్షణా సామగ్రి కోసమే సుమారు రూ.14 వేల నుంచి రూ.30 వేల వరకు వ్యయం అవుతుందని మంత్రి పేర్కొన్నారు. ఈ ఖర్చులన్నింటినీ ట్రస్ట్ భరిస్తుందని, అభ్యర్థులకు శిక్షణతో పాటు అవసరమైన పుస్తకాలు, ఇతర సామగ్రిని ఉచితంగా అందిస్తామని స్పష్టం చేశారు.

లక్ష మందికి పైగా నమోదు.. ఎంతమందికైనా శిక్షణ

'పీఎస్ఆర్ యువ నేస్తం' కార్యక్రమంపై తొలుత కొందరు అనుమానాలు వ్యక్తం చేసినప్పటికీ, ఉచిత శిక్షణ నిజంగానే అందిస్తున్నట్లు తెలుసుకున్న తర్వాత పెద్ద సంఖ్యలో యువత పేర్లు నమోదు చేసుకుంటున్నారని మంత్రి తెలిపారు. ప్రకటన విడుదల చేసిన పది రోజుల్లోనే లక్ష మందికి పైగా అభ్యర్థులు పేర్లు నమోదు చేసుకోవడం ఈ కార్యక్రమంపై యువత చూపుతున్న ఆసక్తికి నిదర్శనమన్నారు.

ఈ కార్యక్రమానికి ఎలాంటి కటాఫ్ తేదీ విధించలేదని, లక్ష మందితోనే పరిమితం కాకుండా ఎంతమంది అభ్యర్థులు ముందుకొచ్చినా శిక్షణ అందించేందుకు సిద్ధంగా ఉన్నామని స్పష్టం చేశారు. వచ్చే ఏడాది వరకు ఏడాది పాటు ఈ శిక్షణ కార్యక్రమం కొనసాగుతుందని, అవసరమైతే శిక్షణా కాలాన్ని మరింత పొడిగిస్తామని తెలిపారు. తెలంగాణలోని నిరుద్యోగ యువతీ యువకులందరికీ ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని సూచించారు.

త్వరలో మరో 15 వేల ఉద్యోగాల భర్తీ

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలో రాష్ట్రంలో ఉద్యోగాల భర్తీకి ప్రజా ప్రభుత్వం ప్రాధాన్యతనిస్తూ ముందుకు సాగుతోందని మంత్రి గారు తెలిపారు. ఇప్పటికే రెండేళ్లలో 72 వేల ఉద్యోగాలను భర్తీ చేసినట్లు పేర్కొన్నారు. త్వరలో సుమారు మరో 15 వేల ఉద్యోగాలను భర్తీ చేయనున్నట్లు వెల్లడించారు. రానున్న కాలంలో మరిన్ని ఉద్యోగాల భర్తీకి సంబంధించి నోటిఫికేషన్లు వెలువడనున్నాయని చెప్పారు.

ప్రభుత్వ ఉద్యోగాల కోసం సిద్ధమవుతున్న అభ్య ర్థులకు సరైన మార్గదర్శకత్వం, నాణ్యమైన శిక్షణ ఎంతో అవసరమని పేర్కొన్న మంత్రి.. ఆ దిశగా 'పీఎస్ఆర్ యువ నేస్తం' కార్యక్రమం ఉపయోగపడుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఆర్థిక పరిస్థితులు, శిక్షణ ఖర్చులు, దూరప్రాంతాల సమస్యలు యువత లక్ష్యసాధనకు అడ్డంకులు కాకూడదనే ఉద్దేశంతోనే ఉచిత ఆన్‌లైన్ శిక్షణకు శ్రీకారం చుట్టినట్లు తెలిపారు.

ప్రభుత్వ ఉద్యోగం సాధించాలనే లక్ష్యంతో కృషి చేస్తున్న ప్రతి నిరుద్యోగ యువతీ యువకుడికి ఈ కార్యక్రమం ఒక అవకాశంగా నిలవాలని, యువత తమ ప్రతిభను నిరూపించుకొని ఉద్యోగాలు సాధించేలా ఈ వేదిక తోడ్పడాలని మంత్రి ఆకాంక్షించారు.

దీపావళి లోగా జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ని ఈరోజు కలిసిన సందర్భంలో పాత్రికేయుల ఇళ్ల స్థలాల అంశం చర్చకు వచ్చిందని మంత్రి పొంగులేటి తెలిపారు. రానున్న దీపావళి లోగా జర్నలిస్టుల ఇళ్ల స్థలాల సమస్య పరిష్కారించేందుకు ముఖ్యమంత్రి సమ్మతించారని తెలిపారు. దీనివలన దీర్ఘకాలిక సమస్య తీరుతుందన్నారు. దీనిపై పాత్రికేయుల స్పందిస్తూ మంత్రిగారి పుట్టినరోజున తమకు శుభవార్త వచ్చిందని హర్షం వ్యక్తం చేశారు.

## మూసీ సుందరీకరణ పేరుతో భారీ దోపిడీకి తెరలేపారు బీఆర్ ఎస్ నేతలు

హైదరాబాద్ నగరం లో మూసీ సుందరీకరణ ప్రాజెక్టుపై రాజకీయ దుమారం రేగింది. రూ.7,345 కోట్ల గ్లోబల్ టెండర్లలో 40 శాతం కమిషన్ రేవంత్ రెడ్డికి వెళ్తుందంటూ బీఆర్ఎస్ నేతలు దాసోజు శ్రవణ్, కార్తీక్ రెడ్డి తీవ్ర ఆరోపణలు చేశారు. రాష్ట్రంలో రైతులు సాగునీరు, తాగునీరు, విద్యుత్ సమస్యలతో ఇబ్బందులు పడుతున్న సమయంలో మూసీ సుందరీకరణకు వేల కోట్లు ఖర్చు చేయడంపై వారు ప్రశ్నలు లేవనెత్తారు. ప్రజలకు అవసరమైన అభివృద్ధి కార్యక్రమాలను పక్కనపెట్టి, మూసీ ప్రాజెక్టుకు ప్రాధాన్యత ఇవ్వడం ఏమిటని నిలదీశారు. మూసీ నిర్వాసితుల సమస్యలను తెలుసుకునేందుకు బీఆర్ఎస్ నేతలు చేపట్టిన మూసీ బాటను పోలీసులు అడ్డుకోవడం, నేతలను నిర్బంధించి కంచన్బాగ్ పోలీస్ స్టేషన్కు తరలించడం ప్రజాస్వామ్య హక్కులను కాలరాయడమేనని విమర్శించారు. కాంగ్రెస్ నేతలకు ఒక న్యాయం.. బీఆర్ఎస్ నేతలకు మరో న్యాయమా అని ప్రశ్నించారు. ఇది రాజకీయ అభిప్రాయ సేకరణ కాదని, మూసీ నిర్వాసితుల అభిప్రాయాలను తెలుసుకునే ప్రజా కార్యక్రమమని స్పష్టం చేశారు. అక్రమ అరెస్టులతో ప్రజల పక్షాన నిలబడే తమ పోరాటాన్ని ఆపలేరని హెచ్చరించారు. మూసీ నిర్వాసితుల గోడు వినడమే తమ లక్ష్యమని, వారి సమస్యలపై పోరాటం కొనసాగిస్తామని బీఆర్ఎస్ నేతలు వెల్లడించారు.

# అర్నబ్ తుఫాన్ నేపథ్యంలో ములుగు జిల్లా అధికారులకు మంత్రి సీతక్క కీలక ఆదేశాలు

## ప్రజలు అప్రమత్తంగా ఉండాలి.. అధికారులు క్షేత్రస్థాయిలో అందుబాటులో ఉండాలి

**ములుగు జిల్లా ప్రజాబలం ప్రతినిధి అక్టోబర్ 28**

**ములుగు**ములుగు: అర్నబ్ తుఫాన్ ప్రభావంతో భారీ ఈదురుగాలులు వీచే అవకాశం ఉన్న నేపథ్యంలో ములుగు జిల్లా అధికారులను రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా, మహిళా శిశు సంక్షేమ శాఖల మంత్రి శ్రీమతి ధనసరి అనసూయ సీతక్క అప్రమత్తం చేశారు.



ప్రజలు తగిన జాగ్రత్తలు పాటిస్తూ అప్రమత్తంగా ఉండాలని సూచించారు అధికారులు క్షేత్రస్థాయి లో అందుబాటులో ఉంటూ వాతావరణ పరిస్థితులను ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని ఆదేశించారు. ప్రజలకు అవసరమైన సూచనలు అందిస్తూ, ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని స్పష్టం చేశారు. ఈదురుగాలుల సమయంలో ప్రజలు చెట్లు, విద్యుత్ స్తంభాలు, శిథిలావస్థలో ఉన్న భవనాల సమీపంలో ఉండకుండా జాగ్రత్తలు పాటించాలని సూచించారు. అత్యవసర పరిస్థితుల్లో అధికారులు తక్షణమే స్పందించి ప్రజలకు అవసరమైన సహాయ సహకారాలు అందించాలని మంత్రి సీతక్క అధికారులకు సూచించారు

# కరువును ఎదుర్కొనేందుకు అఖిలపక్ష సూచనల మేరకు చర్యలు

మొదటి పేజీ తరువాయి

రాష్ట్ర ప్రభుత్వం బుధవారం డాక్టర్ బీఆర్ అంబేద్కర్ తెలంగాణ రాష్ట్ర సచివాలయంలో నిర్వహించిన అఖిలపక్ష సమావేశంలో మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి  మాట్లాడారు. ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క అధ్యక్షతన జరిగిన ఈ సమావేశానికి మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, ధనసరి సీతక్క, వాకిటి శ్రీహరి, చీఫ్ సెక్రటరీ సంజయ్ జాజు, ఎల్‌నినో నోడల్ అధికారి రామకృష్ణారావు హాజరయ్యారు.ప్రస్తుతం నెలకొన్న ఎల్‌నినో ప్రభావం, వర్షపాతం లోటు, కరువు పరిస్థితులు, వాటివల్ల ప్రజలు, రైతులపై పడే ప్రభావాన్ని తగ్గించేందుకు చేపట్టాల్సిన చర్యలపై సమావేశంలో చర్చించారు. తాగునీటి సరఫరా, నీటి వనరుల పరిరక్షణ, సాగునీటికి విద్యుత్ సరఫరా, ప్రత్యామ్నాయ పంటల ప్రణాళిక, కరువు నివారణకు ముందస్తు చర్యలు వంటి కీలక అంశాలపై అఖిలపక్ష నాయకుల నుంచి సలహాలు, సూచనలు స్వీకరించారు.సమావేశంలో కాంగ్రెస్ నేత అంజన్‌కుమార్ యాదవ్, రైతు కమిషన్ చైర్మన్ కోదండరెడ్డి, బీఆర్ఎస్ నాయకులు వినోద్‌కుమార్, ఎల్.రమణ, సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి, బీజేపీ ప్రతిపక్ష నాయకుడు ఏలేటి మహేశ్వర్‌రెడ్డి, ఎమ్మెల్సీ కొమురయ్య, ఎంఐఎం అధ్యక్షుడు అసదుద్దీన్ ఓవైసీ, ఎంఐఎం ప్రతిపక్ష నేత అక్బరుద్దీన్ ఓవైసీ, సీపీఐ జాతీయ కార్యదర్శి పల్లా వెంకటరెడ్డి, రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు, సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి జాన్ వెస్లీ, మాజీ ఎమ్మెల్యే నంద్యాల నరసింహారెడ్డి, తెలంగాణ జన సమితి అధ్యక్షుడు, ఎమ్మెల్సీ కోదండరాం, సమాజ్‌వాదీ పార్టీ నాయకులు ప్రొఫెసర్ సింహాద్రి, వెంకటేశ్వర్లు, ఆర్జేడీ నాయకురాలు శోభ యాదవ్, బీఎస్పీ రాష్ట్ర నాయకుడు శ్రీరామ్ కృష్ణ, ఆమ్ ఆద్మీ పార్టీ అధ్యక్షుడు హేమ సుదర్శన్ తదితరులు పాల్గొన్నారు.సమావేశంలో వివిధ రాజకీయ పార్టీల నాయకులు వ్యక్తం చేసిన ఆందోళనలను ప్రభుత్వం శ్రద్ధగా ఆలకించిందని ఉత్తమ్‌కుమార్‌రెడ్డి పేర్కొన్నారు. తదుపరి కార్యాచరణను నిర్ణయించే సమయంలో వారి అభిప్రాయాలు, సూచనలను పరిగణనలోకి తీసుకుంటామని తెలిపారు.సమావేశానికి హాజరై తమ అభిప్రాయాలను పంచుకున్న నాయకులకు మంత్రి కృతజ్ఞతలు తెలిపారు. ఈ ప్రకృతి విపత్తు కారణంగా ఎదురవుతున్న సవాళ్లను నిర్మాణాత్మక దృక్పథంతో పరిష్కరించేందుకు ప్రభుత్వం కృషి చేస్తుందని చెప్పారు."నదీజలాల అంశాల్లో తెలంగాణ రాష్ట్ర ప్రయోజనాలను, తెలంగాణ రైతుల ప్రయోజనాలను పరిరక్షించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉంది" అని ఉత్తమ్‌కుమార్‌రెడ్డి స్పష్టం చేశారు.

ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు కూడా సమావేశంలో మాట్లాడారు. రాష్ట్రం ఎదుర్కొంటున్న సవాళ్లు, ప్రస్తుత పరిస్థితులను ఎదుర్కొనేందుకు తీసుకోవాల్సిన చర్యలపై వారు చర్చించారు.

# ఎల్‌నినో సవాళ్లను అధిగమించేలా గ్రామాలను సన్నద్ధం చేయాలి.

**ఉపాధి పనులతో జల సంరక్షణ.. గ్రామీణ కూలీలకు స్థానికంగానే ఉపాధి.**

**పశువుల దాహార్తి తీర్చేందుకు ప్రతి పంచాయతీలో నీటి తొట్టెల నిర్మాణం.**

**గ్రామాభివృద్ధి పనుల్లో అలసత్వాన్ని సహించేది లేదు.**

**:: రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, మంత్రి సీతక్క.**



**ములుగు జిల్లా ప్రజాబలం ప్రతినిధి అక్టోబర్ 28** బుధవారం హైదరాబాద్‌లోని బీఆర్‌కే భవన్ సెర్ప్ కార్యాలయం నుంచి స్పెషల్ చీఫ్ సెక్రటరీ దాన కిషోర్, సెర్ప్ కమిషనర్ దివ్య దేవరాజన్‌లతో కలిసి మంత్రి సీతక్క రాష్ట్రవ్యాప్తంగా సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులు, జిల్లా, మండలస్థాయి అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు.

ఉపాధి హామీ పనులు, నీటి సంరక్షణ, గ్రామాభివృద్ధి పనులు, మహిళా సంఘ భవనాల నిర్మాణ పురోగతిపై సమీక్షించారు.

ఈ వీడియో కాన్ఫరెన్స్‌కు జిల్లా సమీకృత కలెక్టరేట్ కార్యాలయ వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుంచి అదనపు కలెక్టర్ స్థానిక సంస్థలు సంపత్ రావు సంబంధిత శాఖల అధికారులతో కలిసి పాల్గొన్నారు.

ఈ సందర్భంగా మంత్రి సీతక్క మాట్లాడుతూ, ప్రతి గ్రామ పంచాయతీలో ఉపాధి హామీ పనులు చేపట్టి, పనులు కోరిన కూలీలకు ఉపాధి కల్పించాలని ఆదేశించారు. రాష్ట్రంలోని 12,516 గ్రామ పంచాయతీల్లో పనులు ప్రారంభమయ్యాయని, మిగిలిన 244 గ్రామ పంచాయతీల్లోనూ వెంటనే ప్రారంభించాలని సూచించారు. అక్టోబర్ 27న రాష్ట్రవ్యాప్తంగా 3,97,788 మంది కూలీలు ఉపాధి పనులకు హాజరయ్యారని, కూలీల భాగస్వామ్యాన్ని మరింత పెంచాలన్నారు. ప్రతి 40 మంది కూలీలకు ఒక మేట్‌ను నియమించి పనులను సమర్థవంతంగా పర్యవేక్షించాలని స్పష్టం చేశారు.

ఎల్‌నినో పరిస్థితులను దృష్టిలో ఉంచుకొని ఫామ్ పాండ్లు, ఇంకుడు గుంతలు, బోర్‌వెల్ రీచార్జ్ పనులు, చెక్‌డ్యామ్‌ల నిర్మాణం, చెరువుల పునరుద్ధరణకు ప్రాధాన్యత ఇవ్వాలని మంత్రి సూచించారు. వర్షపు నీటిని ఒడిసిపట్టి భూగర్భ జలాలను పెంపొందించే పనులను విస్తృతంగా చేపట్టాలన్నారు. నీటి వృథాను అరికట్టేందుకు సర్పంచులు ప్రజలకు అవగాహన కల్పించాలని కోరారు. ప్రజాప్రతినిధులు, అధికారులు సమన్వయంతో పనిచేసి గ్రామీణ ప్రజలకు భరోసా కల్పించాలని సూచించారు. ఈ సందర్భంగా నీటి సంరక్షణపై పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ రూపొందించిన 'జలసిరి' వీడియోను మంత్రి ఆవిష్కరించారు.

పశువులకు మేత, తాగునీటి కొరత తలెత్తకుండా ముందస్తు ఏర్పాట్లు చేయాలని మంత్రి ఆదేశించారు. వీబీగ్రామ్ జి కార్యక్రమంలో భాగంగా ప్రతి గ్రామ పంచాయతీలో పశువుల నీటి తొట్టెల నిర్మాణానికి చర్యలు చేపట్టాలని సూచించారు. ఒక్కో తొట్టె అంచనా వ్యయం రూ.24 వేలు కాగా, పశువులు తిరిగే ప్రాంతాల్లో, గ్రామంలోని అందరికీ అందుబాటులో ఉండే సామూహిక స్థలాలను గుర్తించాలన్నారు. ట్యాప్ కనెక్షన్‌కు సమీపంలో నిర్మాణానికి అనువైన స్థలాల వివరాలను పంచాయతీ కార్యదర్శులు సంబంధిత ఇంజనీరింగ్ అధికారులకు తెలియజేయాలని సూచించారు.

గ్రామాల్లో మౌలిక వసతుల కల్పనకు ప్రభుత్వం అవసరమైన నిధులను అందుబాటులో ఉంచుతోందని మంత్రి తెలిపారు. ఉపాధి హామీ నిధులను సద్వినియోగం చేసుకొని వర్క్‌షెడ్లు, పశువుల షెడ్లు, కమ్యూనిటీ హాళ్లు తదితర నిర్మాణాలు చేపట్టాలని సూచించారు. ఒక్కో గ్రామానికి సుమారు రూ.50 లక్షల నుంచి రూ.కోటి వరకు నిధులు సమకూరే అవకాశాన్ని వినియోగించుకోవాలన్నారు. ఉపాధి పనుల బిల్లులు 15 రోజుల్లో వస్తాయని పేర్కొన్నారు.

ప్రతి గ్రామ పంచాయతీని ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దే లక్ష్యంతో సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులు, మండలస్థాయి అధికారులు పనిచేయాలని మంత్రి స్పష్టం చేశారు. అభివృద్ధి పనుల్లో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. విధుల నిర్వహణలో అలసత్వం ప్రదర్శించే సర్పంచులు, అధికారులకు నోటీసులు జారీ చేస్తామని తెలిపారు.

ఏజెన్సీ ప్రాంతాల్లో ఐటీడీఏ ప్రాజెక్టు అధికారులు ప్రత్యేక శ్రద్ధ తీసుకొని కూలీలకు ఉపాధి కల్పించాలని మంత్రి ఆదేశించారు. ఆయా ప్రాంతాల భౌగోళిక పరిస్థితులు, ప్రజల జీవన విధానానికి అనుగుణంగా పనులను ఎంపిక చేయాలన్నారు. నీటి సంరక్షణ పనులు, చెక్‌డ్యామ్‌ల నిర్మాణంతోపాటు స్థానికంగా ఉపాధి అవకాశాలను పెంచి వలసలను నివారించాలని సూచించారు.

నవంబర్ 19న గ్రామ మహిళా సంఘ భవనాలను ప్రారంభించుకునేలా నిర్మాణ పనులను పూర్తి చేయాలని మంత్రి ఆదేశించారు. నిర్దేశిత గడువులోగా పనులు పూర్తయ్యేలా అధికారులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సూచించారు.

గ్రామాల అభివృద్ధి పనుల వివరాలను జీపీఎస్‌ఏపీ సాఫ్ట్‌వేర్‌లో నమోదు చేస్తున్నామని, ఇప్పటికే కోటి 12 లక్షల రికార్డులను పొందుపరిచామని మంత్రి తెలిపారు. గ్రామ పంచాయతీల సమగ్ర సమాచారాన్ని ఉపయోగించుకొని పనుల ప్రణాళిక, అమలు, పర్యవేక్షణను మెరుగుపర్చాలని సూచించారు. మౌలిక వసతులు, నీటి సంరక్షణ, ఉపాధి కల్పన, పారిశుద్ధ్యానికి ప్రాధాన్యతనిస్తూ గ్రామాలను అభివృద్ధి చేస్తే జాతీయస్థాయి అవార్డులు సాధించవచ్చని పేర్కొన్నారు. అవార్డుల ద్వారా లభించే అదనపు నిధులను గ్రామాభివృద్ధికి వినియోగించుకోవచ్చన్నారు.

వీడియో కాన్ఫరెన్స్‌లో పలు జిల్లాల సర్పంచులతో మంత్రి నేరుగా మాట్లాడి, వారి గ్రామాల్లో ఉపాధి పనులు, అభివృద్ధి పనుల పురోగతిని తెలుసుకున్నారు. ఉపాధి హామీ పథకాన్ని సమర్థవంతంగా వినియోగించి అభివృద్ధి సాధించిన సర్పంచులను అభినందించారు. వారి పనితీరును ఆదర్శంగా తీసుకొని ఇతర సర్పంచులు కూడా పనులను వేగవంతం చేయాలని సూచించారు. ఈ సందర్భంగా గవర్నర్ స్పెషల్ చీఫ్ సెక్రటరీగా తిరిగి నియమితులైన దాన కిషోర్‌ను మంత్రి అభినందించి సత్కరించారు.

ఈ కార్యక్రమంలో డీఆర్డీఓ రవీందర్, డీపీఓ వెంకయ్య, డీఐఓ అప్పలనాయుడు, జిల్లా ఉద్యానవన శాఖ అధికారి సంజీవ రావు, మిషన్ భగీరథ డీఈ సునీత, జిల్లా వ్యవసాయ అధికారి సురేష్ కుమార్, జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి కొమురయ్య, పంచాయతీరాజ్, నీటిపారుదల శాఖల ఈఈలు, తదితరులు పాల్గొన్నారు.

# వికారాబాద్ జిల్లాను కరువు జిల్లాగా ప్రకటించాలి కొంషేడ్పల్లి మన్నే సుధాకర్ యాదవ్



**వికారాబాద్ నియోజకవర్గం ప్రతినిధి అక్టోబర్ 28(ప్రజాబలం)**

**వికారాబాద్ జిల్లా:**వికారాబాద్ జిల్లాను కరువు జిల్లాగా ప్రకటించాలనిఈ సందర్భంగా మన్నె సుధాకర్ యాదవ్ మాట్లాడుతూ.

వికారాబాద్ జిల్లాను కరువు జిల్లాగా ప్రకటించాలని వర్షాభావంతో నష్టపోయిన రైతులకు పంట నష్టపరిహారం వెంటనే ఇచ్చి రైతులను ఆదుకోవాలి.

రైతుల యొక్క పాత రుణాలను మాఫీ చేసి వెంటనే కొత్త రుణాలు ఇవ్వాలి. వ్యవసాయానికి మినిమం 16 గంటల విద్యుత్ సౌకర్యాన్ని కల్పించాలి. మేత కోసం అల్లాడుతున్న పశువులకు పశుగ్రాసం మరియు పశువులకు త్రాగునీటిని ఏర్పాటు చేయాలి. పంటలు నష్టపోవడంతో గ్రామాలలో వ్యవసాయ పనులు తగ్గిపోవడం వల్ల వ్యవసాయ పనులులేకఅల్లాడుతున్నటువంటి ప్రజలకు వెంటనే ఉపాధి హామీ పనులు ప్రారంభించి ఆదుకోవాలి అదేవిధంగా ఉపాధి హామీ కూలి రేట్లు కూడా పెరుగుతున్న ధరలకు అనుగుణంగా పెంచాలి. నిత్యావసర సరుకుల ధరలన్నీ కూడా పేద ప్రజలకు అందుబాటులో ఉండే విధంగా ధరలు తగ్గించాలి. జిల్లావ్యాప్తంగా రైతులను, వ్యవసాయ కూలీలను, కౌలు రైతులను ఆదుకోవడానికి ప్రజలకుఅవసరమైనటువంటి ఏర్పాట్లు చేసి వికారాబాద్ జిల్లాను కరువు జిల్లాగా ప్రకటించాలని రైతులను ఆదుకోవాలనిమన్నే సుధాకర్ యాదవ్ తెలిపారు

# అర్హులైన ప్రతి ఒక్కరికీ డిజిటల్ రేషన్ కార్డులు అందించడమే ప్రభుత్వ లక్ష్యం

## మంచిర్యాల మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ ధరణి మధుకర్

మంచిర్యాల, అక్టోబర్ 28: మంచిర్యాల మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని 4, 5, 6, 7, 2, 27, 28, 26వ డివిజన్లలో డిజిటల్ రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమాన్ని మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ ధరణి మధుకర్ బుధవారం ప్రారంభించారు.ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ, తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రజా సంక్షేమమే ధ్యేయంగా అనేక సంక్షేమ పథకాలను అమలు చేస్తోందని తెలిపారు. ప్రభుత్వ పథకాల ప్రయోజనాలు అర్హులైన ప్రతి ఒక్కరికీ అందాలంటే తెల్ల రేషన్ కార్డు ఎంతో కీలకమని పేర్కొన్నారు. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగిస్తూ డిజిటల్ రేషన్ కార్డులను పంపిణీ చేయడం ద్వారా ప్రజలకు మరింత పారదర్శకంగా ప్రభుత్వ సేవలు అందించేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు.మంచిర్యాల ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేమ్ సాగర్ రావు నాయకత్వంలో నియోజకవర్గంలోని అర్హులైన ప్రతి కుటుంబానికి ప్రభుత్వ సంక్షేమ పథకాల ఫలాలు అందేలా కృషి చేస్తున్నామని మేయర్ వెల్లడించారు. ప్రజలకు అవసరమైన ప్రభుత్వ సేవలు, సంక్షేమ పథకాలు ఎలాంటి ఇబ్బందులు లేకుండా అందించడమే ప్రభుత్వ లక్ష్యమని స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో స్థానిక కార్పొరేటర్లు వేల్పుల రవీందర్, కొండ్ర రాజేశ్వరి లింగయ్య, అమృత్ రాజ్ కుమార్, గుమ్మడి శ్రీనివాస్, తోటపల్లి రాజేశ్వరి, వనపర్తి కేత రాజేష్, ఇరగదిండ్ల రవి, కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జిలు అంగిడి రాజేష్, బత్తుల స్వామి, మారు మల్లయ్య, కొత్త రమేష్, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, లబ్ధిదారులు తదితరులు పాల్గొన్నారు.



# రాష్ట్రంలో ఎమర్జెన్సీ పాలన నడుస్తోంది: కాంగ్రెస్ సర్కార్‌పై హరీశ్ రావు ధ్వజం

మొదటి పేజీ తరువాయి

హైదరాబాద్‌లోని వాలంతరిలో మూసీ ప్రాజెక్టుపై ప్రజాభిప్రాయ సేకరణ జరగాల్సి ఉంది. ఈ కార్యక్రమానికి హాజరుకావడానికి సిద్ధమైన మాజీ మంత్రి సబితా ఇంద్రారెడ్డి, ఆమె కుమారుడు కార్తీక్ రెడ్డిలను పోలీసులు శ్రీనగర్ కాలనీలోని వారి నివాసంలో గృహ నిర్బంధం చేశారు. తెల్లవారుజాము నుంచే వారి ఇంటి వద్ద భారీగా పోలీసులు మోహరించి, బయటకు రాకుండా అడ్డుకున్నారు.
ఈ ఘటనపై హరీశ్ రావు ఎక్స్ వేదికగా స్పందించారు. “కరవుతో రైతులు అల్లాడుతుంటే ఆదుకోవడం చేతకాని ప్రభుత్వం, రూ. 1.50 లక్షల కోట్లతో మూసీ ప్రక్షాళన పేరుతో కమిషన్ల కోసం ప్రాజెక్టులు చేపడుతోంది” అని ఆరోపించారు. పోలీసులను అడ్డం పెట్టుకుని ప్రజా వ్యతిరేక నిర్ణయాలు తీసుకుంటూ, ప్రతిపక్షాల గొంతును ఎంతకాలం అణచివేస్తారని ప్రశ్నించారు. మూసీ ప్రక్షాళన ముసుగులో జరుగుతున్న దోపిడీ యత్నాలను తెలంగాణ సమాజం తిప్పికొడుతుందని, కాంగ్రెస్‌కు తగిన గుణపాఠం చెబుతుందని హెచ్చరించారు. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, మాజీ మంత్రి సబితా ఇంద్రారెడ్డి కూడా అరెస్టులను ఖండించారు. ఇది అప్రజాస్వామిక చర్య అని, మూసీ పరీవాహక ప్రాంత ప్రజలకు అండగా నిలుస్తున్నందుకే తమను అక్రమంగా నిర్బంధించారని ఆరోపించారు. గృహనిర్బంధంలో ఉన్న బీఆర్ఎస్ నేతలను తక్షణమే విడుదల చేయాలని పార్టీ తరఫున డిమాండ్ చేశారు.

# టాటా గ్రూప్‌ను నాశనం చేస్తున్నారు: మోదీ, అమిత్ షాలపై రాహుల్ గాంధీ ఫైర్

మొదటి పేజీ తరువాయి

“భారతీయ వ్యాపార రంగం మోదీ, అమిత్ షాల ఆటవస్తువు కాదు. మీకు ధైర్యం లేదు, మాకుంది. ఈ నేరాలకు న్యాయం జరిగేలా చూస్తాం” అని రాహుల్ తన పోస్టులో పేర్కొన్నారు.
టాటా గ్రూప్‌లో కొంతకాలంగా నడుస్తున్న అంతర్గత వివాదం నేపథ్యంలో రాహుల్ వ్యాఖ్యలు ప్రాధాన్యం సంతరించుకున్నాయి. టాటా సన్స్ ఎగ్జిక్యూటివ్ ఛైర్మన్‌గా ఎన్. చంద్రశేఖరన్ పునర్‌నియామకాన్ని టాటా ట్రస్ట్స్ ఛైర్మన్ నోయెల్ టాటా సవాలు చేశారు. సెప్టెంబర్ 17న జరిగిన బోర్డు తీర్మానం చెల్లదని, నియామక ప్రక్రియలో నిబంధనలు పాటించలేదని ఆయన అక్టోబర్ 26న రాసిన లేఖలో ఆరోపించారు. ఈ వివాదం కార్పొరేట్ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది. మరోవైపు, రాహుల్ ఆరోపణలపై బీజేపీ నేత సీఆర్ కేశవన్ స్పందించారు. రాహుల్ గాంధీకి ఆర్థికశాస్త్రంపై అవగాహన లేదని విమర్శించారు.

# తెలంగాణలో భారీగా ఐఏఎస్‌ల బదిలీలు.. కీలక శాఖలకు కొత్త అధికారులు

**కీలక శాఖలకు కొత్త అధికారులను నియమించిన ప్రభుత్వం**

**పంచాయతీరాజ్ శాఖకు నవీన్ మిట్టల్**

**జీహెచ్ఎంసీ బాధ్యతలు సర్ఫరాజ్ అహ్మద్‌కు**

తెలంగాణ ప్రభుత్వంలో పలువురు సీనియర్ ఐఏఎస్ అధికారుల బదిలీలు జరిగాయి. కీలక శాఖలకు నూతన అధికారులను నియమిస్తూ ప్రభుత్వం బుధవారం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ మేరకు పలువురు అధికారులకు కొత్త పోస్టింగులు కేటాయిస్తూ పరిపాలనలో మార్పులు చేపట్టింది.ప్రభుత్వ ఉత్తర్వుల ప్రకారం, సీనియర్ ఐఏఎస్ అధికారి జయేష్ రంజన్‌ను పర్యావరణ, అటవీ, సైన్స్ అండ్ టెక్నాలజీ శాఖల ప్రత్యేక ప్రధాన కార్యదర్శిగా నియమించారు. ఇంధన శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శిగా వికాస్ రాజ్‌కు బాధ్యతలు అప్పగించారు. పంచాయతీరాజ్, గ్రామీణాభి వృద్ధి మరియు గ్రామీణ నీటి సరఫరా శాఖల బాధ్యతలను నవీన్ మిట్టల్‌కు కేటాయించారు. ఇక రెవెన్యూ (దేవాదాయ) శాఖకు శైలజ రామయ్యర్‌ను, క్రీడలు మరియు వారసత్వ శాఖకు ఎ. వాణి ప్రసాద్‌ను బదిలీ చేశారు.




రాహుల్ బొజ్జాకు గిరిజన సంక్షేమ శాఖ అదనపు బాధ్యతలు అప్పగించారు. రవాణా శాఖ కార్యదర్శిగా కె. ఇలంబర్తి, వైద్య ఆరోగ్య శాఖ కార్యదర్శిగా ముషారఫ్ అలీ ఫరూఖీ నియమితులయ్యారు. జీహెచ్ఎంసీతో పాటు సైబరాబాద్, మల్కాజ్‌గిరి కార్పొరేషన్ల అదనపు బాధ్యతలను సర్ఫరాజ్ అహ్మద్‌కు కేటాయించారు.
మహిళా, శిశు, దివ్యాంగుల మరియు వయోవృద్ధుల సంక్షేమ శాఖ బాధ్యతలను శ్రుతి ఓఝాకు అప్పగించగా, మహిళా శిశు సంక్షేమ శాఖ డైరెక్టర్‌గా డాక్టర్ సంగీత సత్యనారాయణ బాధ్యతలు స్వీకరించనున్నారు. టీజీఎస్పీడీసీఎల్, టీజీరెడ్కో బాధ్యతలను జితేష్ వి. పాటిల్‌కు కేటాయించారు. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజూ ఉత్తర్వులు జారీ చేశారు.

# అంబేద్కర్ గురుకులంలో విద్యార్థుల ఘర్షణ

సి. బెళగల్, అక్టోబర్ 28 :మండల కేంద్రంలోని డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ గురుకుల విద్యాలయంలో విద్యార్థుల మధ్య జరిగిన ఘర్షణలో ఓ విద్యార్థికి తీవ్ర రక్తగాయాలయ్యాయి. బుధవారం మధ్యాహ్న భోజన సమయంలో తొమ్మిదో తరగతి చదువుతున్న ఇద్దరు విద్యార్థుల మధ్య చోటుచేసుకున్న చిన్నపాటి వివాదం ఘర్షణకు దారితీసింది. ఈ ఘటనలో మునిస్వామి అనే విద్యార్థి గాయపడగా, అతడిని స్థానిక ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి చికిత్స అందించారు.

భోజన సమయంలో మొదలైన వివాదం

వివరాల్లోకి వెళితే.. గురుకుల విద్యాలయంలో తొమ్మిదో తరగతి చదువుతున్న మునిస్వామి, విజయరాజు అనే ఇద్దరు విద్యార్థుల మధ్య బుధవారం మధ్యాహ్న భోజన సమయంలో చిన్నపాటి వివాదం తలెత్తినట్లు సమాచారం. ఈ క్రమంలో ఇద్దరి మధ్య మాటామాటా పెరిగి ఘర్షణకు దారితీసింది. ఆ సమయంలో ప్లేట్లతో ఒకరిపై మరొకరు దాడి చేసుకున్నట్లు తెలుస్తోంది.ఈ ఘటనలో విజయరాజు ప్లేటుతో మునిస్వామి తలపై బలంగా కొట్టడంతో అతడికి తీవ్ర రక్తగాయమైంది. దీంతో విద్యార్థి ధరించిన చొక్కా, ప్యాంటు రక్తంతో తడిసిపోయినట్లు సమాచారం. వెంటనే గాయపడిన విద్యార్థిని స్థానిక ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి చికిత్స అందించారు. వైద్యులు అతడి తలకు రెండు కుట్లు వేసినట్లు తెలిసింది.

డీసీడీఓ తనిఖీ రోజే ఘటన జరగడంపై చర్చ

గురుకుల విద్యాలయంలో డీసీడీఓ తనిఖీలు నిర్వహించిన రోజే విద్యార్థుల మధ్య ఘర్షణ చోటుచేసుకుని ఒక విద్యార్థి గాయపడటం స్థానికంగా చర్చనీయాంశంగా మారింది. విద్యార్థుల మధ్య ఇలాంటి ఘర్షణలు చోటుచేసుకోకుండా పాఠశాల సిబ్బంది తగిన పర్యవేక్షణ చేపడుతున్నారా? విద్యార్థుల భద్రతకు అవసరమైన చర్యలు తీసుకుంటున్నారా? అనే ప్రశ్నలు స్థానికుల నుంచి వ్యక్తమవుతున్నాయి.విద్యార్థుల మధ్య వివాదం తలెత్తినప్పుడు సిబ్బంది వెంటనే స్పందించాల్సిన అవసరం ఉందని పలువురు అభిప్రాయపడుతున్నారు. గురుకుల విద్యాలయాల్లో చదువుకుంటున్న విద్యార్థుల భద్రత, క్రమశిక్షణ, ఆరోగ్య పరిరక్షణకు ప్రాధాన్యం ఇవ్వాలని సూచిస్తున్నారు.

బాధ్యులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్

విద్యార్థుల మధ్య ఘర్షణకు దారితీసిన పరిస్థితులు ఏమిటి? ఘటన జరిగిన సమయంలో పర్యవేక్షణ బాధ్యతలు నిర్వహిస్తున్న సిబ్బంది ఎక్కడ ఉన్నారు? విద్యార్థికి గాయాలయ్యేంతవరకు వివాదం ఎలా ముదిరింది? అనే అంశాలపై సంబంధిత అధికారులు విచారణ జరిపి వాస్తవాలను వెలికితీయాలని స్థానికులు కోరుతున్నారు.గురుకుల విద్యాలయాల్లో విద్యార్థుల మధ్య పరస్పర అవగాహన, క్రమశిక్షణ పెంపొందించేందుకు ప్రత్యేక చర్యలు చేపట్టాలని, ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా పర్యవేక్షణను మరింత పటిష్టం చేయాలని వారు సూచిస్తున్నారు.విద్యార్థులకు విద్యాబుద్ధులు నేర్పి, క్రమశిక్షణతో తీర్చిదిద్దాల్సిన విద్యాసంస్థల్లో ఇలాంటి ఘటనలు చోటుచేసుకోవడం ఆందోళన కలిగిస్తోంది. ఈ ఘటనపై సంబంధిత విద్యాశాఖ అధికారులు స్పందించి, సమగ్ర విచారణ చేపడతారా? విద్యార్థుల భద్రతకు ఎలాంటి చర్యలు తీసుకుంటారో వేచి చూడాలి.

# తెలంగాణ ప్రభుత్వం ప్రకటించిన కరవు మండలాల జాబితాపై బండి సంజయ్ విమర్శలు

**కరవు మండలాల జాబితా అశాస్త్రీయమన్న బండి సంజయ్**

**కరీంనగర్ పార్లమెంట్ పరిధికి**

**తీవ్ర అన్యాయం జరిగిందని ఆరోపణ**

**35 శాతం వర్షపాతం లోటు ఉన్న మండలాలను కూడా**

**విస్మరించారని ఆగ్రహం**

తెలంగాణ ప్రభుత్వం ఇటీవల విడుదల చేసిన కరవు మండలాల జాబితాపై కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు. ఈ జాబితా అత్యంత అశాస్త్రీయంగా, పక్షపాత ధోరణితో ఉందని ఆయన ఆరోపించారు. కేవలం మొక్కుబడిగా ఈ జాబితాను తయారు చేశారని మండిపడ్డారు.



ముఖ్యంగా కరీంనగర్ పార్లమెంటరీ నియోజకవర్గానికి ప్రభుత్వం తీవ్ర అన్యాయం చేసిందని బండి సంజయ్ అన్నారు. 35 శాతం వర్షపాతం లోటు ఉన్న మండలాలను కూడా జాబితాలో చేర్చకపోవడం ప్రభుత్వ ఉద్దేశాన్ని స్పష్టం చేస్తోందన్నారు. హుస్నాబాద్, వేములవాడ, సిరిసిల్ల, మానకొండూరు, చొప్పదండి, హుజూరాబాద్ నియోజకవర్గాల్లోని తీవ్ర కరవు పరిస్థితులు ప్రభుత్వానికి కనిపించడం లేదా? అని ప్రశ్నించారు. పంట పొలాలు బీళ్లుగా మారినా, ప్రజలు తాగునీటి ఎద్దడితో అల్లాడుతున్నా ప్రభుత్వం పట్టించుకోకపోవడం దారుణమన్నారు.
నష్టపరిహారం ఖర్చులు తప్పించుకోవాలనే ఉద్దేశంతోనే కరీంనగర్‌ను ఉద్దేశపూర్వకంగా విస్మరించారా? అని ఆయన నిలదీశారు. క్షేత్రస్థాయిలో అధికారులు పర్యటించి రైతులతో మాట్లాడితేనే కరవు తీవ్రత స్పష్టంగా తెలుస్తుందని సూచించారు. కరవు మండలాలను ఏ ప్రాతిపదికన, ఏ గణాంకాల ఆధారంగా గుర్తించారో తెలుపుతూ ప్రభుత్వం తక్షణమే శ్వేతపత్రం విడుదల చేయాలని ఆయన డిమాండ్ చేశారు.
ప్రతి మండలానికి వర్షపాతం లోటు, సాగు విస్తీర్ణం, పంట నష్టం, భూమిలో తేమ వంటి అంశాలను విడివిడిగా పరిశీలించి, అర్హులైన అన్ని మండలాలను జాబితాలో చేర్చాలని కోరారు. ప్రభుత్వం రాజకీయ ప్రయోజనాలను పక్కనపెట్టి, వాస్తవ పరిస్థితులకు అనుగుణంగా నిర్ణయాలు తీసుకోవాలని హితవు పలికారు. లేనిపక్షంలో రైతుల పక్షాన పోరాటాన్ని మరింత ఉద్ధృతం చేస్తామని హెచ్చరించారు.

# కర్ణాటక ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్‌కు భారీ షాక్.. క్లీన్‌స్వీప్ చేసిన ఎన్డీయే

**నాలుగు స్థానాలనూ కైవసం చేసుకున్న బీజేపీ-జేడీఎస్ కూటమి**

**బీజేపీకి మూడు, జేడీఎస్‌కు ఒక స్థానం..**

**బెంగళూరు టీచర్స్ నియోజకవర్గంలో**

**కాంగ్రెస్ సిట్టింగ్ ఎమ్మెల్సీ ఓటమి**

**ప్రభుత్వంపై ప్రజా వ్యతిరేకతకు నిదర్శనమన్న ఎన్డీయే నేతలు**

కర్ణాటకలో అధికారంలో ఉన్న కాంగ్రెస్ పార్టీకి శాసనమండలి (ఎమ్మెల్సీ) ఎన్నికల్లో గట్టి ఎదురుదెబ్బ తగిలింది. రాష్ట్రంలో నాలుగు స్థానాలకు జరిగిన ఎన్నికల్లో ప్రతిపక్ష బీజేపీ-జేడీఎస్ (ఎన్డీయే) కూటమి క్లీన్‌స్వీప్ చేసింది. ఈ ఫలితాల్లో బీజేపీ మూడు స్థానాల్లో విజయం సాధించగా, దాని మిత్రపక్షమైన జేడీఎస్ ఒక స్థానాన్ని కైవసం చేసుకుంది. అధికార కాంగ్రెస్ పార్టీ ఒక్క స్థానంలో కూడా గెలవలేకపోయింది. రాష్ట్రంలోని రెండు పట్టభద్రుల, రెండు ఉపాధ్యాయ నియోజకవర్గాలకు అక్టోబర్ 23న పోలింగ్ జరిగింది. అక్టోబర్ 27న వెలువడిన తుది ఫలితాల్లో ఎన్డీయే కూటమి మొత్తం నాలుగు స్థానాలనూ గెలుచుకున్నట్లు ఎన్నికల అధికారులు ప్రకటించారు. ఈ నియోజకవర్గాల్లో 74 శాతం నుంచి 87 శాతం మధ్య మెరుగైన పోలింగ్ శాతం నమోదైంది.
అందరి దృష్టిని ఆకర్షించిన బెంగళూరు టీచర్స్ నియోజకవర్గంలో కాంగ్రెస్ సిట్టింగ్ ఎమ్మెల్సీ పుట్టన్న ఓటమి పాలయ్యారు. బీజేపీ మద్దతుతో బరిలోకి దిగిన జేడీఎస్ అభ్యర్థి ఏపీ రంగనాథ్, పుట్టన్నపై 908 ఓట్ల మెజారిటీతో విజయం సాధించారు. రంగనాథ్‌కు 10,810 ఓట్లు రాగా, పుట్టన్నకు 9,902 ఓట్లు పోలయ్యాయి.
మిగిలిన మూడు స్థానాలను బీజేపీ అభ్యర్థులు గెలుచుకున్నారు. నార్త్-ఈస్ట్ టీచర్స్ స్థానం నుంచి సిట్టింగ్ ఎమ్మెల్సీ శశిల్ జి.నమోషి తన స్థానాన్ని నిలబెట్టుకున్నారు. సౌత్-ఈస్ట్ గ్రాడ్యుయేట్స్ నుంచి కేఎం సురేశ్, వెస్ట్ గ్రాడ్యుయేట్స్ స్థానం నుంచి ఎస్‌వీ సంకనూర్ విజయం సాధించారు.
ఈ ఫలితాలు కాంగ్రెస్ ప్రభుత్వంపై ప్రజా వ్యతిరేకతకు నిదర్శనమని ఎన్డీయే కూటమి నేతలు వ్యాఖ్యానిస్తున్నారు. అయితే, ఈ ఎన్నికల ఫలితాలు రాష్ట్ర అసెంబ్లీలో కాంగ్రెస్ ప్రభుత్వ మెజారిటీపై ఎలాంటి ప్రభావం చూపవని రాజకీయ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.

# తుఫాను నేపథ్యంలో ఇంద్రకీలాద్రి ఘాట్ రోడ్డు, సున్నిత ప్రాంతాల్లో అధికారుల క్షేత్రస్థాయి పరిశీలన

ఇంద్రకీలాద్రి తీవ్ర తుఫాను, భారీ వర్షాల హెచ్చరికల నేపథ్యంలో భక్తుల భద్రత మరియు ముందస్తు రక్షణ చర్యలపై దేవస్థాన యంత్రాంగం ప్రత్యేక దృష్టి సారించింది. ఇందులో భాగంగా బుధవారం మధ్యాహ్నం దేవస్థాన కార్యనిర్వహణాధికారి వి.కె. శీనా నాయక్ ఇంజినీరింగ్ అధికారులు శ్రీమతి రమ, శ్రీ అశోక్ కుమార్ తదితరులతో కలిసి ఇంద్రకీలాద్రి ఘాట్ రోడ్డులోని పలు కీలక ప్రాంతాలలో క్షేత్రస్థాయి పరిశీలన నిర్వహించారు.

?ఈ సందర్భంగా అధికారులు ఓం టర్నింగ్, ఘాట్ రోడ్డు మార్గం, టోల్ గేట్ తదితర ప్రాంతాలను సమగ్రంగా తనిఖీ చేశారు. కొండపై నుండి వర్షపు నీరు సాఫీగా, వేగంగా కిందకు చేరేందుకు ఏర్పాటు చేసిన డ్రైనేజీ ప్రవాహ మార్గాలను పరిశీలించి, ఎక్కడా అడ్డంకులు లేకుండా పూడికతీత చర్యలు చేపట్టాలని సూచించారు.

ముఖ్యంగా దసరా ఉత్సవాల ముందు కొండచరియలు జారిపడిన సున్నితమైన ప్రదేశాన్ని నిశితంగా పరిశీలించడంతో పాటు, భారీ వర్షాల ప్రభావంతో రాళ్లు జారిపడే అవకాశం ఉన్న ప్రాంతాలను గుర్తించి అవసరమైన రక్షణ చర్యలు చేపట్టాలని ఇంజినీరింగ్ విభాగానికి ఆదేశాలు జారీ చేశారు.?అనంతరం కనకదుర్గ నగర్ మీదుగా సాగుతున్న భక్తుల రాకపోకలను పరిశీలించిన అధికారులు వర్షం వల్ల సాధారణ భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అన్ని ఏర్పాట్లు పకడ్బందీగా ఉండాలని స్పష్టం చేశారు.
వర్షపు గాలుల వల్ల విద్యుత్ అంతరాయం కలగకుండా ప్రత్యామ్నాయ జనరేటర్లను సిద్ధంగా ఉంచుకోవాలని, ఎప్పటికప్పుడు విద్యుత్ సమస్యలను పరిష్కరించాలని ఆదేశించారు. అలాగే ఈ చలి, వర్షపు వాతావరణంలో దర్శనార్థం విచ్చేసే భక్తులకు నిరంతరాయంగా వేడి వేడి అన్నప్రసాదం అందుబాటులో ఉంచేలా చర్యలు తీసుకోవాలని సంబంధిత విభాగాల సిబ్బందిని ఆదేశించారు.

# పట్టభద్రుల ఓటరు నమోదుపై సర్పంచ్‌లు ప్రత్యేక దృష్టి సారించాలి

### గ్రామాల్లో ఇంటింటికీ వెళ్లి అర్హులైన పట్టభద్రులతో ఓట్లు నమోదు చేయించాలి:

### కాంగ్రెస్ మండల అధ్యక్షుడు తోటకూరి రాంబాబు




కారేపల్లి, అక్టోబర్ 28: ఖమ్మం?వరంగల్?నల్గొండ పట్టభద్రుల ఎమ్మెల్సీ నియోజకవర్గ ఓటరు నమోదు కార్యక్రమాన్ని సింగరేణి మండలంలోని సర్పంచ్‌లు, కాంగ్రెస్ పార్టీ గ్రామ అధ్యక్షులు, స్థానిక నాయకులు ప్రతిష్ఠాత్మకంగా తీసుకోవాలని కాంగ్రెస్ పార్టీ సింగరేణి మండల అధ్యక్షుడు తోటకూరి రాంబాబు పిలుపునిచ్చారు. ఓటరు నమోదు గడువు నవంబర్ 6తో ముగియనున్న నేపథ్యంలో మిగిలిన సమయంలో అర్హులైన ప్రతి పట్టభద్రుడి ఓటు నమోదు చేయించేలా ప్రత్యేక శ్రద్ధ వహించాలని కోరారు. ఈ సందర్భంగా తోటకూరి రాంబాబు మాట్లాడుతూ.. గత ఎన్నికల్లో సింగరేణి మండలంలో సుమారు 2,700 పట్టభద్రుల ఓట్లు ఉండగా, ఇప్పటివరకు సుమారు 1,600 ఓట్లు మాత్రమే నమోదయ్యాయని తెలిపారు. దీంతో ఇంకా అనేకమంది అర్హులైన పట్టభద్రులు ఓటరు నమోదుకు దూరంగా ఉన్నారని పేర్కొన్నారు. గడువు సమీపిస్తున్నందున గ్రామస్థాయిలో నాయకులు సమన్వయంతో పనిచేసి, అర్హులైన పట్టభద్రులను గుర్తించి ఓటరు నమోదును వేగవంతం చేయాలని సూచించారు. మండలంలోని సర్పంచ్‌లు, గ్రామ కాంగ్రెస్ అధ్యక్షులు, పార్టీ నాయకులు ప్రతి గ్రామంలో ఇంటింటికీ వెళ్లి పట్టభద్రుల వివరాలను సేకరించాలని, అర్హులైన వారు ఓటరుగా నమోదు చేసుకునేలా అవగాహన కల్పించి సహకరించాలని కోరారు. ఓటరు నమోదు ప్రక్రియలో ఎలాంటి నిర్లక్ష్యం చేయకుండా, నవంబర్ 6లోగా అర్హులైన ప్రతి ఒక్కరూ దరఖాస్తు చేసుకునేలా కృషి చేయాలని విజ్ఞప్తి చేశారు. సింగరేణి మండలంలో పట్టభద్రుల ఓటరు నమోదు శాతం పెంచేందుకు ప్రజాప్రతినిధులు, గ్రామస్థాయి పార్టీ నాయకులు సమష్టిగా కృషి చేయాలని తోటకూరి రాంబాబు కోరారు. అర్హులైన పట్టభద్రులు తమ ఓటు హక్కును నమోదు చేసుకుని, ప్రజాస్వామ్య ప్రక్రియలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు.

### పోలీస్ అమరవీరుల స్ఫూర్తితో కమిషనరేట్ కార్యాలయంలో రక్తదాన శిబిరం:

# సీపీ రష్మి పెరుమాళ్




సిద్దిపేట పోలీస్ అమరవీరుల సంస్మరణ వారోత్సవాల్లో భాగంగా సిద్దిపేట పోలీస్ కమిషనరేట్ కార్యాలయంలో నిర్వహించిన ప్రత్యేక రక్తదాన శిబిరాన్ని సిద్దిపేట పోలీస్ కమిషనర్ రష్మి పెరుమాళ్, ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో 186 మంది పోలీస్ సిబ్బంది మరియు స్థానిక ప్రజలు ఉత్సాహంగా పాల్గొని రక్తదానం చేశారు. ఈ సందర్భంగా పోలీస్ కమిషనర్ మాట్లాడుతూ. దేశ రక్షణ మరియు ప్రజల భద్రత కోసం తమ ప్రాణాలను సైతం లెక్కచేయకుండా విధులు నిర్వర్తించి అమరులైన పోలీస్ సిబ్బంది త్యాగాలు ప్రతి ఒక్కరికీ స్ఫూర్తిదాయకం. వారి స్మృత్యర్థం నిర్వహిస్తున్న ఈ రక్తదాన కార్యక్రమం ద్వారా ఆపదలో ఉన్నవారికి ప్రాణదానం చేయడం ఎంతో మహత్తరమైన విషయం. రక్తదానం అనేది ప్రాణదానంతో సమానం. అత్యవసర పరిస్థితుల్లో రక్తం అందక ప్రాణాపాయ స్థితిలో ఉన్న ఎంతోమందికి సకాలంలో రక్తం అందించడం ద్వారా విలువైన ప్రాణాలను కాపాడే అవకాశం ఉంటుంది. రక్తానికి వేరే ప్రత్యామ్నాయం లేదని ప్రతి ఒక్కరూ గుర్తుంచుకోవాలి అని తెలిపారు. స్వచ్ఛందంగా చేసే రక్తదానం రోడ్డు ప్రమాదాల్లో గాయపడిన వారికి, శస్త్రచికిత్సలు పొందుతున్న రోగులకు, ప్రసవ సమయంలో అధిక రక్తస్రావంతో బాధపడే మహిళలకు మరియు ఇతర అత్యవసర వైద్య చికిత్సలు అవసరమైన వారికి ఎంతో ఉపయోగపడుతుంది. రక్తదానం చేయడం వల్ల సమాజానికి సేవ చేయడంతో పాటు మానవత్వాన్ని చాటుకునే అవకాశం లభిస్తుంది. ప్రతి ఒక్కరూ దీనిని సామాజిక బాధ్యతగా భావించి స్వచ్ఛందంగా ముందుకు రావాలని పిలుపునిచ్చారు. ఈ రక్తదాన శిబిరాన్ని సిద్దిపేట ప్రభుత్వ ఆసుపత్రి రక్తనిధి బ్లడ్ బ్యాంక్ విభాగం సమన్వయంతో విజయవంతంగా నిర్వహించారు. రక్తదానం చేసిన రక్తదాతలందరికీ ప్రశంసా పత్రాలను అందజేసి అభినందించారు. ఈ కార్యక్రమంలో అదనపు డీసీపీ అడ్మిన్ కుశాల్కర్, అదనపు డీసీపీ ఏఆర్ సుభాష్ చంద్రబోస్, బ్లడ్ బ్యాంక్ మెడికల్ అధికారి డాక్టర్ శ్రావణి, ఇతర పోలీస్ సిబ్బంది మరియు ప్రభుత్వ వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

# రక్తదానం ప్రాణదానంతో సమానం

## ప్రతి ఒక్కరూ రక్తదానానికి ముందుకు రావాలి:

## సీపీ అంబర్ కిషోర్ ఝా



జైపూర్, అక్టోబర్ 28 :పోలీస్ అమరవీరుల సంస్మరణ వారోత్సవాల్లో భాగంగా జైపూర్ పోలీస్ స్టేషన్ ఆధ్వర్యంలో బుధవారం రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి రామగుండం పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా, మంచిర్యాల డీసీపీ ఏ. భాస్కర్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా సీపీ అంబర్ కిషోర్ ఝా మాట్లాడుతూ, రక్తదానం ప్రాణదానంతో సమానమని, అత్యవసర పరిస్థితుల్లో రక్తం అవసరమైన వారికి రక్తదాతలు అందించే రక్తం ప్రాణాలను కాపాడటంలో కీలక పాత్ర పోషిస్తుందని తెలిపారు. రక్తదానం సమాజానికి ఎంతో మేలు చేసే గొప్ప సేవా కార్యక్రమమని పేర్కొన్నారు. రక్తదాన శిబిరంలో ఎస్సై భూమేష్‌తో పాటు పోలీస్ అధికారులు, గ్రామ సర్పంచ్, పలువురు యువకులు స్వచ్ఛందంగా రక్తదానం చేయడం అభినందనీయమన్నారు. రక్తదానంపై ప్రతి ఒక్కరూ అవగాహన పెంపొందించుకోవాలని, ఆరోగ్యపరంగా అర్హులైన వారు క్రమం తప్పకుండా స్వచ్ఛందంగా రక్తదానం చేసేందుకు ముందుకు రావాలని సీపీ పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జైపూర్ ఏసీపీ వెంకటేశ్వర్లు, సీఐ నవీన్ కుమార్, ఎస్సై భూమేష్, ప్రజాప్రతినిధులు, యువకులు తదితరులు పాల్గొన్నారు.

# తపాస్ పల్లి భూ భారతి భూముల రీసర్వే ప్రక్రియను పరిశీలించిన కలెక్టర్

సిద్దిపేట ప్రజాబలం ప్రతనిధి:సిద్దిపేట



కొమురవెల్లి మండలం తపాస్ పల్లి గ్రామంలో నిర్వహిస్తున్న భూ భారతి భూముల రీసర్వే ప్రక్రియను జిల్లా కలెక్టర్ కె. హైమావతి క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూదేశానికి స్వాతంత్రపు పూర్వం చేసిన భూముల సర్వే మళ్ళీ ఇప్పుడు భూముల సర్వే చేయడం జరుగుతుందని, పెరిగిన జనాభా ఆధారంగా భూ సమస్యలు ఎక్కువ మొత్తంలో పెరిగాయని దీనికి శాశ్వత పరిష్కారం అందించడం కోసం ప్రభుత్వం భూ-భారతి రీ-సర్వే చేస్తున్నట్లు తెలిపారు. గ్రామ విస్తీర్ణం ఎంత, ఇప్పటి వరకు ఎంత సర్వే జరిగిందనే విషయాలను అధికారులతో ఆరా తీశారు. రీ-సర్వే లో వేగం పెంచాలని ఉదయం మొదలు పెట్టి రోజు 40 ఎకరాల పైన సర్వే చేసేలా పని చెయ్యాలని అధికారులను ఆదేశించారు. భూ రీ-సర్వే ప్రక్రియను పారదర్శకంగా, ఖచ్చితత్వంతో, ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా నిర్వహించాలని అధికారులను ఆదేశించారు. రీ-సర్వే సమయంలో భూమి విస్తీర్ణం, సర్వే నంబర్లు, హద్దులు, పట్టా వివరాలు తదితర అంశాలను సంబంధిత రికార్డులతో సరిపోల్చి నమోదు చేయాలని తెలిపారు. సర్వే లో ప్రతిదీ రెవెన్యూ రికార్డు లో పొందుపరచాలని, సర్వే చేసిన భూ వివరాలను సంబంధిత భూమి యజమానులకు తెలియజేయాలని తహసీల్దార్ ను ఆదేశించారు. భూ భారతి రీ-సర్వే కి రైతులు సహకరించాలని, దీని ద్వారా హద్దులు, సర్వే నెంబర్ బై నంబర్ ల సమస్య తలెత్తకుండా పగడ్బందిగా నిర్దేశించుకోవడం జరుగుతుందని తెలిపారు. కలెక్టర్ వెంట తహసిల్దార్, స్థానిక సర్పంచ్ , ప్రజా ప్రతినిధులు, సర్వే అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# అభివృద్ధికే పట్టం కట్టండి

### విష్ణువర్ధన్ రెడ్డి.టీడీపీ బలపరిచిన ఎంపీటీసీ, జడ్పీటీసీ అభ్యర్థులను భారీ మెజార్టీతో గెలిపించండి

### ఎన్నికల్లో అనుసరించాల్సిన వ్యూహాలపై అభ్యర్థులకు దిశానిర్దేశం చేసిన డి. విష్ణువర్ధన్ రెడ్డి




సి. బెళగల్, :స్థానిక సంస్థల ఎన్నికల్లో ప్రజలు అభివృద్ధిని దృష్టిలో పెట్టుకుని తెలుగుదేశం పార్టీ బలపరిచిన ఎంపీటీసీ, జడ్పీటీసీ అభ్యర్థులకు పట్టం కట్టాలని కేడీసీసీ బ్యాంకు చైర్మన్ డి. విష్ణువర్ధన్ రెడ్డి పిలుపునిచ్చారు. గ్రామస్థాయిలో పార్టీ అభ్యర్థులు, కార్యకర్తలు సమన్వయంతో పనిచేస్తూ ఎన్నికల్లో విజయం సాధించేందుకు కృషి చేయాలని సూచించారు. బుధవారం సి. బెళగల్ మండల కేంద్రంలో నిర్వహించిన బహిరంగ సభలో స్థానిక సంస్థల ఎన్నికల్లో పోటీ చేస్తున్న ఎంపీటీసీ, జడ్పీటీసీ అభ్యర్థులకు ఆయన ఎన్నికల ప్రచార వ్యూహాలు, అనుసరించాల్సిన విధివిధానాలపై దిశానిర్దేశం చేశారు. ప్రతి గ్రామంలో పార్టీ శ్రేణులు ప్రజలతో మమేకమై, గతంలో చేపట్టిన అభివృద్ధి పనులను వివరిస్తూ ఎన్నికల ప్రచారాన్ని విస్తృతంగా నిర్వహించాలని సూచించారు.

గత వైసీపీ పాలనలో అభివృద్ధి కుంటుపడింది ఈ సందర్భంగా విష్ణువర్ధన్ రెడ్డి మాట్లాడుతూ గత వైసీపీ పాలనలో గ్రామాల్లో అభివృద్ధి కుంటుపడిందని విమర్శించారు. గ్రామాల అభివృద్ధిని పక్కనపెట్టి అక్రమాలు, అన్యాయాలకు పాల్పడుతూ పేద ప్రజలను ఇబ్బందులకు గురిచేశారని ఆరోపించారు. అక్రమ ఇసుక దందాలు, ఎర్రమట్టి మాఫియా వ్యవహారాలతో పాలన సాగించారని, పేదల సంక్షేమాన్ని పట్టించుకోలేదని విమర్శించారు. అయితే తెలుగుదేశం పార్టీ పాలనలో గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి ప్రత్యేక ప్రాధాన్యం ఇచ్చామని తెలిపారు. 2014?2019 మధ్య తాను కోడుమూరు నియోజకవర్గ ఇన్‌చార్జిగా బాధ్యతలు నిర్వహించిన సమయంలో పలు గ్రామాల్లో సీసీ రోడ్లు, డ్రైనేజీ నిర్మాణాలు చేపట్టి మౌలిక వసతుల కల్పనకు కృషి చేశామని వివరించారు. సి. బెళగల్ గ్రామంలోనే నిరుపేదలకు సుమారు 600 ఇళ్ల పట్టాలు ఇప్పించామని తెలిపారు. కర్నూలు జిల్లాలోని ఏడు నియోజకవర్గాల్లో అత్యధికంగా 3,600 పింఛన్లు అందించిన ఘనత తెలుగుదేశం పార్టీకే దక్కుతుందని పేర్కొన్నారు.

సి. బెళగల్‌లో రూ.3.50 కోట్లతో సీసీ రోడ్డు సి. బెళగల్ గ్రామంలో చేపట్టిన అభివృద్ధి పనులను వివరిస్తూ జడ్పీ హైస్కూల్ నుంచి పలుకుదొడ్డి గ్రామానికి వెళ్లే రహదారి గతంలో గుంతలమయంగా ఉండేదని, వర్షం పడితే గుంతల్లో నీరు నిలిచి చెరువును తలపించే పరిస్థితి ఏర్పడేదని విష్ణువర్ధన్ రెడ్డి గుర్తుచేశారు. దీంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొనేవారని తెలిపారు. స్థానిక నాయకుల విజ్ఞప్తి మేరకు సుమారు రూ.3.50 కోట్లతో సీసీ రోడ్డు నిర్మాణం చేపట్టామని వివరించారు. అలాగే గ్రామ ప్రజల తాగునీటి అవసరాలను దృష్టిలో పెట్టుకుని రూ.90 లక్షల వ్యయంతో నీటి ట్యాంకు నిర్మాణాన్ని పూర్తి చేశామని వెల్లడించారు. గ్రామాల్లో మౌలిక వసతుల కల్పనకు తమ పార్టీ ఎల్లప్పుడూ కట్టుబడి ఉంటుందని స్పష్టం చేశారు. ప్రజలు గతంలో జరిగిన అభివృద్ధిని, భవిష్యత్తులో గ్రామాల పురోగతికి అవసరమైన పనులను బేరీజు వేసుకుని ఓటు వేయాలని కోరారు. సైకిల్ గుర్తుపై ఓటు వేసి టీడీపీ బలపరిచిన ఎంపీటీసీ, జడ్పీటీసీ అభ్యర్థులను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని విజ్ఞప్తి చేశారు.

## నషా ముక్త్ భారత్ కోసం కృషి చేద్దాం: కలెక్టర్ చిత్రా మిశ్రా

కరీంనగర్ నషా ముక్త్ భారత్ కోసం అందరం కృషి చేద్దామని జీవితాలను చిన్నాభిన్నం చేసే పొగాకు, గుట్కా తదితర మత్తు పదార్థాల అలవాట్లకు ప్రతి ఒక్కరూ దూరం ఉండాలని కలెక్టర్ చిత్రా మిశ్రా పేర్కొన్నారు. ఉస్మానియా యూనివర్సిటీలో ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ తెలంగాణ రాష్ట్ర శాఖ, ఓయూ ఎన్ఎస్ఎస్ సెల్ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన నషాముక్త్ భారత్, నషాముక్త్ యువ ఫర్ వికసిత్ భారత్-2047 అవగాహన కార్యక్రమానికి గవర్నర్ శివ ప్రతాప్ శుక్లా ముఖ్యఅతిథిగా హాజరై ప్రసంగించారు. ఈ కార్యక్రమాన్ని అన్ని జిల్లాల్లో వర్చువల్ గా వీక్షించారు. ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ కరీంనగర్ జిల్లా శాఖ ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఆడిటోరియంలో ఏర్పాటుచేసిన వర్చువల్ కార్యక్రమానికి ఎస్ఆర్ఆర్ కళాశాల ఎన్ఎస్ఎస్ విద్యార్థులు వివిధ శాఖల అధికారులు, సిబ్బంది హాజరయ్యారు. వర్చువల్ కార్యక్రమం అనంతరం జిల్లా కలెక్టర్ మాట్లాడారు. మత్తు పదార్థాల వినియోగం వ్యక్తిగత జీవితంతోపాటు కుటుంబానికి, సమాజానికి నష్టం కలిగిస్తుందన్నారు. మాదకద్రవ్య రహిత సమాజ స్థాపన కోసం ప్రతి పౌరుడు బాధ్యతతో డ్రగ్స్‌కు దూరంగా ఉండాలన్నారు. మత్తు పదార్థాల డ్రగ్స్ నియంత్రణకు పోలీస్, చైల్డ్ వెల్ఫేర్, విద్యా శాఖ, తదితర శాఖల సమన్వయంతో పటిష్ట చర్యలు తీసుకుంటున్నట్లు వివరించారు. విద్యార్థులు యువత చాక్లెట్లు, ఇతర తినుబండారాల విషయంలో జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. తప్పనిసరిగా వాటి కవర్లు, ప్యాకెట్లపై ఉన్న అంశాలు చదవాలన్నారు. మత్తు పదార్థాల వినియోగం తో కలిగే దుష్పరిణామాలను తప్పనిసరిగా విద్యాసంస్థల్లో అవగాహన కార్యక్రమాలు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. డ్రగ్స్ సరదా కోసం మొదలై.. తరువాత అలవాటుగా మారి జీవితాలను అంధకారంలోకి తీసుకెళ్తుందన్నారు. విద్యార్థులు, యువత ప్రవర్తనను ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు నిరంతరం గమనించాలని సూచించారు. ప్రతి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వద్ద నషా ముక్త్ భారత్ అభియాన్ అవగాహన కార్యక్రమాలు ఏర్పాటు చేయాలని వైద్య అధికారులను ఆదేశించారు. గ్రామాల్లో టోల్ ఫ్రీ నెంబర్ 14445పై విస్తృతంగా అవగాహన కల్పించాలని అధికారులకు సూచించారు. ఈ సందర్భంగా ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం నిర్వహించారు. కలెక్టర్ వివిధ శాఖల అధికారులు, ఇండియన్ రెడ్ క్రాస్ సభ్యులు, విద్యార్థులతో నషా ముక్త్ భారత్ ప్రతిజ్ఞ చేశారు.

# బాలల ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టి

## పోషకాహార లోపాలను తొలిదశలోనే గుర్తించాలి: డీఎంహెచ్‌వో డాక్టర్ కె. ఆనంద్

**మేడ్చల్--మల్కాజిగిరి జిల్లా ప్రతినిధి ప్రజాబలం అక్టోబర్ 28:** బాలల ఆరోగ్య పరిరక్షణ, పోషకాహార లోపాల నివారణ, వ్యాధుల ముందస్తు గుర్తింపునకు ఆర్‌బీఎస్‌కే మొబైల్ హెల్త్ టీమ్‌లు ప్రత్యేక శ్రద్ధ వహించాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ కె. ఆనంద్ సూచించారు. జిల్లాలోని ఆర్‌బీఎస్‌కే వైద్యాధికారులు, మొబైల్ హెల్త్ టీమ్‌ల సిబ్బందితో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు.



జననం నుంచి 18 ఏళ్లలోపు పిల్లలకు సమగ్ర ఆరోగ్య పరీక్షలు నిర్వహించి, వారి ఎదుగుదలలో తలెత్తే సమస్యలను తొలిదశలోనే గుర్తించడం రాష్ట్రీయ బాల స్వాస్థ్య కార్యక్రమం (ఆర్‌బీఎస్‌కే) ప్రధాన ఉద్దేశమని తెలిపారు. పుట్టుకతో వచ్చే లోపాలు, పోషకాహార లోపాలు, బాల్య వ్యాధులు, అభివృద్ధిలో జాప్యం, వైకల్యాలను గుర్తించి అవసరమైన వైద్య సేవలు అందించాలని పేర్కొన్నారు.

మొబైల్ హెల్త్ టీమ్‌లు అంగన్‌వాడీ కేంద్రాలు, ప్రభుత్వ, ప్రభుత్వ గుర్తింపు పొందిన పాఠశాలలను క్రమం తప్పకుండా సందర్శించి పిల్లలకు ఆరోగ్య పరీక్షలు నిర్వహించాలన్నారు. ఆరు వారాల నుంచి ఆరు సంవత్సరాల వయస్సున్న చిన్నారులకు అంగన్‌వాడీ కేంద్రాల్లో, పాఠశాలలకు వెళ్లే పిల్లలకు విద్యాసంస్థల్లో పరీక్షలు చేపట్టాలని సూచించారు.

పిల్లల్లో తీవ్రమైన పోషకాహార లోపం (ఎస్‌ఏఎం), మధ్యస్థాయి పోషకాహార లోపం (ఎంఏఎం) కేసులను గుర్తించి, వారి ఆరోగ్య పరిస్థితికి అనుగుణంగా చికిత్స, పోషకాహార సహాయం అందించాలన్నారు. ఆసుపత్రిలో చేరాల్సిన అవసరం లేని పిల్లలకు మార్గదర్శకాల ప్రకారం సమాజ స్థాయిలోనే వైద్య పర్యవేక్షణ కల్పించాలని తెలిపారు. అవసరమైన వారిని ఉన్నత వైద్య కేంద్రాలకు సకాలంలో రిఫర్ చేసి, చికిత్స అందుతున్న తీరును పర్యవేక్షించాలని ఆదేశించారు.

పోషకాహార లోపం ఉన్న పిల్లల తల్లిదండ్రులకు సమతుల్య ఆహారం, శిశు పోషణ, వ్యక్తిగత పరిశుభ్రత, పిల్లల ఎదుగుదలపై అవగాహన కల్పించాలన్నారు. ఎంఏఎం స్థాయిలో ఉన్న పిల్లలు ఎస్‌ఏఎం స్థాయికి చేరకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని, ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలతో సమన్వయం చేసుకుంటూ ఇంటివద్ద పిల్లల ఆరోగ్య పరిస్థితిని నిరంతరం పర్యవేక్షించాలని డాక్టర్ కె. ఆనంద్ సూచించారు.

బాలల ఆరోగ్య సమస్యలను ముందుగానే గుర్తించి, అవసరమైన వారికి సకాలంలో వైద్య సేవలు అందించడం ద్వారా ఆరోగ్యవంతమైన బాల్యానికి బాటలు వేయాలని ఆయన పేర్కొన్నారు.

# వట్టిపల్లి అభివృద్ధికి మంత్రి దామోదర్ రాజనర్సింహ విశేష కృషి

## వట్టిపల్లి లో సుమారు రూ 30, కోట్లతో పలు అభివృద్ధి పనులు కొనసాగుతున్నాయి

**అందోల్ నియోజకవర్గం ప్రతినిధి అక్టోబర్ 28 (ప్రజాబలం) సంగారెడ్డి జిల్లా :** వట్టిపల్లి మండలం మౌలిక వసతులు, ప్రజా సంక్షేమంతో





పాటు, వివిధ రంగాల్లో వేగంగాఅభివృద్ధి చెందుతూ,ప్రగతి పథంలో ముందుకు సాగుతోంది, వట్టిపల్లిలోపూర్తికావస్తున్న 30,పడకల ఆసుపత్రి, రూ,43, లక్షలతో మార్కెట్ ఫ్లోరింగ్ పనులు చేపట్టి, స్థానిక ప్రజలకు, మెరుగైన సౌకర్యాలు కల్పించే దిశగా అడుగులు, ప్రభుత్వ కార్యాలయాల,నిర్మాణ పనులకు,ప్రాధాన్యతనిస్తూ,ప్రజలకు పరిపాలన సేవలు మరింత చేరు వయేలా కృషి, రహదారులు డ్రైనేజి మౌలిక సదుపాయాల అభివృధిపై ప్రత్యేక దృష్టి, రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనరసింహ, చొరవతో అందోల్ నియోజకవర్గం లో అభివృద్ధి పనులకు ఉతం లభిస్తుంది, ప్రజల అవసరాలను గుర్తించి, వట్టిపల్లి తో పాటు, నియోజకవర్గంలోని, అన్ని ప్రాంతాల అభివృద్ధికి మంత్రి కృషి చేస్తున్నారు..

### తీరం దాటిన ఆర్నబ్ తుపాను

అమరావతి చివరికి... ఎన్నో ఉత్కంఠల తర్వాత తీరాన్ని తాకింది పెను తుపాను ఆర్నబ్. రాత్రి 2 గంటల నుంచి ఉదయం 8 గంటల మధ్య .యానాంకు నైరుతిగా నరసాపురం దగ్గర తీరం దాటినట్టుగా అధికారులు ప్రకటించారు. తీరం దాటుతూనే ఆర్నబ్ తీవ్ర తుపానుగా బలహీనపడింది. అయినప్పటికీ ప్రజలు ఇంకా అప్రమత్తంగా ఉండాల్సిందేనని అధికారులు హెచ్చరించారు. గాలులు తగ్గినా వర్షప్రభావం ఇంకా తీవ్రంగా ఉంటుంది. నేడు పలు జిల్లాలకు భారీ వర్ష సూచన ఉందని విపత్తుల నిర్వహణ సంస్థ ఎండీ ప్రఖర్ జైన్ స్పష్టం చేశారు

# జర్నలిస్టుల హక్కుల సాధనలో ఐఎఫ్‌డబ్ల్యూజే కీలక పాత్ర

- జర్నలిస్టుల రక్షణకు ప్రత్యేక చట్టం తీసుకురావాలి
- సీనియర్ పాత్రికేయులకు జాతీయ పెన్షన్ పథకం అమలు చేయాలి
- టిడబ్ల్యూజేఎఫ్ జిల్లా కార్యదర్శి కుడుతాడు బాపూరావు
- ఘనంగా ఐఎఫ్‌డబ్ల్యూజే ఆవిర్భావ దినోత్సవ వేడుకలు

**కరీంనగర్ జిల్లా ప్రజా బలం ప్రతినిధి అక్టోబర్ 28** జర్నలిస్టుల హక్కుల పరిరక్షణ, ఉద్యోగ భద్రత, వృత్తిపరమైన స్వేచ్ఛ కోసం ఇండియన్ ఫెడరేషన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్స్ (ఐఎఫ్‌డబ్ల్యూజే) ఏడు దశాబ్దాలకు పైగా నిరంతరం పోరాడుతోందని తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్ ఫెడరేషన్ (టిడబ్ల్యూజేఎఫ్) జిల్లా కార్యదర్శి కుడుతాడు బాపూరావు అన్నారు. ఐఎఫ్‌డబ్ల్యూజే ఆవిర్భావ దినోత్సవ వేడుకలను ఫెడరేషన్ కార్యాలయంలో బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సీనియర్ జర్నలిస్టులు పిఎస్ రవీంద్ర, కొరిమి వెంకటస్వామి, డిఎస్ ప్రసాద్, ఆడెపు లక్ష్మీనారాయణ, ఆరెల్లి శ్రీనివాస్ లను ఘనంగా సన్మానించారు. అనంతరం బాపూరావు మాట్లాడారు. ఐఎఫ్‌డబ్ల్యూజే జాతీయ కమిటీ పిలుపు మేరకు దేశవ్యాప్తంగా ఆవిర్భావ దినోత్సవ కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. జర్నలిస్టుల సమస్యల పరిష్కారం కోసం సంఘటితంగా పోరాడాలని, మీడియా స్వేచ్ఛను కాపాడుతూ ప్రజాస్వామ్య పరిరక్షణలో పాత్రికేయులు తమ బాధ్యతను కొనసాగించాలని పిలుపునిచ్చారు. జర్నలిస్టుల సంక్షేమం, హక్కుల పరిరక్షణకు కేంద్ర ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. 1950 అక్టోబర్ 28న న్యూఢిల్లీలో ఏర్పాటైన ఐఎఫ్‌డబ్ల్యూజే దేశవ్యాప్తంగా జర్నలిస్టులను ఐక్యం చేస్తూ వారి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తోందన్నారు. వేతనాల పెంపు, మెరుగైన సేవా నిబంధనలు, పని గంటల క్రమబద్ధీకరణ, ఉద్యోగ భద్రత వంటి అంశాల్లో జర్నలిస్టుల హక్కుల సాధనకు సంస్థ అనేక ఉద్యమాలు చేపట్టిందని గుర్తుచేశారు. వర్కింగ్ జర్నలిస్టుల చట్టం, వేతన సవరణలు, పత్రికా రంగానికి సంబంధించిన వివిధ కమిటీల్లో జర్నలిస్టుల ప్రాతినిధ్యం వంటి అంశాల్లో పాత్రికేయ సంఘాల పోరాటాలు కీలకంగా నిలిచాయన్నారు.




**జర్నలిస్టుల రక్షణకు ప్రత్యేక చట్టం అవసరం...**

దేశవ్యాప్తంగా జర్నలిస్టులపై దాడులు, హత్యలు, బెదిరింపులు, అక్రమ కేసుల వంటి ఘటనలు ఆందోళన కలిగిస్తున్నాయని బాపూరావు అన్నారు. ప్రజా సమస్యలను వెలుగులోకి తెస్తూ విధులు నిర్వహించే జర్నలిస్టులకు రక్షణ కల్పించేందుకు కేంద్ర ప్రభుత్వం ప్రత్యేక చట్టాన్ని తీసుకురావాలని ఐఎఫ్‌డబ్ల్యూజే చాలాకాలంగా డిమాండ్ చేస్తోందని తెలిపారు. ఈ డిమాండ్‌ను కేంద్ర ప్రభుత్వం వెంటనే పరిగణనలోకి తీసుకుని జర్నలిస్టుల భద్రతకు చట్టపరమైన రక్షణ కల్పించాలని కోరారు. దేశవ్యాప్తంగా వివిధ పత్రికలు, వార్తా సంస్థలు, ఎలక్ట్రానిక్ మీడియాల్లో పనిచేస్తున్న జర్నలిస్టుల వివరాలను ధ్రువీకరించి జాతీయ స్థాయిలో రిజిస్టర్ రూపొందించాలని డిమాండ్ చేశారు. దీనివల్ల అర్హులైన జర్నలిస్టుల గుర్తింపు, సంక్షేమ పథకాల అమలు, ప్రభుత్వ సహాయ కార్యక్రమాల రూపకల్పనకు వెసులుబాటు కలుగుతుందని పేర్కొన్నారు.

**సీనియర్ జర్నలిస్టులకు పెన్షన్ కల్పించాలి...**

అరవై ఏళ్లు దాటిన సీనియర్ జర్నలిస్టులకు ఆర్థిక భరోసా కల్పించేందుకు దేశవ్యాప్తంగా అమలయ్యే జాతీయ పెన్షన్ పథకాన్ని ప్రవేశపెట్టాలని బాపూరావు కోరారు. జర్నలిస్టులకు గతంలో అందుబాటులో ఉన్న రైల్వే ప్రయాణ రాయితీ పాస్‌లను పునరుద్ధరించాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. జర్నలిస్టుల కుటుంబాల సంక్షేమం, వైద్య సదుపాయాలు, సామాజిక భద్రతకు కూడా ప్రాధాన్యం ఇవ్వాలన్నారు.

సీనియర్ జర్నలిస్టు పిఎస్ రవీంద్ర మాట్లాడుతూ.. జర్నలిస్టుల సంఘానికి నాయకత్వం వహించే వ్యక్తి పదవికే పరిమితం కాకుండా, సంఘం బలోపేతానికి నిరంతరం సమయం కేటాయిస్తూ పనిచేయాలని సీనియర్ జర్నలిస్టు పిఎస్ రవీంద్ర అభిప్రాయపడ్డారు. జర్నలిస్టుల హక్కుల సాధన, వృత్తిపరమైన భద్రత, సంక్షేమం కోసం నాయకుడు నిబద్ధతతో వ్యవహరించాలని పేర్కొన్నారు. ఒక స్పష్టమైన లక్ష్యాన్ని నిర్దేశించుకుని, దానిని సాధించే దిశగా సంకల్పబలంతో ముందుకు సాగినప్పుడే నాయకత్వానికి సార్థకత చేకూరుతుందన్నారు. జర్నలిస్టులు ఎదుర్కొంటున్న సమస్యలపై నిరంతరం స్పందించడం, వారి గొంతుకగా నిలవడం, అవసరమైన సందర్భాల్లో అధికారులతో మాట్లాడి సమస్యల పరిష్కారానికి కృషి చేయడం నాయకుడి ప్రధాన బాధ్యతలని వివరించారు. సంఘంలోని సభ్యులందరినీ కలుపుకొని పోతూ, వారి అభిప్రాయాలకు ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు. కష్టాల్లో ఉన్న జర్నలిస్టులకు అండగా నిలవడంతోపాటు, హక్కుల పరిరక్షణ కోసం ఐక్యంగా పోరాడే వాతావరణాన్ని కల్పించాలన్నారు. సంఘం అభివృద్ధి అనేది ఒక్కరోజులో సాధ్యమయ్యేది కాదని, నిరంతర కృషి, క్రమశిక్షణ, పారదర్శకత, సేవాభావంతోనే అది సాధ్యమవుతుందని పేర్కొన్నారు. వ్యక్తిగత ప్రయోజనాల కంటే జర్నలిస్టుల సామూహిక ప్రయోజనాలకు పెద్దపీట వేస్తూ, ఇచ్చిన మాటకు కట్టుబడి పనిచేసే నాయకుడే నిజమైన నాయకుడిగా గుర్తింపు పొందుతారని ఆయన అభిప్రాయపడ్డారు. జర్నలిస్టుల హక్కుల సాధనను ఒక బాధ్యతగా స్వీకరించి, సంఘాన్ని బలోపేతం చేయడమే ప్రతి నాయకుడి ప్రధాన సంకల్పం కావాలని ఆయన స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కమిటీ సభ్యుడు గాదె కరుణాకర్ రావు, జిల్లా ఉపాధ్యక్షుడు కొమ్ము గణేష్, లక్కం సురేష్, సహాయ కార్యదర్శి ఎండి ఖాజా, హుజురాబాద్ నియోజకవర్గ అధ్యక్షులు సొడమల్ల యోహాన్, నాయకులు శంకర్ రెడ్డి, రాజేంద్రప్రసాద్, నరేష్, దీక్షిత్, రాజు, రచ్చ రవి కృష్ణ, యూసఫ్ జర్నలిస్ట్ లు పాల్గొన్నారు.

# బైక్ దొంగల ముఠా పట్టివేత.. ఐదు ద్విచక్ర వాహనాలు స్వాధీనం

చందానగర్ అంతర్రాష్ట్ర ద్విచక్ర వాహనాల దొంగల ముఠాను చందానగర్ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఐదుగురు నిందితులు, దొంగిలించిన ఐదు ద్విచక్ర వాహనాలు, 11 నకిలీ నంబర్ ప్లేట్లు, తాళాలు తెరిచేందుకు ఉపయోగించే పరికరాలను స్వాధీనం చేసుకున్నారు. బుధవారం పోలీస్ స్టేషన్ లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఎసిపి శ్రీనివాస్ వివరాలు వెల్లడించారు. ఈ నెల 27, 28 తేదీల మధ్య రాత్రి లింగంపల్లి రైల్వే స్టేషన్ ఆరో నంబర్ ప్లాట్‌ఫామ్ సమీపంలో వాహనాల తనిఖీలు నిర్వహిస్తుండగా, అనుమానాస్పదంగా కనిపించిన ఇద్దరు వ్యక్తులు బైక్‌ను వదిలి పారిపోయేందుకు ప్రయత్నించారు. వారిని వెంబడించి పట్టుకుని విచారించగా, రాయల్ ఎన్‌ఫీల్డ్ క్లాసిక్ 350 బైక్‌ను దొంగిలించినట్లు వెల్లడైంది. మరింత లోతుగా విచారించగా.. నిందితులు మరో ముగ్గురితో కలిసి ద్విచక్ర వాహనాల దొంగతనాలకు పాల్పడుతున్నట్లు అంగీకరించారు.

అదుపులోకి తీసుకున్న వారిలో రాజమండ్రికి చెందిన గడ్డం ప్రవీణ్ (21), బురిడి గోపీచంద్ (20), చోడవరపు దినేశ్ కుమార్ (22), గీసాల షణ్ముఖ సత్యసాయి (21), సీరపు దినేశ్ కుమార్ (22)లు ఉన్నారు. డిసెంబర్ 2025 నుంచి సైబరాబాద్‌తో పాటు పరిసర ప్రాంతాల్లో బైక్‌లను దొంగిలించి, నకిలీ నంబర్ ప్లేట్లు అమర్చి రాజమండ్రికి తరలిస్తున్నట్లు తెలిపారు. వీరి నుంచి మూడు రాయల్ ఎన్‌ఫీల్డ్ బైక్‌లు, ఒక కేటీఎం డ్యూక్ సహా మొత్తం ఐదు వాహనాలను స్వాధీనం చేసుకున్నట్లు వెల్లడించారు.

# ఫార్ములా ఈ కేసులో కేటీఆర్‌కు తాత్కాలిక ఊరట

## ఏసీబీ, పాస్‌పోర్ట్ అధికారులకు కోర్టు నోటీసుల జారీ

## కేసు తదుపరి విచారణ నవంబర్ 6కు వాయిదా

హైదరాబాద్ ఫార్ములా ఈ రేస్ నిధుల మళ్లింపు కేసులో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీ రామారావుకు తెలంగాణ హైకోర్టులో తాత్కాలిక ఊరట లభించింది. ఆయన పాస్‌పోర్ట్‌కు సంబంధించి జారీ అయిన నోటీసుల విషయంలో యథాతథ స్థితి (స్టేటస్ కో) కొనసాగించాలని న్యాయస్థానం మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసింది. ఫార్ములా ఈ కేసులో విచారణ జరుపుతున్న అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ), కేటీఆర్ పాస్‌పోర్ట్‌ను స్వాధీనం చేసుకోవాలని కోరుతూ ప్రాంతీయ పాస్‌పోర్ట్ కార్యాలయానికి (ఆర్‌పీవో) లేఖ రాసింది. ఏసీబీ అభ్యర్థన మేరకు పాస్‌పోర్ట్ అధికారులు కేటీఆర్‌కు షోకాజ్ నోటీసులు జారీ చేశారు. ఈ నోటీసులను సవాలు చేస్తూ కేటీఆర్ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిటిషన్‌పై విచారణ చేపట్టిన ఉన్నత న్యాయస్థానం, పాస్‌పోర్ట్ నోటీసుల ప్రక్రియలో యథాతథ స్థితిని పాటించాలని ఆదేశించింది. ప్రతివాదులుగా ఉన్న ఏసీబీ, పాస్‌పోర్ట్ అధికారులకు నోటీసులు జారీ చేస్తూ, వారి వాదనలను కౌంటర్ అఫిడవిట్ రూపంలో సమర్పించాలని సూచించింది. అనంతరం, కేసు తదుపరి విచారణను నవంబర్ 6వ తేదీకి వాయిదా వేసింది. హైకోర్టు మధ్యంతర ఉత్తర్వులతో కేటీఆర్ పాస్‌పోర్ట్‌ను స్వాధీనం చేసుకునే ప్రక్రియకు ప్రస్తుతానికి అడ్డుకట్ట పడినట్లయింది.

## పద్మశాలీ,బీసీల గొంతుకగా నిలిచిన దాసు సురేష్‌కు గవర్నర్ కోటాలో ఎమ్మెల్సీ అవకాశం కల్పించాలి!




సిరిసిల్ల ఆక్టోబర్ 28; పద్మశాలీ,బీసీల సంక్షేమం, అభివృద్ధి, సామాజిక న్యాయం, చేనేత కార్మికుల ఆత్మహత్యల నివారణ, వారి హక్కుల సాధన కోసం గత రెండు దశాబ్దాలుగా నిరంతరం కృషి చేస్తున్న బీసీ రాజ్యాధికార సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు దాసు సురేష్‌కు గవర్నర్ కోటాలో ఎమ్మెల్సీగా అవకాశం కల్పించాలని బీసీ రాజ్యాధికార సమితి రాష్ట్ర నాయకుడు బాలకృష్ణ ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.

రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంలో నేడు బీసీ రాజ్యాధికార సమితి ఆధ్వర్యంలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ, బీసీ వర్గాలకు రాజకీయ, సామాజిక రంగాల్లో సముచిత ప్రాతినిధ్యం కల్పించాల్సిన అవసరం ఎంతైనా ఉందని పేర్కొన్నారు. జనాభాలో గణనీయమైన వాటా కలిగిన బీసీలకు అభివృద్ధి ఫలాల్లో, అధికార వ్యవస్థలో తగిన భాగస్వామ్యం లభించినప్పుడే నిజమైన సామాజిక న్యాయం సాధ్యమవుతుందని అన్నారు.

పద్మశాలీ,బీసీల సమస్యలను ప్రభుత్వాల దృష్టికి తీసుకెళ్లడం, వారి హక్కుల కోసం గళమెత్తడం, వెనుకబడిన వర్గాల్లో నాయకత్వాన్ని పెంపొందించడం వంటి అంశాల్లో దాసు సురేష్ చేస్తున్న కృషి అభినందనీయమని బాలకృష్ణ కొనియాడారు. వ్యక్తిగత రాజకీయ ప్రయోజనాలకంటే బీసీ సమాజ అభ్యున్నతికి ప్రాధాన్యతనిస్తూ ఆయన సాగిస్తున్న ప్రయాణానికి తగిన గుర్తింపు లభించాల్సిన సమయం ఆసన్నమైందని అభిప్రాయపడ్డారు.

బీసీల సమస్యలను క్షేత్రస్థాయి నుంచి ప్రభుత్వ స్థాయి వరకు బలంగా వినిపించగల సామాజిక ఉద్యమ నాయకులకు చట్టసభల్లో ప్రాతినిధ్యం కల్పించడం ద్వారా ఆయా వర్గాల సమస్యలకు మరింత ప్రాధాన్యత లభిస్తుందని ఆయన పేర్కొన్నారు. గవర్నర్ కోటా ఎమ్మెల్సీ పదవి కేవలం ఒక వ్యక్తికి ఇచ్చే రాజకీయ అవకాశం మాత్రమే కాదని, అది బీసీ సమాజానికి, ముఖ్యంగా చేనేత మరియు వెనుకబడిన వర్గాల ఆకాంక్షలకు గుర్తింపునిచ్చే అవకాశమని అన్నారు.

దాసు సురేష్‌కు ఎమ్మెల్సీ అవకాశం కల్పించడం ద్వారా బీసీ నాయకత్వానికి గౌరవం ఇవ్వడంతో పాటు, సామాజిక న్యాయం పట్ల ప్రభుత్వ నిబద్ధతను చాటాలని బాలకృష్ణ విజ్ఞప్తి చేశారు. అట్టడుగు వర్గాల హక్కుల కోసం నిరంతరం పనిచేస్తున్న నాయకులకు తగిన అవకాశాలు కల్పించినప్పుడే ప్రజాస్వామ్యంలో అన్ని వర్గాలకు సమాన భాగస్వామ్యం సాధ్యమవుతుందని స్పష్టం చేశారు.

బీసీల అభ్యున్నతి, ఆత్మగౌరవం, రాజకీయ సాధికారత లక్ష్యంగా పనిచేస్తున్న దాసు సురేష్‌కు గవర్నర్ కోటాలో ఎమ్మెల్సీగా అవకాశం కల్పించాలని ప్రభుత్వానికి మరోసారి విజ్ఞప్తి చేస్తూ బాలకృష్ణ తన ప్రసంగాన్ని ముగించారు.

## విజయపురి కాలనీ శ్రీ చైతన్య పాఠశాలలో విద్యార్థులకు అరైవ్ అలైవ్ కార్యక్రమం

### ట్రాఫిక్ నిబంధనలు పాటించండి.. సురక్షితంగా గమ్యాన్ని చేరుకోండి

### తల్లిదండ్రులతో కలిసి పాఠశాలలో విద్యార్థులకు టాఫిక్ ఇన్స్పెక్టర్ బి.జగన్ రెడ్డి హితవు

హైద్రాబాద్ అక్టోబర్ 28;జాతీయ రోడ్డు భద్రత వారోత్సవాలలో భాగంగా చిలుకల గూడ టాఫిక్ ఇన్స్పెక్టర్ బి.జగన్ రెడ్డి ఆధ్వర్యం లో సికింద్రాబాద్ విజయపురి కాలనీలోని శ్రీ చైతన్య పాఠశాలలో విద్యార్థులు, పాఠశాల సిబ్బంది, విద్యార్థుల తల్లిదండ్రులతో కలిసి అరైవ్ అలైవ్ కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ కార్యక్రమం లో సుమారు 200 మంది విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా జగన్ రెడ్డి మాట్లాడుతూ ప్రతి ఒక్కరు ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని.హెల్మెట్ లేకుండా వాహానాలు నడుపరాధని,ఎలాంటి పరిస్థితిలోనైనా ఎడమవైపు నుండి వాహానాలు ఓవర్ టేక్ చేయరాదని.సిగ్నల్ జంప్ చేయరాదని,రాంగ్ రూట్ బండ్లు






నడుపరాదని,అత్యంత వేగంగా ద్వేచక్ర వాహనాలు నడుపరాదని, తప్పని సరిగా ప్రతి ఒక్కరు టాఫిక్ నిబాబుధనలు పాటించి సుకంగా గమ్యాన్ని చేరుకోవాలని హితవు పలికారు.

## ట్రాఫిక్ చిక్కులకు సరికొత్త పరిష్కారం.. పాడ్ కార్ల ప్రయాణం!

### సి.హెచ్. ప్రతాప్

హైదరాబాద్ మహానగరంలో పెరుగుతున్న ట్రాఫిక్ రద్దీకి పరిష్కారం చూపే దిశగా తెలంగాణ ప్రభుత్వం వినూత్న రవాణా వ్యవస్థను పరిశీలిస్తోంది. మెట్రో ప్రయాణికులను చివరి గమ్యస్థానానికి సులభంగా చేర్చేందుకు పర్సనల్ ర్యాపిడ్ ట్రాన్సిట్ సిస్టమ్ (పీఆర్‌టీఎస్)ను ప్రవేశపెట్టే అవకాశాలపై అధ్యయనం చేపట్టింది. చిన్న విద్యుత్ వాహనాలతో నడిచే ఈ వ్యవస్థ అందుబాటులోకి వస్తే నగర రవాణాలో కొత్త అధ్యాయం ప్రారంభం కానుంది.

హైదరాబాద్ మెట్రో రైల్ లిమిటెడ్ ఆధ్వర్యంలో అక్టోబర్ 27న నిర్వహించిన సమావేశంలో ఈ ప్రతిపాదనపై చర్చించారు. ప్రభుత్వ, ప్రైవేటు సంస్థల ప్రతినిధులు సాంకేతిక, ఆర్థిక సాధ్యాసాధ్యాలపై అభిప్రాయాలు వెల్లడించారు. ప్రభుత్వ--ప్రైవేటు భాగస్వామ్యంతో ప్రాజెక్టును చేపట్టే అవకాశాలను పరిశీలిస్తున్నారు.

పీఆర్‌టీఎస్‌లో చిన్న పరిమాణంలోని విద్యుత్ పాడ్ కార్లు ప్రత్యేక మార్గాలపై ప్రయాణిస్తాయి. సాధారణంగా మూడు నుంచి ఆరుగురు ప్రయాణికులు కూర్చునే వీలుండే ఈ వాహనాలు డ్రైవర్ అవసరం లేకుండా స్వయంచాలకంగా నడుస్తాయి. ప్రయాణికులు కోరుకున్న స్టేషన్ వద్ద దిగేందుకు వీలుగా వ్యవస్థను రూపొందించవచ్చు. మెట్రో దిగిన తర్వాత కార్యాలయాలు, నివాస సముదాయాలు, వాణిజ్య కేంద్రాలకు చేరుకోవడంలో ఎదురయ్యే ఇబ్బందులను తగ్గించడమే ప్రధాన లక్ష్యం.

ప్రాథమిక పరిశీలనలో రాయదుర్గం, హైటెక్ సిటీ, నాలెడ్జ్ సిటీ, ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్, కూకట్‌పల్లి ప్రాంతాలతోపాటు రాష్ట్ర సచివాలయం పరిసరాలను పరిగణనలోకి తీసుకున్నారు. ముఖ్యంగా ఐటీ ఉద్యోగుల రాకపోకలు అధికంగా ఉండే ప్రాంతాల్లో ఈ వ్యవస్థ ఉపయోగకరంగా ఉంటుందని భావిస్తున్నారు. రద్దీ సమయాల్లో ప్రధాన రహదారులపై వాహనాల ఒత్తిడిని తగ్గించేందుకు ఇది ప్రత్యామ్నాయంగా నిలవవచ్చు.

మెట్రో స్టేషన్ల నుంచి గమ్యస్థానాలకు చేరుకునేందుకు ఆటోలు, క్యాబ్‌ల కోసం ఎదురుచూడాల్సిన అవసరాన్ని పాడ్ కార్లు తగ్గించగలవు. ప్రయాణ సమయం, ఇంధన వినియోగం, వాయు కాలుష్యం తగ్గే అవకాశముంది. ఇతర ప్రజా రవాణా సదుపాయాలతో సమర్థంగా అనుసంధానిస్తే మెట్రో వినియోగం మరింత పెరగవచ్చు. ప్రయాణికుల అవసరాలకు అనుగుణంగా తక్కువ నిరీక్షణ సమయంతో సేవలు అందించడం ఈ వ్యవస్థ విజయానికి కీలకం.

ప్రస్తుతం ప్రాజెక్టు సాధ్యాసాధ్యాల పరిశీలన, భాగస్వామ్య సంస్థల సంప్రదింపుల దశలో ఉంది. మార్గాలు, నిర్మాణ వ్యయం, ప్రయాణ చార్జీలు, అమలు కాలపరిమితిపై తుది నిర్ణయాలు తీసుకోవాల్సి ఉంది. ప్రయాణికుల భద్రత, నిర్వహణ వ్యయం, స్టేషన్లకు అందుబాటు వంటి అంశాలపై ప్రత్యేక దృష్టి అవసరం. విద్యుత్ సరఫరా, వాహనాల నిర్వహణ, అత్యవసర పరిస్థితుల్లో రక్షణ ఏర్పాట్లకు కూడా సమగ్ర ప్రణాళిక అవసరమవుతుంది. సామాన్యులకు అందుబాటులో ఉండే చార్జీలు నిర్ణయిస్తే ఈ సేవలకు ఆదరణ పెరుగుతుంది. ప్రాజెక్టు కార్యరూపం దాల్చితే హైదరాబాద్‌లో ప్రజా రవాణా మరింత ఆధునికంగా, వేగవంతంగా, సౌకర్యవంతంగా మారనుంది.

## డ్రగ్స్ మహమ్మారిని తరిమికొడదాం రెడ్ క్రాస్ సొసైటీ చైర్మన్ సాయి చౌదరి




వికారాబాద్ అక్టోబర్ 28 : విద్యార్థుల ఉజ్వల భవిష్యత్తును నాశనం చేస్తున్న డ్రగ్స్ మహమ్మారిని మన దేశం నుంచి తరిమి కొట్టాలని జిల్లా రెడ్ క్రాస్ సొసైటీ చైర్మన్ సాయి చౌదరి అన్నారు విశ్వ భారతి డిగ్రీ కళాశాల విద్యార్థులతో కలిసి "నశా ముక్త భారత్ అభియాన్ "ర్యాలీని మరియు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా రెడ్ క్రాస్ సొసైటీ చైర్మన్ సాయి చౌదరి మాట్లాడుతూ ఉన్నతమైన లక్ష్యాన్ని ఎంచుకొని క్రమశిక్షణతో చదువుకుంటున్న విద్యార్థులను కొంతమంది దుష్టశక్తులు దురలవాట్లకు దగ్గరకు చేస్తున్నారని డ్రగ్స్, మధ్యము, సిగరెట్లకు బానిసలుగా చేస్తున్నారని అన్నారు. దీంతో ప్రతి విద్యార్థి విలువైన సమయాన్ని వృధా చేయటంతో పాటు ఆరోగ్యాన్ని పాడు చేసుకుంటున్నారని తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా రెడ్ క్రాస్ సొసైటీ ప్రధాన కార్యదర్శి సత్యనారాయణ గౌడ్ మాట్లాడుతూ తల్లిదండ్రులు, గురువులు కన్నా కలలను నిజం చేసేందుకు నిరంతరం కష్టపడాలని పిలుపునిచ్చారు. సక్రమమైన మార్గాన్ని ఎంచుకొని లక్ష్యసాధనకు కృషి చేయాలన్నారు. విశ్వ భారతి డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ సుధాకర్ రెడ్డి మాట్లాడుతూ విద్యార్థులు తమ జీవితాలను అందరికీ ఆదర్శంగా ఉండేలా మలచుకోవాలని సూచించారు. ప్రతి విద్యార్థి శాస్త్రసాంకేతిక పరిజ్ఞానాన్ని విరివిగా సంపాదించాలన్నారు. కళాశాలలో చదువుతున్న విద్యార్థులకు కావలసిన అన్ని రకాల మౌలిక సదుపాయాలు ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా రెడ్ క్రాస్ సొసైటీ మేనేజింగ్ కమిటీ సభ్యులు, పుర ప్రముఖులు, స్వచ్ఛంద సేవా సంస్థల ప్రతినిధులు, కళాశాల విద్యార్థిని, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## మంత్రి పొంగులేటికి బావోజు సిద్దేశ్వర చారి జన్మదిన శుభాకాంక్షలు



హైద్రాబాద్ అక్టోబర్ 28:రెవెన్యూ గృహ నిర్మాణం ( హౌసింగ్ ) సమాచార పౌరసంబంధంల. శాఖల మంత్రి పొంగులేటిశ్రీనివాస్ రెడ్డి జన్మదిన పురస్కరించుకొని కాంగ్రెస్ పార్టీ సోషల్ మీడియా కన్వీనర్ ఇంద్రమ్మ కమిటీ కోఆర్డినేటర్ మహేశ్వరం నియోజకవర్గం మీర్పేట్ బావోజు సిద్దేశ్వర చారి మంత్రి ఛాంబర్ లో కలిసి హృదయపూర్వక జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు

## మున్సిపల్ ఎన్నికలకు పకడ్బందీ ఏర్పాట్లు

### కడపలో డిస్ట్రిబ్యూషన్, స్ట్రాంగ్ రూములు, ఓట్ల లెక్కింపు కేంద్రాలను పరిశీలించిన జిల్లా కలెక్టర్, ఎస్పీ

కడప, కడప నగరపాలక సంస్థ ఎన్నికల నిర్వహణలో భాగంగా డిస్ట్రిబ్యూషన్ కేంద్రాలు, స్ట్రాంగ్ రూములు, ఓట్ల లెక్కింపు కేంద్రాల్లో పకడ్బందీ ఏర్పాట్లు చేపట్టాలని జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి డా. శ్రీధర్ చెరుకూరి అధికారులను ఆదేశించారు.ఎన్నికల ప్రక్రియను పారదర్శకంగా, ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు అన్ని ముందస్తు చర్యలు తీసుకోవాలని సూచించారు.బుధవారం జిల్లా ఎస్పీ షెల్కే నచికేత్ విశ్వనాథ్, తదితర అధికారులతో కలిసి జిల్లా కలెక్టర్ కడప ఆర్ట్స్ కళాశాలలో ఏర్పాటు చేసిన డిస్ట్రిబ్యూషన్, స్ట్రాంగ్ రూములను అలాగే మౌలానా ఆజాద్ ఉర్దూ పాలిటెక్నిక్ కళాశాలలో ఏర్పాటు చేసిన ఓట్ల లెక్కింపు కేంద్రాలను క్షేత్రస్థాయిలో పరిశీలించారు.ఈ సందర్భంగా స్ట్రాంగ్ రూముల వద్ద భద్రతా ఏర్పాట్లు, సీసీ కెమెరాల పర్యవేక్షణ, విద్యుత్ సౌకర్యం, ఓట్ల లెక్కింపు కేంద్రాల్లో మౌలిక వసతులు, అధికారుల రాకపోకలు, రాజకీయ పార్టీల ప్రతినిధులు, అభ్యర్థులు, ఏజెంట్లకు అవసరమైన సౌకర్యాలపై సంబంధిత అధికారులకు పలు సూచనలు చేశారు. ఓట్ల లెక్కింపు సమయంలో ఎలాంటి అసౌకర్యాలు తలెత్తకుండా ముందస్తు ఏర్పాట్లు పూర్తి చేయాలని ఆదేశించారు.ఎన్నికల నిర్వహణలో ఓట్ల లెక్కింపు అత్యంత కీలకమైన దశ అని, ఈ ప్రక్రియలో ప్రతి అంశాన్ని ఎన్నికల సంఘం మార్గదర్శకాలకు అనుగుణంగా,పూర్తి అప్రమత్తతతో నిర్వహించాలని జిల్లా కలెక్టర్ స్పష్టం చేశారు. భద్రతా చర్యల్లో ఎలాంటి లోపాలు లేకుండా చూడాలని, ఎన్నికల సామగ్రి భద్రతకు అత్యంత ప్రాధాన్యం ఇవ్వాలని అధికారులకు సూచించారు.ఈ కార్యక్రమంలో కడప ఆర్డీవో మురళి,కడప నగరపాలక సంస్థ కమిషనర్ డా. పి. భవానీ ప్రసాద్, డీఎస్పీ టి. భవానీ సంబంధిత ఎన్నికల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## పోస్టల్ బ్యాలెట్‌పై కలెక్టర్ పరిశీలన

నంద్యాల, అక్టోబరు 28: మున్సిపల్ ఎన్నికల విధుల్లో పాల్గొనే ఉద్యోగులు పోస్టల్ బ్యాలెట్ ద్వారా తమ ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి గణియా సూచించారు. బుధవారం నంద్యాల మున్సిపల్ కార్యాలయంలో కొనసాగుతున్న పోస్టల్ బ్యాలెట్ ప్రక్రియను ఆమె పరిశీలించారు.పోస్టల్ బ్యాలెట్ కోసం ఫారం 10ఏతో పాటు డ్యూటీ ఆర్డర్, గుర్తింపు కార్డు సమర్పించాలని తెలిపారు. బ్యాలెట్ పత్రం, ధ్రువీకరణ పత్రాలను నిబంధనల ప్రకారం సంబంధిత కవర్లలో ఉంచి సమర్పించాలని సూచించారు. మున్సిపల్ ఎన్నికల పోలింగ్ ఉదయం 7 నుంచి సాయంత్రం 5 గంటల వరకు జరుగుతుందని, ప్రతి ఒక్కరూ ఓటు హక్కును వినియోగించుకోవాలని కలెక్టర్ కోరారు.కలెక్టర్ వెంట మున్సిపల్ కమిషనర్ బి శేషన్న. ఎన్నికల అధికారి సంజయ్ కుమార్. ఎమ్ ఈ నాగభూషణం రెడ్డి. డీఈలు పవన్ కుమార్. రసూల్. రెవెన్యూ ఇన్‌స్పెక్టర్లు విక్రమ్. శభరిష్. తదితరులు ఉన్నారు.

# రైల్వే జీఎం కార్యాలయం ఎదుట కాంగ్రెస్ మెరుపు ధర్నా

**ఢిల్లీ నిరసనకు ప్రత్యేక రైళ్లు కేటాయించకపోవడంపై ఆగ్రహం..**

**కాంగ్రెస్ నేతల అరెస్ట్**



**(ప్రజాబలం ప్రతినిధి)** హైదరాబాద్: ఢిల్లీలో నవంబర్ 1న నిర్వహించనున్న కాంగ్రెస్ పార్టీ నిరసన కార్యక్రమానికి హాజరయ్యేందుకు హైదరాబాద్ నుంచి ప్రత్యేక రైళ్లు కేటాయించాలని కోరినా దక్షిణ మధ్య రైల్వే నుంచి సానుకూల స్పందన రాకపోవడంతో కాంగ్రెస్ నాయకులు ఆందోళనకు దిగారు. ఈ నేపథ్యంలో దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్ కార్యాలయం ఎదుట మెరుపు ధర్నా నిర్వహించారు. అనంతరం రైల్వే స్టేషన్ వద్ద ధర్నా కొనసాగించడంతో తీవ్ర ఉద్రిక్తత



నెలకొంది. ఆందోళన చేస్తున్న టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్, మంత్రి పొన్నం ప్రభాకర్ సహా పలువురు కాంగ్రెస్ నేతలను పోలీసులు అరెస్ట్ చేశారు.

నవంబర్ 1న ఢిల్లీలో నిర్వహించనున్న నిరసన కార్యక్రమానికి తెలంగాణ నుంచి పెద్ద సంఖ్యలో పార్టీ నాయకులు, కార్యకర్తలు తరలివెళ్లేందుకు వీలుగా హైదరాబాద్ నుంచి ఢిల్లీకి ప్రత్యేక రైళ్లు ఏర్పాటు చేయాలని కాంగ్రెస్ నాయకులు రైల్వే శాఖను కోరారు. అయితే ప్రత్యేక రైళ్ల కేటాయింపు విషయంలో అనుకూల స్పందన రాకపోవడంతో రైల్వే జీఎం కార్యాలయం ఎదుట నిరసన తెలిపారు. ఈ ధర్నాలో టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్, మంత్రి పొన్నం ప్రభాకర్, రాజ్యసభ సభ్యులు వేం నరేందర్ రెడ్డి, అనిల్ కుమార్ యాదవ్, ఎమ్మెల్యేలు నవీన్ యాదవ్, గణేశ్, ఎంపీ రఘురామ్ రెడ్డి, డీసీసీ అధ్యక్షులు మోత రోహిత్, దీపక్ జాన్‌తో పాటు పలువురు కాంగ్రెస్ నాయకులు, కార్పొరేషన్ చైర్మన్లు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ నాయకులు కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఢిల్లీలో జరిగే పార్టీ నిరసన కార్యక్రమానికి రైళ్లు కేటాయించకుండా ప్రధాని నరేంద్ర మోదీ, కేంద్ర హోంమంత్రి అమిత్ షా అడ్డుకుంటున్నారని కాంగ్రెస్ నేతలు ఆరోపించారు.

రైల్వే స్టేషన్ వద్ద కూడా కాంగ్రెస్ నాయకులు మెరుపు ధర్నా కొనసాగించడంతో అక్కడ ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. ఈ క్రమంలో టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్, మంత్రి పొన్నం ప్రభాకర్, రాజ్యసభ సభ్యులు వేం నరేందర్ రెడ్డి, అనిల్ కుమార్ యాదవ్, ఎమ్మెల్యేలు నవీన్ యాదవ్, గణేశ్‌తో పాటు పలువురు కాంగ్రెస్ ముఖ్య నాయకులను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు.

# జిల్లా పోలీస్ శాఖ ఆధ్వర్యంలో 2 కే రన్

**పోలీసు అమరులు చేసిన త్యాగాలను ప్రతి ఒక్కరు స్మరించుకోవాలి.**

**2ఖ రన్‌లో పాల్గొన్న జిల్లా ఎస్పీ మహేష్ బి. గితే.**

**రాజన్న సిరిసిల్ల జిల్లా, అక్టోబర్ 28,(ప్రజాబలం ప్రతినిధి)**పోలీసు అమరవీరుల సంస్మరణ వారోత్సవాల సందర్భంగా జిల్లా పోలీస్ శాఖ ఆధ్వర్యంలో బుధవారం రోజున జిల్లా కేంద్రంలో అంబేద్కర్ నుండి బతుకమ్మ ఘాట్ వరకు 2కె రన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ...ప్రజల క్షేమం, రక్షణ కోసం విధులు నిర్వహిస్తూ ప్రాణత్యాగం చేసిన పోలీసు అమరవీరుల సేవలు, త్యాగాలను ప్రతి ఒక్కరూ స్మరించుకోవాలన్నారు. అమరవీరుల ఆశయ సాధన కోసం సమాజంలోని ప్రతి ఒక్కరూ బాధ్యతాయుతంగా మెలగాలని సూచించారు. ప్రజా రక్షణలో, శాంతి భద్రతల పరిరక్షణలో నిబద్ధతతో విధి నిర్వహణ చేస్తూ






ప్రాణాలను సైతం లెక్క చేయకుండా ముందుకు సాగుతున్న పోలీసుల కృషి అభినందనీయమని చెప్పారు. పోలీసు అమరవీరుల సంస్మరణ వారోత్సవాల ముఖ్య ఉద్దేశం అమరవీరుల త్యాగాలను ప్రజలకు తెలియజేయడంతో పాటు, పోలీసుల సేవలు, విధి నిర్వహణలో వారు ఎదుర్కొనే సవాళ్లపై ప్రజల్లో అవగాహన కల్పించడమేనన్నారు. ప్రజలు పోలీసులకు సహకరిస్తూ చట్టాలను గౌరవించాలని, సమాజంలో శాంతిభద్రతల పరిరక్షణకు ప్రతి ఒక్కరూ తమ వంతు బాధ్యతను నిర్వర్తించాలని సూచించారు. ఈ 2కె రన్ లో డిఎస్పీ లు నాగేంద్రచారి, శ్రీనివాసులు, వెంకటేశ్వర్లు,సిఐ లు శ్రీనివాస్, నాగేశ్వరరావు, వెంకటేష్,ఆర్.ఐ మధుకర్, ఎస్.ఐ లు , విద్యార్థులు, పోలీస్ సిబ్బంది, వాకర్స్ పాల్గొన్నారు.

**మండల కేంద్రంలో ఇంటింటా వింధ్యవాసిని**

**ఆప్యాయంగా పలకరిస్తున్న తుగ్గలి వైసీపీ ఎంపీటీసీ అభ్యర్థి**

తుగ్గలి: తుగ్గలి మండల కేంద్రం వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఎంపీటీసీ అభ్యర్థి మాదిరెడ్డి వింధ్యవాసిని ఎన్నికల ప్రచారంలో దూసుకుపోతున్నారు. బుధవారం రోజున గ్రామంలోని ప్రతి వీధిలో పర్యటిస్తూ ఇంటింటికీ వెళ్లి ఓటర్లను కలుస్తున్నారు. చిన్నా పెద్దా తేడా లేకుండా అందరినీ ఆప్యాయంగా పలకరిస్తూ,వారి సమస్యలు అడిగి తెలుసుకుంటున్నారు. వృద్ధుల ఆశీస్సులు తీసుకుంటూ ఫ్యాన్ గుర్తుకు ఓటు వేయాలని కోరుతున్నారు. కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలను నెరవేర్చలేక ప్రజలను మభ్యపెడుతుందని ఆమె తెలియజేశారు. జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వంలో ప్రతి ఇంటికి సంక్షేమ పథకాలు అందాయని ఆమె తెలియజేశారు. కూటమి ప్రభుత్వంలో నిత్యవసర సరుకుల ధరలు ఆకాశాన్ని అంటాయని,పేద ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆమె ఓటర్లకు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్సీపీ నాయకులు శ్రీనివాస రెడ్డి, చంద్రశేఖర్ రెడ్డి మోహన్ రెడ్డి,వైఎస్ఆర్సిపి నాయకులు,కార్యకర్తలు,అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

# ఐ ఎఫ్ డబ్ల్యు జె 76వ వ్యవస్థాపక దినోత్సవ వేడుకలు

**అధ్యక్ష, కార్యదర్శులు నానబాల రామకృష్ణ, అర్వపల్లి నగేష్**

**జర్నలిస్టుల హక్కుల పరిరక్షణకు**

**ఐఎఫ్‌డబ్ల్యూజే నిరంతర పోరాటం**

**ఖమ్మం అన్నం సేవా ఫౌండేషన్ లో అనాధలకు పండ్ల పంపిణీ.**



**ఖమ్మం జిల్లా బ్యూరో ప్రజాబలం అక్టోబర్ 28:**రాష్ట్ర అధ్యక్షులు మామిడి సోమయ్య పిలుపు మేరకు జర్నలిస్టుల హక్కుల పరిరక్షణ, సంక్షేమం కోసం ఇండియన్ ఫెడరేషన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్స్ (ఐఎఫ్‌డబ్ల్యూజే) నిరంతరం పోరాటం చేస్తోందని, తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్ (టీడబ్ల్యూజేఎఫ్) ఖమ్మం జిల్లా అధ్యక్షుడు నానబాల రామకృష్ణ, ప్రధాన కార్యదర్శి అర్వపల్లి నగేష్ పేర్కొన్నారు. ఐఎఫ్‌డబ్ల్యూజే 76వ వ్యవస్థాపక దినోత్సవాన్ని పురస్కరించుకుని, బుధవారం టీడబ్ల్యూజేఎఫ్ ఖమ్మం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో ఖమ్మంలోని అన్నం సేవా ఫౌండేషన్‌లో ఫౌండేషన్ చైర్మన్ రెడ్ క్రాస్ కమిటీ సభ్యులు అన్నం శ్రీనివాసరావు ను శాలవతో సత్కరించి వేడుకలను ఘనంగా నిర్వహించారు.

ఈ సందర్భంగా కేక్ కట్ చేసి, అనాధలకు, పేదలకు, పండ్లు పంపిణీ చేశారు. అలాగే మొక్కలు నాటి పర్యావరణ పరిరక్షణకు తమ వంతు కృషి చేశారు. ఈ సందర్భంగా అధ్యక్షుడు నానబాల రామకృష్ణ మాట్లాడుతూ, 1950 అక్టోబర్ 28న ఢిల్లీలో స్థాపించబడిన ఐఎఫ్‌డబ్ల్యూజే తొలి అధ్యక్షుడి గా ఏం.చలపతి రావు 5 సంవత్సరాలు కొనసాగారు. ఉపేందర్ వాజ్ పేయి స్వాతంత్ర్య సమరయోధుడు, సీనియర్ జర్నలిస్ట్ ఆ కాలం లో వివిధ ప్రాంతీయ వర్కింగ్ జర్నలిస్ట్ యూనియన్ లను కలుపుకొని ఈ కార్మిక సంఘాన్ని స్థాపించారు. ఇది భారత దేశంలో మీడియా రంగం లో పని చేస్తున్న ఉద్యోగుల హక్కుల పరిరక్షణ కోసం ఏర్పడిన మొట్ట మొదటి అతి పెద్ద జాతీయ స్థాయి ట్రేడ్ యూనియన్ అంటూ, దేశవ్యాప్తంగా జర్నలిస్టుల హక్కుల సాధన కోసం విశేషంగా కృషి చేస్తోందన్నారు. జర్నలిస్టులు వృత్తిపరంగా ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి, వారి హక్కుల పరిరక్షణకు సంఘటితంగా పోరాడాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. జర్నలిస్టుల సంక్షేమంతో పాటు, జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు, హెల్త్ కార్డులు, పెన్షన్లు, అక్రెడిటేషన్ కార్డు లు, రైల్వే పాసుల కొరకు ఫెడరేషన్ గల్లి నుండి ఢిల్లీ వరకు పోరాటాలు చేస్తుందని పేర్కొన్నారు.

కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి అర్వపల్లి నగేష్ మాట్లాడుతూ,

ప్రజలకు, ప్రభుత్వానికి మధ్య వారధిగా పనిచేస్తున్న జర్నలిస్టుల సేవలు సమాజానికి ఎంతో అవసరమన్నారు. జర్నలిస్టుల సమస్యల పరిష్కారం, వృత్తి స్వేచ్ఛ పరిరక్షణ కోసం ఐక్యంగా ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. వ్యవస్థాపక దినోత్సవాన్ని సామాజిక సేవా కార్యక్రమాలతో నిర్వహించడం సంతోషకరమని, భవిష్యత్తులోనూ ఇలాంటి సేవా కార్యక్రమాలను కొనసాగిస్తామని తెలిపారు. జర్నలిస్టుల హక్కుల పరిరక్షణతో పాటు పేదలకు సేవ చేయడం, పర్యావరణాన్ని కాపాడడం వంటి కార్యక్రమాల ద్వారా సమాజానికి తమ వంతు సహకారం అందించడమే ఈ వేడుకల ముఖ్య ఉద్దేశమని నిర్వాహకులు పేర్కొన్నారు.

ఈ కార్యక్రమంలో టీడబ్ల్యూజేఎఫ్ హెచ్-2843 జిల్లా ఉపాధ్యక్షులు లింగాల రామ్మూర్తి గౌడ్, కందనబోయిన నాగ కృష్ణ,కోశాధికారి వేములకొండ రమేష్, మామిడాల వీరబాబు, ఇసి మెంబర్ ఎలిశెట్టి రామకృష్ణ బాబు, నేషనల్ కౌన్సిల్ మెంబర్ ఎలుగోటి వెంకట్, కప్పల మధు, స్టేట్ కౌన్సిల్ మెంబర్ నల్లా రాకేష్, గుజ్జు గోపాల కృష్ణ, బంక మధు, టీబిజెఏ జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీధర్ కాసోజు, వీడియో గ్రాఫర్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు అమరబోయిన ఉపేందర్, ప్రెస్ క్లబ్ అధ్యక్షులు అంతోటి శ్రీనివాస్ మరియు చిన్నంశెట్టి రాంబాబు, షేక్ మీరా, ఆముదాల వెంకన్న, తదితరులు పాల్గొన్నారు.

# పండితాపురంలో ఘనంగా పొంగులేటి జన్మదిన వేడుకలు

**కేక్ కట్ చేసిన మల్లిబాబు యాదవ్,**

**ధనియాకుల హనుమంతరావు**

**ఖమ్మం జిల్లా బ్యూరో ప్రజాపాలం అక్టోబర్ 28:**కామేపల్లి మండలం పండితాపురం గ్రామంలో పశువుల సంత లో పొంగులేటి ప్రధాన అనుచరుడు డిసిసిబి డైరెక్టర్ మేకల మల్లిబాబు యాదవ్ ఆధ్వర్యంలో పొంగులేటి జన్మదినం సందర్భంగా జరిగిన కార్యక్రమంలో పి ఎస్ ఎస్ అధ్యక్షులు ధనియాకుల హనుమంతరావు, సర్పంచ్ ధరావత్ అనురాధ, ఉప సర్పంచ్ మేకల మల్లికార్జునరావు, తదితరులు పాల్గొని భారీ కేక్ కట్ చేసి స్వీట్లు పంచుకొని ఆనందోత్సాహాలు జరుపుకున్నారు.



ఈ సందర్భంగా మల్లి బాబు యాదవ్ మాట్లాడుతూ మాట ఇస్తే తప్పకుండా ఆరు నూరైనా పిలిస్తే ఎక్కడ ఉన్నా నేనున్నానంటూ వచ్చే మంచి మనసున్న పొంగులేటి శీనన్నకు జన్మదిన శుభాకాంక్షలు తెలుపుకుంటున్నట్లు తెలిపారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వంలో కీలకంగా ఉంటూ పేద ప్రజల సంక్షేమం కోసం ఇందిరమ్మ ఇండ్లు, రైతుల కోసం భూభారతి లాంటి ఎన్నో వినూత్న పథకాలు తీసుకొచ్చి అమలు చేస్తున్న ఘనత వారికే దక్కిందని, పదిమంది బాగుకోసం తపనపడే మంచి హృదయం గల వ్యక్తి నిండు నూరేళ్లు చల్లగా జీవించాలని, ఆ భగవంతుని కోరుకుంటున్నట్లు మల్లి బాబు యాదవ్ తెలిపారు. కార్యక్రమంలో పాల్గొన్న పొంగులేటి అభిమానులు కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు అభిమానులు పొంగులేటికి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ధనియాకుల మాధవరావు, కొమ్మినేని శ్రీనివాసరావు, ఉప్పు గండ్ల వీరభద్రం, శీలం పుల్లయ్య, గుగులోతు రవి, చల్ల మల్లయ్య, బండి ఉపేందర్ మొగిలి శ్రీను, జక్కంపూడి వెంకటేశ్వర్లు,బాదావత్ నాగరాజు పల్లపు ప్రతాప్,పాటిబండ్ల ప్రసాద్,అయితన బోయిన విఠల్ రావు, బానోత్ లక్ష్మ, దేరంగుల తిరపయ్య, తురక బిక్షం దేరంగుల రామారావు, ఎస్ కే సొందు, పగిడిపల్లి రాములు, మరియు తదితరులు భారీ ఎత్తున పాల్గొన్నారు.

# ఏసీబీ వలలో లీగల్ మెట్రాలజీ అధికారి

యాదాద్రి భువనగిరి జిల్లాలో ఏసీబీ ట్రాప్ కేసు నమోదయింది. బుధవారం నాడు ఏసీబీ అధికారులు కలెక్టరేట్ లో మెరుపు దాడి చేసారు. రూ.20 వేల లంచం తీసుకుంటూ లీగల్ మెట్రాలజీ ఇన్స్పెక్టర్ వెంకటేశ్వర్లు దొరికిపోయాడు. పెట్రోల్ బంకు అనుమతుల వ్యవహారంలో లంచం డిమాండ్ చేసినట్లు సమాచారం. బాధితుడు చింతల యాదగిరి నుంచి లంచం తీసుకుంటుండగా పట్టుకున్నారు. మొదటి విడతగా రూ.20 వేలు తీసుకుంటుండగా ఏసీబీకి దొరికిపోయాడు.

## 500 లీటర్ల గుడుంబా పానకం విచ్ఛిన్నం చేసిన పోలీసులు



**ములుగు జిల్లా ప్రజాబలం ప్రతినిధి అక్టోబర్ 28 తాడ్వాయి** ములుగు జిల్లా తాడ్వాయి మండల కేంద్రంలోని రంగాపూర్ ఇమ్మడిగూడెం లో గుడుంబా తయారు చేస్తున్నారన్న సమాచారం మేరకు ఆ ప్రాంతానికి వెళ్లిన పోలీసులు 500 లీటర్ల బెల్లం పానకాన్ని 15 లీటర్ల గుడుంబా ఐదు కేజీల పటికని స్వాధీనం చేసుకున్న పోలీసులు ఇద్దరిపై కేసు నమోదు చేస్తున్నట్లు తెలిపారు ఇలాంటి కార్యక్రమాలకు పాల్పడితే ఎంత వారైనా శిక్ష తప్పదని అన్నారు

## ఒక పోలింగ్ స్టేషన్ పరిధిలో కుటుంబ సభ్యుల ఓట్లు ఉండాలి.




**గండిపేట మండలం ప్రజాబలం ప్రతినిధి 28 అక్టోబర్ 2026.** భారత దేశ చరిత్రలో 2002 తదనంతరం స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ ద్వారా ఓటర్ల జాబితాలో కీలక మార్పులు తేవడంలో అధికారులు సంపూర్ణ సఫలీకృతం కావటం హర్షంచతగ్గ విషయం. కాని ఇంతటి ఘన కార్యాన్ని సాధించిన అధికారులు ఒక ముఖ్య విషయంలో తేడా గమనించక పోవడం చింతా జనకం, ఒకే ఇంట్లో నివసించే కుటుంబ సభ్యుల ఓట్లు వేర్వేరు పోలింగ్ కేంద్రాలకు కేటాయించడం జరిగిన దరిమిలా ఇట్టి అపరిస్కృత సమస్యను పరిష్కరించేందుకు సాంకేతిక పరిజ్ఞానం ద్వారా గుర్తించి ఏక మొత్తంగా కుటుంబ సభ్యుల ఓట్లు ఒకే పోలింగ్ స్టేషన్ పరిధిలో ఉండేలా, ఓటర్ల చిరునామాల్లో ఉన్న అస్పష్టతలు, తప్పులు, నకిలీ నమోదులను తొలగించి, జాబితాను పారదర్శకంగా, చిరునామా ఆధారిత ఓటర్ల జాబితాను రూపొందించాలని ది సిటిజన్స్ కౌన్సిల్ ప్రధాన కార్యదర్శి షేక్ ఆరిఫ్ మహమ్మద్ దేశ రాజధాని ఢిల్లీలో ఉన్న భారత ఎన్నికల సంఘాన్ని సందర్శించి సంబందిత అధికారులకు వినతి పత్రం అందజేశారు. అవసరం అయితే ఓటర్ల జాబితాలో నెలకొన్న సమస్యల పరిష్కర ప్రక్రియలో రెసిడెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్లు అయిన పౌర సంఘాల సహాయ సహకారాలు తీసుకొని వారిని భాగస్వాములుగా చేస్తూ బూత్ లెవల్ అధికారులుతో సమన్వయం చేసుకుంటూ క్షేత్రస్థాయిలో నివాస వివరాల ధృవీకరణ చేపట్టాలని సూచించారు. అలాగే ఓటరు గుర్తింపు కార్డులను సంబంధిత ఓటర్లకు రిజిస్టర్డ్ పోస్టు ద్వారా నేరుగా అందించాలని, రాజకీయ నాయకులకు అప్పగించి పంపిణీ చేసే విధానాన్ని నివారించాలని కోరారు. ఓటర్లకు ఇబ్బందులు తగ్గించి, పోలింగ్ ప్రక్రియను సులభతరం చేయడంతో పాటు ప్రజాస్వామ్య వ్యవస్థపై ప్రజలకు విశ్వాసం పెంపొందించేందుకు ఎన్నికల సంఘం ఈ అంశాలపై ప్రాధాన్యతతో స్పందించాలని షేక్ ఆరిఫ్ మహమ్మద్ కోరడం జరిగింది.

## కార్యకర్తలను కంటికి రెప్పల్లే కాపాడుకుంటాం

### బాధిత కుటుంబాల ఇంటికి వెళ్లి పరామర్శించి ఆర్థిక సహాయం

### ములుగు జిల్లా యూత్ ప్రధాన కార్యదర్శి -బాడిశ నాగ రమేష్



**ములుగు జిల్లా ప్రజాబలం ప్రతినిధి అక్టోబర్ 28 మంగపేట** మంగపేట మండలం కోమటిపల్లి గ్రామంలో ఇటీవల అనారోగ్య కారణాలతో బిఆర్ఎస్ పార్టీ కి చెందిన ఆగబోయిన వెంకన్న మరియు అదే గ్రామానికి చెందిన జార సైదులు మరణించడం జరిగింది స్థానిక బిఆర్ఎస్ పార్టీ నాయకులు మరియు బిఆర్ఎస్ పార్టీ ములుగు జిల్లా యూత్ ప్రధాన కార్యదర్శి బాడిశ నాగ రమేష్ వారి నివాసానికి వెళ్లి,మృతుల చిత్రపటాలకు నివాళులు అర్పించి వారి కుటుంబ సభ్యులను పరామర్శించి ,స్థానిక బిఆర్ఎస్ పార్టీ నాయకులు సమకూర్చిన డబ్బు ను ఒక్కో కుటుంబానికి 4,000 రూపాయల చొప్పున ములుగు జిల్లా యూత్ ప్రధాన కార్యదర్శి బాడిశ నాగ రమేష్ చేతుల మీదగా అందజేయడం జరిగింది .అదేవిధం గా పక్కనే వున్న కొత్తూరు మోట్లగూడెం గ్రామానికి చెందిన బిఆర్ఎస్ పార్టీ కార్యకర్త మంకిడి చంద్రయ్య ఇటీవల చేను కాపలా కాస్తూ మంచె మీద నుండి పడి చేతికి,నడుము కు తీవ్రం గా గాయాలవ్వగా,వారిని కలిసి వైద్య ఖర్చుల నిమిత్తం 4000/- రూపాయల ఆర్థిక సహాయాన్ని అందజేయడం జరిగింది.

బాడిశ నాగ రమేష్ మాట్లాడుతూ బిఆర్ఎస్ పార్టీ ఎప్పటికీ అండ గా ఉంటుందని,ఎవరూ అధైర్య పడవద్దని ఈ సందర్భంగా తెలియ చేశారు .

ఈ కార్యక్రమం లో జిల్లా మహిళా నాయకులు కొమరం ధనలక్ష్మి, సీనియర్ మార్పుల వెంకటరెడ్డి,కోమటిపల్లి బిఆర్ఎస్ పార్టీ గ్రామ కమిటీ అధ్యక్షులు గొల్లపల్లి శ్రీను, జువ్వాజి ముసలయ్య మండల నాయకులు సత్తర్ షఫీ, లోడే కృష్ణ,లోడే రమేష్, బూరుగుల ఉప్పలయ్య, గుడిశాల సమీదాసు, కొమరం నాగేష్, పోడెం నారాయణ, పగిడిపాలసంధిబ్, వివిధ గ్రామాల అధ్యక్షులు మునిగేలా సాంబుల్, కొమరం పుల్లారావు, రూప భద్రయ్య, నాయకులు మండల సంతోష్, మునిగేలా మహేష్, ఇందారపు రమేష్ సోషల్ మీడియా వారియర్ మునిగేల నరేష్ పాల్గొన్నారు

## ఫోక్ డాన్స్ పోటీలు లో రాష్ట్రస్థాయికి ఎంపికైన రామన్నగూడెం విద్యార్థులు




**ములుగు జిల్లా ప్రజాబలం ప్రతినిధి అక్టోబర్ 28 ఏటూరు నాగారం** పీపుల్స్ ఎడ్యుకేషన్ కౌన్సిల్ ములుగు జిల్లా స్థాయి ఫోక్ డాన్స్ కంపిటిషన్స్ బుధవారం న గౌట్ హై స్కూల్ గోవిందరావు పేట లో జరిగాయి, ఇందులో జడ్పీహెచ్ఎస్ రామన్నగూడెం విద్యార్థులు హర్ష వర్ధన్, గద్దల ఉమామహేశ్వర్, రిషి, జనగాం దినేష్, వరుణ్, భార్గవ్, అనిల్, కార్తీక్ ల బృందం పాల్గొని ఉత్తమప్రదర్శన తో జిల్లా స్థాయిలో ప్రథమ బహుమతి గెల్చుకున్నారు, వీరు రాష్ట్ర స్థాయికి ఎంపిక అయినట్లు జిల్లా విద్యా శాఖ వారు ప్రకటించారు, కార్యక్రమ నిర్వాహకులు సోమారెడ్డి ,ఎస్ శ్రీనివాస్ రెడ్డి, అప్పని జయదేవ్ బహుమతులు అందచేశారు. ఈ విజయం పట్ల జిల్లా పరిషత్ పాఠశాల రామన్నగూడెం హెడ్ మాస్టర్ ఓ ఎం ఈ ఓ కొయ్యడ మల్లయ్య విద్యార్థులను అభినందించారు, శిక్షణ ఇచ్చిన డాన్స్ మాస్టర్ కోడి వెంకట్ సహకరించిన ఉపాధ్యాయ బృందానికి శుభాకాంక్షలు తెలియచేసారు.

## బదిలీపై వెళ్తున్న డిప్యూటీ తాసిల్దార్ మహేందర్ కు ఘన సన్మానం చేసిన బి ఆర్ ఎస్ అధ్యక్షులు గంప రాంబాబు



వెంకటాపురం రెవెన్యూ ఆఫీస్ లో విధులు నిర్వహించి, బదిలీపై ములుగు ఆర్డీవో ఆఫీస్ కు వెళ్తున్న సందర్భంగా డి టి మహేందర్ గారికి బుధవారం ఆఫీస్ లో ఘనంగా సన్మాన కార్యక్రమం నిర్వహించారు. సన్మాన కార్యక్రమాన్ని బి ఆర్ ఎస్ మండల నాయకుల ఆధ్వర్యంలో నిర్వహించారు. మహేందర్ గారిని శాలువాతో సత్కరించి, ఆత్మీయంగా వీడ్కోలు పలికారు.

ఈ సందర్భంగా గంప రాంబాబు మాట్లాడుతూ...

వెంకటాపురం రెవిన్యూ ఆఫీస్ లో ఉన్న సమయంలో మహేందర్ గారు ఎంతో నిజాయితీగా, ప్రజలకు అందుబాటులో ఉంటూ సేవలు అందించారు. రైతులు, పేద ప్రజల సమస్యలను వెంటనే పరిష్కరించడంలో ఆయన చొరవ చూపారు. ఇలాంటి అధికారులు ప్రజా సేవలో ఉండడం గర్వకారణం. కొత్త ప్రాంతంలో కూడా ఇదే స్ఫూర్తితో ముందుకు సాగి, మరిన్ని ఉన్నత శిఖరాలు అధిరోహించాలని కోరుకుంటున్నాం” అని అన్నారు.

ఈ కార్యక్రమంలో బి ఆర్ ఎస్ పార్టీ నాయకులు, ఎమ్మార్వో ఆఫీస్ సిబ్బంది బి ఆర్ ఎస్ సీనియర్ నాయకులు గెడ్డం వివేక్. మంచర్ల నాగేశ్వరావు. బట్ట నాగేందర్. కుశం దుర్గాప్రసాద్. ఎక్కిబోయిన సాయికిరణ్. నెల్లూరు వెంకన్నబాబు. తదితరులు పాల్గొన్నారు.

## రెండు గోల్డ్ మెడల్స్ సాధించిన క్రీడాకారుడు



**ములుగు జిల్లా ప్రజాబలం ప్రతినిధి అక్టోబర్ 28 ములుగు** పీఎం శ్రీ పాఠశాలల ఆధ్వర్యంలో గురుకుల పాఠశాల జాకారంలో నిర్వహించిన జిల్లా స్థాయి క్రీడా పోటీల్లో ఏటూర్ నాగారం క్రీడా మైదానంలో శిక్షణ పొందుతున్న క్రీడాకారుడు అద్భుత ప్రతిభ కనబరిచాడు.

ఠాగూర్ షాట్ పుట్ , డిస్కస్ త్రో విభాగాల్లో గోల్డ్ మెడల్స్ సాధించి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యాడు.

ఈ సందర్భంగా కోచ్‌లు పర్వతాల కుమారస్వామి, కె. భావన క్రీడాకారుడిని అభినందించారు.

## సామాజిక ఒత్తిళ్లను ధైర్యంగా ఎదుర్కొని వ్యసనాలకు ‘నో’ చెప్పాలి.

### చదువుతో పాటు క్రీడలు, పౌష్టికాహారంతో ఆరోగ్యాన్ని పెంపొందించుకోవాలి.

### పాఠశాల దశ నుంచే మంచి అలవాట్లతో ఆరోగ్యకరమైన జీవితానికి పునాది వేసుకోవాలి.

### జిల్లా కలెక్టర్ బోర్ఖడే హేమంత్ సహదేవరావు.




**ములుగు జిల్లా ప్రజాబలం ప్రతినిధి అక్టోబర్ 28 కలెక్టరేట్** బుధవారం జిల్లా సమీకృత కలెక్టరేట్ కార్యాలయ సమావేశ మందిరంలో ఈ అవగాహన కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ బోర్ఖడే హేమంత్ సహదేవరావు ముఖ్యఅతిథిగా హాజరై విద్యార్థులతో కలసి సందేశాన్ని వీక్షించారు. అనంతరం కలెక్టర్ నషా ముక్త్ భారత్ పోస్టర్‌ను ఆవిష్కరించారు. అనంతరం జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, పాఠశాల దశ నుంచే మంచి అలవాట్లను పెంపొందించుకుని ఆరోగ్యకరమైన భవిష్యత్తుకు పునాది వేసుకోవాలని విద్యార్థులకు సూచించారు. పాఠశాల, కళాశాల దశల్లో స్నేహితుల ప్రభావంతో సరదాగా ఒక్కసారి ప్రయత్నిద్దామనే ఆలోచనతో మత్తుపదార్థాలు, ఇతర హానికరమైన వ్యసనాల వైపు వెళ్లవద్దని హితవు పలికారు. ప్రారంభ దశలోనే వాటికి దూరంగా ఉండటం భవిష్యత్తులోనూ వ్యసనరహిత జీవితాన్ని కొనసాగించేందుకు దోహదపడుతుందని తెలిపారు.

‘ఒక్కసారి ప్రయత్నిస్తే ఏమీ కాదు.. మేమూ చేస్తున్నాం.. మాకు ఎలాంటి ఇబ్బంది లేదు’ అంటూ స్నేహితులు ఒప్పించే ప్రయత్నం చేసినా ప్రభావితం కావద్దని సూచించారు. తోటి వారిలో కొందరు అలాంటి అలవాట్లకు లోనైనా, వారితో కలవాలనే ఒత్తిడితో వాటిని అనుసరించవద్దని పేర్కొన్నారు. స్నేహం పేరుతో బలవంతం చేసినా తమ నిర్ణయంపై దృఢంగా నిలబడాలని, స్పష్టంగా తిరస్కరిస్తే క్రమంగా ఇతరులు కూడా ఒత్తిడి చేయడం మానుకుంటారని వివరించారు.

చెడు వ్యసనాలకు ‘నో’ చెబుతూ, క్రీడలతో సన్మార్గంలో పయనించాలని కలెక్టర్ పిలుపునిచ్చారు. విద్యార్థులు చదువుకు ప్రాధాన్యం ఇవ్వడంతో పాటు ప్రతిరోజూ క్రీడలు, శారీరక శ్రమకు సమయం కేటాయించాలని సూచించారు. క్రికెట్, ఖోఖో, కబడ్డీ, వాలీబాల్, బ్యాడ్మింటన్ వంటి తమకు ఇష్టమైన క్రీడల్లో పాల్గొనాలని, నడక, పరుగు వంటి వ్యాయామాలను అలవాటు చేసుకోవాలని తెలిపారు.

క్రమం తప్పని శారీరక శ్రమ వల్ల శరీరం చురుగ్గా ఉండటంతో పాటు మానసిక ఉల్లాసం పెరుగుతుందని, చదువుపై ఏకాగ్రతకు దోహదపడుతుందని పేర్కొన్నారు. మార్కులు, భవిష్యత్తు గురించి అనవసర ఆందోళనకు గురికాకుండా ప్రతిరోజూ చేయాల్సిన పనులు, చదువుపై దృష్టి సారించాలని సూచించారు.

పౌష్టికాహారం, నిత్య వ్యాయామం, తగిన నిద్రను దైనందిన జీవితంలో భాగం చేసుకోవాలని కలెక్టర్ తెలిపారు. ఈ అలవాట్లను పాఠశాల, కళాశాల దశలకే పరిమితం చేయకుండా ఉన్నత విద్య, ఉద్యోగ జీవితంలోనూ నిరంతరం కొనసాగించాలని సూచించారు. శారీరక చురుకుదనం ఆరోగ్యాన్ని కాపాడుకోవడంలో కీలక పాత్ర పోషిస్తుందని పేర్కొన్నారు.

విద్యార్థులు చెప్పిన విషయాలను శ్రద్ధగా విని, ఆలోచించి, ఆచరణలో పెట్టేందుకు ప్రయత్నిస్తారని, అందుకే వారితో సంభాషించడం తనకు ఇష్టమని కలెక్టర్ తెలిపారు. కార్యక్రమంలో తెలియజేసిన అంశాలపై ఆలోచించి, వాటి ప్రయోజనాలను గుర్తించి, మంచి అలవాట్లను జీవితంలో భాగం చేసుకోవాలని విద్యార్థులకు సూచించారు.

ఈ కార్యక్రమంలో రెడ్ క్రాస్ సొసైటీ జిల్లా చైర్మన్ డాక్టర్ అల్లం అప్పయ్య, వైస్ చైర్మన్ గంగిశెట్టి శ్రీనివాస్, సెక్రటరీ రాజి రెడ్డి, కోశాధికారి శిరుప సతీష్ కుమార్, రెడ్ క్రాస్ సొసైటీ సభ్యులు, విద్యార్థిని విద్యార్థులు, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## 31న పీపుల్స్ ప్లాజాలో సైనథాన్

హైదరాబాద్ సైనథాన్ అనేది కేవలం పరుగు మాత్రమే కాదని, వినికిడి లోపం ఉన్న వారి సమస్యలు, హక్కుల కోసం సమాజానికి వినిపించే గొప్ప ప్రయత్నమని, ‘సైగ చేద్దాం.. మద్దతు ఇద్దాం ..శక్తినిద్దాం’అనే నినాదంతో సాగుతుందని క్వాల్ కమ్ సీనియర్ డైరెక్టర్ నితినశర్మ, స్టేట్ స్ట్రీట్ ఏవీపీ నీతూ చద్దా అన్నారు. శ్రీనగర్ కాలనీలో ఆశ్రయ్ ఆకృతి స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో ఈనెల 31న పీపుల్స్ ప్లాజాలో నిర్వహిస్తున్న అవగాహన రన్ సైనథాన్ 3.0కు సంబంధించిన జెర్సీ, గుడీ బ్యాగ్స్, పోస్టర్లు ఆశ్రయ్ ఆకృతి సంస్థ డైరెక్టర్ డీపీకే బాబుతో కలిసి ఆవిష్కరించారు.

# సత్తుపల్లిలో రాష్ట్రస్థాయి మహిళల కబడ్డీ పోటీల సందడి!

**మంత్రి పొంగులేటి జన్మదిన వేడుకల్లో భాగంగా పోటీలు**
**ప్రారంభించిన ఎమ్మెల్యే మట్టా రాగమయి దయానంద్**







**సత్తుపల్లి, ప్రజాబలం ప్రతినిధి అక్టోబర్ 28:** రాష్ట్ర మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి జన్మదినోత్సవాన్ని పురస్కరించుకుని సత్తుపల్లి పట్టణంలోని రాణీ సెలబ్రేషన్స్ ఫంక్షన్ హాల్‌లో నిర్వహిస్తున్న 73వ రాష్ట్రస్థాయి సీనియర్ మహిళల కబడ్డీ పోటీలను బుధవారం సత్తుపల్లి ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి దయానంద్ ఘనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేసి మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డికి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఆయన ఆయురారోగ్యాలతో ప్రజలకు మరిన్ని సేవలు అందించాలని ఆకాంక్షించారు.

అక్టోబర్ 28, 29, 30 తేదీల్లో మూడు రోజులపాటు జరగనున్న ఈ పోటీల ప్రారంభోత్సవ కార్యక్రమంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ.. సత్తుపల్లిలో రాష్ట్రస్థాయి మహిళల కబడ్డీ పోటీలు నిర్వహించడం ఆనందంగా ఉందన్నారు. పోటీల నిర్వహణకు చేసిన ఏర్పాట్లు, క్రీడాకారిణులకు కల్పించిన వసతి సౌకర్యాలు బాగున్నాయని ప్రశంసించారు. ఈ ప్రతిష్ఠాత్మక పోటీల ద్వారా సత్తుపల్లి ఖ్యాతి రాష్ట్రవ్యాప్తంగా మరింత విస్తరించాలని ఆకాంక్షించారు. మహిళా క్రీడాకారిణులను ప్రోత్సహించడం, వారిలోని ప్రతిభను వెలికితీయడం, క్రీడారంగంలో ఉన్నత స్థాయికి ఎదిగేందుకు అవకాశాలు కల్పించడం ఎంతో ముఖ్యమని పేర్కొన్నారు. పోటీల్లో పాల్గొంటున్న క్రీడాకారిణులందరూ క్రీడాస్ఫూర్తితో ఆడి తమ ప్రతిభను చాటుకోవాలని, విజయాలు సాధించాలని ఆకాంక్షించారు. పోటీల నిర్వహణకు కృషి చేసిన మువ్వా విజయబాబుకు అభినందనలురాష్ట్రస్థాయి మహిళల కబడ్డీ పోటీల నిర్వహణకు ప్రత్యేక చొరవ తీసుకుని కృషి చేసిన మాజీ టీజీఐడీసీ చైర్మన్ మువ్వా విజయబాబును ఎమ్మెల్యే మట్టా రాగమయి దయానంద్ ప్ర

# షాపల్లిలో కాంగ్రెస్ గ్రామ కమిటీ ఎంపిక..

# అధ్యక్ష పదవికి ఇద్దరి పోటీ

**అధిష్టానం నిర్ణయమే కీలకం!**
**అధిష్టానం నిర్ణయానికి కట్టుబడి ఉంటాం..**
**స్పష్టం చేసిన గ్రామస్తులు**
**మంత్రి సీతక్క గారు, డీసీసీ అధ్యక్షుడు పైడాకుల అశోక్ గారి**
**ఆదేశాలతో గ్రామ కమిటీ ఎంపిక ప్రక్రియ!**
**కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి నాయకుల పిలుపు!**

**ములుగు జిల్లా ప్రజాబలం ప్రతినిధి అక్టోబర్ 28 ఏటూరు నాగారం** మంత్రి సీతక్క ఆదేశాల మేరకు, జిల్లా డీసీసీ అధ్యక్షుడు పైడాకుల అశోక్ సూచనలతో ఏటూరునాగారం మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు దేవులపల్లి విజయ్‌కుమార్ ఆధ్వర్యంలో షాపల్లి గ్రామంలో కాంగ్రెస్ పార్టీ గ్రామ కమిటీ ఎంపిక కార్యక్రమం నిర్వహించారు. గ్రామస్థాయిలో పార్టీని మరింత బలోపేతం చేయడంతో పాటు, పార్టీ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లే లక్ష్యంతో కమిటీ ఎంపిక ప్రక్రియ చేపట్టారు.

ఈ సందర్భంగా షాపల్లి గ్రామ కాంగ్రెస్ అధ్యక్ష పదవికి ఇద్దరు వ్యక్తులు పోటీకి ముందుకు రావడంతో, వారి పేర్లను పార్టీ అధిష్టానానికి పంపించడం జరిగింది. అధిష్టానం పరిశీలించి తీసుకునే నిర్ణయం మేరకు గ్రామ అధ్యక్షుడి పేరును త్వరలో ప్రకటించనున్నట్లు నాయకులు తెలిపారు.



గ్రామ కమిటీ ఎంపిక సందర్భంగా గ్రామస్తులు తమ అభిప్రాయాన్ని స్పష్టం చేస్తూ, అధ్యక్ష పదవికి పోటీలో ఉన్న ఇద్దరిలో అధిష్టానం ఎవరి పేరును ప్రకటించినా తామంతా ఆ నిర్ణయానికి కట్టుబడి ఉంటామని తెలిపారు. పార్టీ ఐక్యతకు ప్రాధాన్యత ఇస్తూ, అధిష్టానం నిర్ణయాన్ని గౌరవించి ప్రకటించిన అధ్యక్షుడికి సహకరిస్తామని పేర్కొన్నారు. గ్రామంలో కాంగ్రెస్ పార్టీ మరింత బలోపేతం కావడానికి నాయకులు, కార్యకర్తలు, గ్రామస్తులంతా ఐక్యంగా పనిచేస్తామని వెల్లడించారు.

ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ములుగు జిల్లా ఆత్మ కమిటీ చైర్మన్ చిటమట రఘు, ములుగు జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యదర్శి గుడ్ల దేవేందర్ రాష్ట్ర రవాణా శాఖ డైరెక్టర్ వసంత శ్రీనివాస్ యాదవ్, జిల్లా ఎస్సీ సెల్ కొండగొర్ల పోషయ్య, కాంగ్రెస్ పార్టీ మండల సీనియర్ నాయకులు వావిలాల ఎల్లయ్య, మండల ప్రధాన కార్యదర్శి సరికొప్పుల శ్రీనివాస్, వర్కింగ్ ప్రెసిడెంట్లు చేల వినయ్, డొంగిరి మధుబాబు, మండల ఎస్సీ అధ్యక్షులు కర్నే సత్యం, రామన్న గూడెం సర్పంచ్ గద్దల నవీన్, మండల యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు గంటా కృష్ణా రెడ్డి(తాగూర్) తదితరులు హాజరయ్యారు.

ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ గ్రామస్థాయిలో పార్టీని బలోపేతం చేసేందుకు ప్రతి ఒక్కరూ సమన్వయంతో పనిచేయాలని, కాంగ్రెస్ పార్టీ ఆశయాలు, ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని పిలుపునిచ్చారు. గ్రామ ప్రజల సమస్యల పరిష్కారానికి నాయకులు, కార్యకర్తలు అందుబాటులో ఉండాలని సూచించారు.

ఈ కార్యక్రమంలో షాపల్లి గ్రామ సర్పంచ్ రాందేని రాజు, మాజీ గ్రామ కమిటీ అధ్యక్షులు కుక్కల రామయ్య, గ్రామ పెద్దలు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, మహిళలు, యువత తదితరులు పాల్గొన్నారు.

# పోలీసులపై కత్తితో దాడి.. నిందితుడికి పదేళ్ల కఠిన కారాగార శిక్ష!

## సత్తుపల్లి కోర్టు కీలక తీర్పు.. రూ.20 వేల జరిమానా విధింపు

**ఖమ్మం, ప్రజాబలం ప్రతినిధి, అక్టోబర్ 28:** విధి నిర్వహణలో ఉన్న పోలీసులపై కత్తితో దాడి చేసి గాయపరిచిన కేసులో నిందితుడికి సత్తుపల్లి కోర్టు పదేళ్ల కఠిన కారాగార శిక్షతో పాటు రూ.20 వేల జరిమానా విధించింది. ఈ మేరకు సత్తుపల్లిలోని ఆరవ అదనపు జిల్లా సెషన్స్ న్యాయస్థానం న్యాయమూర్తి ఎం. శ్రీనివాస్ తీర్పు వెలువరించారు.

చోరీ కేసు నిందితుడి కోసం గాలిస్తుండగా దాడి

ఏలూరు జిల్లా చాట్రాయి మండలం చిత్తాపూర్ గ్రామానికి చెందిన తిరువీధుల సురేంద్ర అలియాస్ సూర్య (36) ఈ కేసులో నిందితుడిగా ఉన్నాడు. 2025 మార్చి 10న చోరీ కేసుకు సంబంధించి నిందితుడి కోసం సత్తుపల్లి పట్టణ పరిసరాల్లో గాలిస్తున్న పోలీసులపై సురేంద్ర ఉద్దేశపూర్వకంగా కత్తితో దాడి చేసి గాయపరిచాడు. దీంతో అతడిపై సత్తుపల్లి పోలీస్ స్టేషన్‌లో క్రైమ్ నంబర్ 126/2025గా భారతీయ న్యాయ సంహిత (బీఎన్ఎస్) సెక్షన్లు 109, 132, 121(1) కింద కేసు నమోదు చేశారు.

వేర్వేరు సెక్షన్ల కింద శిక్షలు

కేసు విచారణ అనంతరం న్యాయస్థానం నిందితుడికి బీఎన్ఎస్ సెక్షన్ 109 కింద పదేళ్ల కఠిన కారాగార శిక్ష, రూ.10 వేల జరిమానా విధించింది. సెక్షన్ 132 కింద రెండేళ్ల సాధారణ కారాగార శిక్ష, రూ.5 వేల జరిమానా, సెక్షన్ 121(1) కింద ఏడాది సాధారణ కారాగార శిక్ష, రూ.5 వేల జరిమానా విధిస్తూ తీర్పు ఇచ్చింది. మొత్తం రూ.20 వేల జరిమానా విధించింది.

ప్రాసిక్యూషన్‌కు సహకరించిన అధికారులకు అభినందనలు

ఈ కేసులో మొదటి దర్యాప్తు అధికారిగా ఖమ్మం సీసీఆర్‌బీ సబ్ ఇన్‌స్పెక్టర్ టి. కవిత, రెండో దర్యాప్తు అధికారిగా సత్తుపల్లి పోలీస్ స్టేషన్ సబ్ ఇన్‌స్పెక్టర్ ఎస్. వీరప్రసాద్ వ్యవహరించారు. అదనపు పబ్లిక్ ప్రాసిక్యూటర్ డానియల్ న్యాయస్థానంలో ప్రాసిక్యూషన్ తరఫున వాదనలు వినిపించారు. కేసు విచారణ, న్యాయస్థాన ప్రక్రియలో సత్తుపల్లి ఇన్‌స్పెక్టర్ శ్రీహరి, పోలీస్ స్టేషన్ అధికారులు, సిబ్బంది సహకరించారు. కోర్టు లైజన్ అధికారులుగా ఎస్ఐ కె. శ్రీకాంత్, హెడ్ కానిస్టేబుల్ డి. నాగేశ్వరరావు, సీడీఓగా పి.సి. వి. నరేష్, ప్రాసెస్ విధుల్లో హోంగార్డ్ జె. పర్వీన్ అందించిన సహకారాన్ని పోలీస్ కమిషనర్ సునీల్ దత్ అభినందించారు.

# ప్రజ సమస్యలపై 20వ వార్డు కౌన్సిలర్ స్పందన.

**20 వార్డు కౌన్సిలర్ ఉండ్రు వరలక్ష్మి శ్యాంబాబు**
**లాలాపురం రోడ్ లో చెట్లు తొలగింపు.**
**కౌన్సిలర్ వరలక్ష్మి శాంబాబు,**
**మున్సిపల్ చైర్మన్ కాపా చంద్రకళ మురలీకృష్ణలకు**
**కృతజ్ఞతలు తెలిపిన ప్రజలు**

**ఖమ్మం జిల్లా బ్యూరో ప్రజాబలం అక్టోబర్ 28:** 20వ వార్డు శాంతినగర్ నుండి లాలాపురం రోడ్లో ప్రమాదకరంగా దట్టంగా పెరిగిన పిచ్చి మొక్కలు రోడ్డుకు ఇరువైపులా రోడ్డును పూర్తిగా కమ్మేసి పిచ్చి మొక్కలు దట్టంగా పెరిగాయి.. ముఖ్యంగా మూలమలుపులు వద్ద ఎదురుగా వచ్చే వాహనాలు కనిపించకుండా ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి.



ఈ విషయాన్ని 20వ వార్డు కౌన్సిలర్ ఉండ్రు వరలక్ష్మి శ్యాంబాబు దృష్టికి తీసుకెళ్లిన వెంటనే స్పందించి, 20 వ వార్డ్ శాంతి నగర్ నుండి లాలాపురం వెళ్లే రోడ్ కి ఇరువైపులా చెట్లు పెరిగి రోడ్ పై వెళ్లే వాహనాలకు, ఇబ్బందిగా మారటం తో విషయం తెలుసుకున్న కౌన్సిలర్ ఉండరు వరలక్ష్మి శ్యాంబాబు వెంటనే స్పందించి మున్సిపాలిటీ నుండి జేసీబీ ని రప్పించి వాటిని తొలగించడం జరిగింది . ఈ కార్యక్రమంలో వాంకుడోత్ బికియా, పండు, దుర్గా నాయక్, మచ్చ రామారావు, పాల్గొన్నారు.సమస్య ని వెంటనే పరిష్కరించిన 20వ వార్డు కౌన్సిలర్ ఉండ్రు వరలక్ష్మి శ్యాంబాబు లకు వైరా మున్సిపాలిటీ చైర్మన్ డాక్టర్ కాపా చంద్రకళ మురళికృష్ణ లకు, వాహనదారులు ప్రజలు వార్డ్ ప్రజలు కృతజ్ఞతలు తెలియజేసారు.

# పాండచెరువు కట్ట వద్ద

# సీసీ పనులు ప్రారంభించిన చైర్పర్సన్

రామాయంపేట మెదక్ జిల్లా రామాయంపేట మున్సిపాలిటీ పరిధిలోని పాండచెరువు కట్ట వద్ద కళ్యాణ రామచంద్రస్వామి ఆలయ ప్రాంగణంలో సీసీ పనులను బుధవారం నాడు మున్సిపల్ చైర్‌పర్సన్ గజవాడ లావణ్య నాగరాజు ప్రారంభించారు.మెదక్ ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్ రావు ఆదేశాల మేరకు ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఈ పనులను చేపట్టినట్లు తెలిపారు.ఈ సందర్భంగా ఆలయ ప్రాంగణంలో సీసీ రోడ్డు పనులు చేపట్టేందుకు సహకరించిన ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్ రావుకు మున్సిపల్ పాలకవర్గానికి ఆలయ కమిటీ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ పోచమ్మల నవనీత గణేష్ కౌన్సిలర్లు దాకి శ్యామల స్వామి శంకర్ గౌడ్‌తో పాటు ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

# చల్లపల్లిలో తుఫాను భీభత్సం

విజయవాడ ఆర్ణబ్ తుఫాను చల్లపల్లిలో భీభత్సం సృష్టించింది. రాత్రి నుంచి ఇప్పటివరకు ఎడతెరపి లేకుండా వర్షం కురుస్తూనే ఉంది. హోరుగాలి కారణంగా చల్లపల్లి- విజయవాడ రోడ్డులో వక్కలగడ్డ సమీపంలో చెట్లు విరిగి ప్రధాన రోడ్డుకు అడ్డంగా పడిపోయాయి. బుధవారం ఉదయం ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ జిల్లా చైర్మన్ డాక్టర్ డీ.ఆర్.కే.ప్రసాద్ ఆధ్వర్యంలో రెడ్ క్రాస్ వాలంటీర్లు, సుందర చల్లపల్లి కన్వీనర్ డాక్టర్ తరిగోపుల పద్మావతి ఆధ్వర్యంలో స్వచ్ఛ సుందర చల్లపల్లి కార్యకర్తలు, స్థానికులు రోడ్డుకు అడ్డుగా ఉన్న చెట్లను తొలగించి వాహనాల రాకపోకలకు మార్గం సుగమం చేశారు. పంచాయతీ ఈఓ పీవీ మాధవేంద్రరావు తదితరులు పాల్గొన్నారు.

# మధ్యాహ్న భోజన పథకం లో పనిచేస్తున్న 9 నెలల పెండింగ్ బిల్లులు వెంటనే విడుదల చేయాలని కార్మికుల ర్యాలీ





**ములుగు జిల్లా ప్రజాబలం ప్రతినిధి అక్టోబర్ 28 ములుగు** మహిళా వంట కార్మికులను రోడ్డున పడేసే సెంట్రలైజ్డ్ కిచ్చెన్ విధానాన్ని విరమించుకోవాలి, ఏఐటియుసి రాష్ట్ర కమిటీ పిలుపులో భాగంగా శాసన సభ్యుల కార్యాలయాల ముట్టడి కార్యక్రమం బుధవారంములుగు లో తెలంగాణ మధ్యాహ్న భోజన పథకం వర్కర్స్ యూనియన్ ములుగు జిల్లా కమిటీ ఆధ్వర్యంలో జాతీయ రహదారి పై ర్యాలీతో మంత్రి గారి క్యాంపు కార్యాలయం ముట్టడికి వెలుతుండగా వెల్లనివ్వకుండా పోలీసులు అడ్డుకోవడం జరిగినది అక్కడికే సీతక్క పర్సనల్ పిఏ లక్మీని పిలిపించి వినతిపత్రం అందచేయడం జరిగినది అనంతరం అక్కడ ఏర్పాటు చేసిన సమావేశంలో ముఖ్య అథిధి గా హజరైన సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జంపాల రవీందర్ మాట్లాడుతూ, గత 24 సంవత్సరాలుగా వంట పథకం లో స్వంత డబ్బులు పెట్టుకొని నాన్యమైన వంటలు చేస్తూ విధ్యార్థులను స్వంత పిల్లలుగా చూస్తూ భోజనాలు అందిస్తూ వంట బిల్లులు నెలల తరబడి పెండింగ్లో ఉన్నా వంటలు చేస్తున్న వంట కార్మికులకు ఇంత వరకు పరిపాలించిన ఒక్క ప్రభుత్వం కూడా వేతనాలు పెంచక పోయినా గత ప్రభుత్వం అన్యాయం చేయలేదు అన్నారు, కానీ ఎన్నికల ముందు వంట కార్మికులకు అనేక వాగ్ధానాలు చేసిన కాంగ్రెస్ ప్రభుత్వం అన్న మాటలు అమలు చేయకుండా మధ్యాహ్న భోజన పథకం మీదనే ఆధార పడి జీవిస్తున్న రాష్ట్రంలో ఉన్న 54200 మంది వంట కార్మికలను రోడ్డున పడేసే విధంగా, అలాగే విధ్యార్థులకు కూడా నాణ్యమైన భోజనం అందచేయలేని బ్రాహ్మణ సంస్థ లైన హరేరామ- హరేకృష్ణ వారికి కట్టబెట్టడానికి అల్పాహారం పేరుతోనీ (సెంట్రలైజ్డ్ కిచ్చెన్), విధానానికి ముఖ్యమంత్రి ఆత్రుతంగా పనిచేయడం విరమించుకోవాలని డిమాండ్ చేసారు, అందుకు మంత్రి సీతక్క ముఖ్యమంత్రి గారితో మాట్లాడి సమస్యలు పరిష్కరించాలని కోరారు, గత ప్రభుత్వం లో వంట కార్మికుల ధ్వారా నే నిర్వహించిన అల్పాహారం పథకానికి సంబందించిన 2023 2000 24 సంవత్సరంలో 9 నెలల అల్పాహారం బిల్లులు నేటికీ విడుదల చేయకపోవడం వల్ల కార్మికులు అప్పుల ఊబిలోకి కూరుకుపోయారు అన్నారు, కనుక పాత పెండింగ్ బిల్లులు అన్నీ వెంటనే విడుదల చేయాలని, బిల్లులు వేతనాలు ఏ నెలవి ఆ నెలలోనే విడుదల చేయాలని డిమాండ్ చేసారు, కాంగ్రెస్ పార్టీ ఎన్నికల హమీలైన రూ,, 10,000/- వేతనాలు, వంట కార్మికులను తొలగించకుండా జీఓ విడుదల,, వంట సరుకులు, గ్యాస్, కోడిగుడ్లు, మొత్తం ప్రభుత్వమే సరఫరా చేయడం, 12 నెలలకు వేతనాలు విడుదల చేయడం, అతిముఖ్యమైన సెంట్రలైజ్డ్ కిచ్చెన్ విధానం విరమించుకొని అల్పాహారం కూడా వంట కార్మికులతో నే నిర్వహించాలని డిమాండ్ చేసారు, ఈసమస్యలు పరిష్కారం కాని పక్షంలో భవిష్యత్తులో జరిగే ప్రతి ఘరణా పోరాటాలకు కార్మికులు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు ఈ సమావేశంలో ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షులు ముత్యాల రాజు, ప్రధాన కార్యదర్శి బండి నర్సయ్య,నాయకులు , తెలంగాణ మధ్యాహ్న భోజన పథకం వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షులు పోరెడ్డి ప్రమీల, ప్రధాన కార్యదర్శి గడ్డం భారతి, జిల్లా నాయకులు, పదిమండలాల అధ్యక్షులు, కార్యధర్శులు,కుడుముల సమ్మక్క, బండారి భవాని, సామ సమ్మక్క, గున్నాల రాజకుమారి, అంకం పద్మ,జనగాం శోభ, రమ, రజిత,సలువాల స్వరూప, భాగ్యక్క, నాగమణి, మద్ధిభోయిన భారతి, జ్యోతి,, తెలంగాణ మధ్యాహ్న భోజన పథకం వర్కర్స్ యూనియన్ నాయకులు,వంట కార్మికులు ,పోడెం సమ్మక్క,నాగమణి,బొల్లె నర్సమ్మ, లక్ష్మికాంత,సుగుణ, తులసి, రమాదేవి, నాగమణి, రాజకుమారి, సరిత, కనకలక్ష్మి, పుష్ప, లలిత, నాగరాణి, జానకమ్మ, లావణ్య, నిర్మల, వెంకటమ్మ, పార్వతి, చంద్ర,దేవమ్మ, లక్ష్మినర్సమ్మ, వెంకటలక్ష్మి, సత్యవతి, వెంకటమ్మ, పార్వతి, పెంటమ్మ,శంకరమ్మ,సమ్మక్క, భాగ్య, శ్రీదేవి, 400 మంది కార్మికులు తదితరులు పాల్గొన్నారు,

# పొంగులేటి జన్మదిన వేడుకల్లో ఆధ్యాత్మిక సందడి.. అయ్యప్ప స్వాములకు భిక్ష వడ్డించిన ఎమ్మెల్యే రాగమయి









**సత్తుపల్లి, ప్రజాబలం ప్రతినిధి అక్టోబర్ 28:** రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి జన్మదినాన్ని పురస్కరించుకుని సత్తుపల్లి పట్టణంలో అయ్యప్ప స్వాములకు భిక్ష కార్యక్రమాన్ని నిర్వహించారు.

సత్తుపల్లి పట్టణంలోని హరిహరాత్మజ అయ్యప్ప స్వామి దేవాలయంలో మున్సిపల్ చైర్మన్ రెహనా కమల్ పాషా ఆధ్వర్యంలో బుధవారం మధ్యాహ్నం ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు.

ఈ కార్యక్రమానికి సత్తుపల్లి ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి దయానంద్ హాజరై అయ్యప్ప స్వాములకు స్వయంగా భిక్షను అందజేశారు.

మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ఆయురారోగ్యాలతో, మరిన్ని ఉన్నత పదవులు అధిరోహిస్తూ ప్రజలకు నిరంతరం సేవలందించాలని ఆకాంక్షిస్తూ ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు.

ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్, కౌన్సిలర్లు, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు, పట్టణ, మండల కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, అయ్యప్ప స్వాములు తదితరులు పాల్గొన్నారు.

## తెలంగాణ ప్రభుత్వం పెరిగిన ధరలకు అనుకూలంగా కొత్త మెనూ ప్రకారం మంజూరు చేయాలి తెలంగాణ స్పీకర్ ను కలిసిన ఉద్యోగులు



**వికారాబాద్ నియోజకవర్గ ప్రతినిధి అక్టోబర్ 28(ప్రజాబలం) వికారాబాద్ జిల్లా:**తెలంగాణ ప్రభుత్వం డైట్ చార్జెస్ ను డిసెంబర్ 2024 లొ పెంచడం జరిగింది . అప్పటి నుండి ఇప్పటివరకు నూతన మెనూ ను అమలు చేయడం మార్కెట్ లో దొరికే రేట్ల కంటే 52 శాతం అధికంగా సరుకులు సరఫరా చేస్తున్నారు. 2024 లో చేసిన మెనూ ను 2026 లో సెంట్రాలైజ్డ్ టెండర్ రేట్లకు అమలు చేయడం సాధ్యం కాదు కావున ప్రస్తుత రేట్ ల ప్రకారం కొత్త మెనూ తయారు చేయాలని వికారాబాద్ శాసనసభ్యులు తెలంగాణ శాసనసభ పతి స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ను కలిసి కొత్త మెనూ ప్రకారం ఇవ్వాలని తెలపడం జరిగింది,టీజీఎల్ఏ గారికి ,గౌరవ జిల్లా కలెక్టర్ గారికి కోరడం జరిగింది. అదేవిధంగా ఎస్సీ, ఎస్టి, బీసీ,జిల్లా సంక్షేమ అధికారులను కలిసి సమస్యను వివరించడం జరిగింది. ఈ కార్యక్రమంలో వికారాబాద్ జిల్లా బిసి ఉద్యోగుల సంఘం అధ్యక్షులు తుల్జారామ్ గౌడ్, టి ఎన్ జి ఓజిల్లా కార్యదర్శి అజ్మత్ పాషా , రమేష్ , హెచ్ డబ్ల్యు ఓ ఎస్ యూనియన్ అధ్యక్షుడు బి. శుక్ర వర్ధన్ రెడ్డి, కార్యదర్శి టి. విజయ్ కుమార్ మరియు జిల్లాలోని అందరూ హెచ్ డబ్ల్యు ఓ ఎస్ పాల్గొనడం జరిగింది.



## బాలల భద్రతకు సమాజమంతా బాధ్యత వహించాలి పోక్సో చట్టంపై విద్యార్థినులకు న్యాయ అవగాహన



**వేములవాడ ప్రజాబలం ప్రతినిధి( అక్టోబర్ - 28 )**బాలల హక్కులను కాపాడుతూ, వారిపై జరిగే లైంగిక వేధింపులను అరికట్టేందుకు ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని సీనియర్ సివిల్ జడ్జి అజయ్ కుమార్ జాదవ్ అన్నారు. బుధవారం వేములవాడ జెడ్పీహెచ్ఎస్ బాలికల ఉన్నత పాఠశాలలో రాజన్న సిరిసిల్ల జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో కేంద్ర ప్రభుత్వ 'సురక్షిత్ బచ్పన్ అభియాన్' కార్యక్రమంలో భాగంగా పోక్సో చట్టంపై న్యాయ అవగాహన కార్యక్రమం నిర్వహించారు.

ఈ సందర్భంగా జడ్జి మాట్లాడుతూ, బాలల రక్షణ కోసం పోక్సో చట్టం అమలులో ఉందని, ఎవరైనా వేధింపులకు గురైతే భయపడకుండా తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు లేదా సంబంధిత అధికారులకు తెలియజేయాలని విద్యార్థులకు సూచించారు. డీఎస్పీ శ్రీనివాసులు మాట్లాడుతూ, బాలలపై వేధింపులు జరిగినా, అనుమానాస్పద ఘటనలు ఎదురైనా వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని తెలిపారు. న్యాయవాదుల సంఘం అధ్యక్షుడు పిట్టల మనోహర్ మాట్లాడుతూ, బాలలకు చట్టాలపై అవగాహన కల్పించడం ద్వారా వారిలో ఆత్మవిశ్వాసం, ధైర్యం పెంపొందుతాయని పేర్కొన్నారు.

ఈ కార్యక్రమంలో పోలీసు అధికారులు, అర్బన్ ఎంఈఓ సదానందం, పాఠశాల ప్రధానోపాధ్యాయులు బన్నాజీ, ఉపాధ్యాయులు, సీఆర్పీ ఆకుల శ్రీనివాస్ ,సీనియర్ సివిల్ కోర్టు ఏపీపి, ఏజిపి అవధూత రజనీకాంత్, బొడ్డు ప్రశాంత్ కుమార్,న్యాయవాదుల సంఘం ఉపాధ్యక్షులు గొంటి శంకర్, జాయింట్ సెక్రెటరీ కనికరపు శ్రీనివాస్, మహిళా ప్రతినిధి తమిరి అన్నపూర్ణ, జూనియర్ ఈసీ మెంబర్లు నాయిమా నాసారి, వడ్లకొండ శ్రీకాంత్ న్యాయవాదులు కుంట శ్రీనివాస్, రేగుల రాజ్ కుమార్, బీమా మహేష్ బాబు, నాగేంద్ర, గంప మహేష్, అర్బన్ ఎంఈఓ సదానందం, పాఠశాల ప్రధానోపాధ్యాయులు బన్నాజీ, ఉపాధ్యాయుని ఉపాధ్యాయులు సిఆర్పి ఆకుల శ్రీనివాస్ పాల్గొన్నారు




Edited ,Printed Published & Owned by A.SRAVANTHI ,Printed at: SRAVANTHI ENTER PRISES 1-9-18/A,Ramnagar,Hyderabad - 500020, T.S
and Published at 5-2-518,Osmangunj ,Risala Abdulla,Hyderabad -95 Editor; A.SRAVANTHI, RNI NO ; TELTEL/2005/16755 Cell ; 92921 04449
Email;prajaabalamnews@gmail.com